


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




**ముఖ ఆధారిత హాజరుపై పకడ్బందీ చర్యలు చేపట్టండి**

విద్యాశాఖ అధికారులతో సమీక్షలో మంత్రి లోకేష్ ఆదేశం

- వివరాలు 4 లో.

# రెండేళ్లలో 5వేల దేవాలయాలు

- నిర్మాణ పర్యవేక్షణకు రాష్ట్రస్థాయి కమిటీ
- ప్రాంతాల అభివృద్ధికి టెంపుల్ టౌన్ డెవలప్‌మెంట్ ప్లాన్
- దేవాదాయ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



3

"శ్రీవాణి నిధులతో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు నిర్మించాలని గతంలోనే నిర్ణయించాం. ఈ ఆలయాల నిర్మాణ బాధ్యత జిల్లా యంత్రాంగానికి అప్పగించాలని ఆలోచన చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గంలోనూ 25-30 వరకూ ఆలయాలను నిర్మించే అవకాశం ఉంటుంది. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఆలయాల నిర్మాణాన్ని చేపట్టాలి. వారినుంచి ప్రతిపాదనలు తీసుకుని నిర్మాణం చేపట్టండి.



## స్వీయ గణనను పూర్తి చేశా

### ఎక్స్ ట్వీట్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): మన రాష్ట్రంలో గురువారం ప్రారంభించిన జనగణన గృహ జాబితా ప్రక్రియలో భాగంగా నా స్వీయ గణనను పూర్తి చేశానంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తోన్న జనగణనలో భాగంగా గురువారం నుంచి ప్రారంభమైన 'సెల్ఫ్ ఎన్యూమరేషన్'లో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వీయ గణనను పూర్తి చేశారు. అనంతరం ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "ప్రతి కుటుంబం కొన్ని నిమిషాలు కేటాయించండి. తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఈ ముఖ్యమైన కార్యక్రమంలో భాగం కావాలని విజ్ఞప్తి చేస్తున్నా. మీ భాగస్వామ్యం మేము మెరుగైన ప్రణాళికను రూపొందించడానికి, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా చూడటానికి సహాయపడుతుంది" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## జీఎస్డీపీ లక్ష్యాలపై సూక్ష్మస్థాయి ప్రణాళికలు

- ఉత్పాదకత పెంచటంపై అన్ని శాఖల దృష్టి
- సాస్కీ పూర్వోదయ పథకాల ద్వారా అభివృద్ధి ప్రాజెక్టులు
- ఆర్థిక శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

2





రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని గురువారం అడుసుమిల్లి మల్లికార్జున రావు నేతృత్వంలో గుడివాడ శ్రీ సాయి సత్సంగం సభ్యులు కలిశారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.1,05,200 విరాళం అందించారు.




ధార్మిక కార్యక్రమాలపై ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని విశ్వహిందూ పరిషత్ ముఖ్యనేతలు మంత్రి లోకేష్‌కు స్పష్టం చేశారు. గురువారం ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి.. గోసంరక్షణ, గోవధ నిషేధం, దేవాలయ భూముల పరిరక్షణపై చర్చిస్తున్న దృశ్యం.

## "జగన్‌ది.. ముమ్మాటికీ సైకోయిజమే"

అమరావతి (చైతన్య రథం): "అభివృద్ధికి మోకాలడ్డటం, పేదవర్గాలకు ప్రభుత్వం చేకూర్చే లబ్దిని అడ్డుకోవడం.. ముమ్మాటికీ సైకోయిజమే"నని వైసీపీ అధినేత జగన్‌రెడ్డిపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "తల్లిని తరిమేశారు. చెల్లిని గెంటేశారు. దైవమంటే భక్తి లేదు. దేశం అంటే ద్వేషం. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటారు. ఉద్యోగాలు వస్తాయంటే ఉసూరుమంటూ ఏడుస్తారు. నిలువెల్లా స్వార్థం, మనసంతా విధ్వంసంతో.. రప్పా రప్పా నరుకుతాం. అమరావతిని మార్చేస్తాం. కట్టినవన్నీ కూల్చేస్తాం. కంపెనీలన్నీ వెళ్లగొడతాం అంటారు. ఏమిటీ దుర్మార్గ పనులు జగన్‌మోహన్‌రెడ్డీ! దేశ రక్షణకు అధునాతన బోట్లు తయారు చేసే కంపెనీ రాష్ట్రానికి వస్తే స్వాగతించాల్సింది పోయి, తరిమేస్తానంటారా? ఇదేం రాక్షస మనస్తత్వం? మత్స్యకారుల పిల్లలకు మెరుగైన వెయ్యికిపైగా ఉద్యోగాలు వస్తాయంటే.. ఆనందించాల్సింది పోయి, అడ్డుకుంటాననడం ముమ్మాటీకీ సైకోయిజమే" అని మంత్రి లోకేష్ ఎద్దేవా చేశారు.

### మౌలిక సదుపాయాల పనులను

## ఎస్ఎంసీలకు అప్పగించండి



- అన్ని ప్రభుత్వ పాఠశాలలను త్రీస్టార్‌కు చేర్చేలా చర్యలు
- ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాల పెంపుదలకు డోర్ టు డోర్ క్యాంపెయిన్
- ప్రభుత్వ కాలేజీల్లో అత్యుత్తమ మార్కులపై ప్రచారం కల్పించండి
- పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్

4

## సమాన అవకాశాల దిశగా కీలక అడుగు

- డిలిమిటేషన్ బిల్లుకు కూటమి ప్రభుత్వం స్వాగతం
- ప్రతి రాష్ట్రానికి 50శాతం లోక్‌సభ స్థానాల పెంపు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

5





## కందుకూరికి సీఎం ఘన నివాళి



అమరావతి (చైతన్య రథం): సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు 178వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఘన నివాళి అర్పించారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. "స్త్రీవిద్య కోసం ఉద్యమించిన మహనీయుడు కందుకూరి. ఆనాటి దురాచారమైన బాల్య వివాహాలను ఖండించి, వితంతు వివాహాలు ప్రోత్సహించిన ధీశాలి. ఆ మహనీయుడిని స్మరించుకుంటూ ఘననివాళి అర్పిస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

### కర్నూలు జిల్లా రోడ్డు ప్రమాదంపై

## ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి




అమరావతి (చైతన్య రథం): కర్నూలు జిల్లా చిలకలడోన వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బొలెరో-లారీ ఢీకొన్న ప్రమాదంలో 8మంది మృత్యువాత పడటంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంపై సీఎం ఆరా తీశారు. కర్ణాటకకు చెందిన భక్తుల వాహనం మంత్రాలయం దర్శనానికి వస్తుండగా తెల్లవారుజామున 3.30 గంటలకు ప్రమాదం జరిగిందని, ఘటనా స్థలంలోనే 8మంది మృతి చెందారని వివరించారు. గాయపడిన 10మందికి ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని, తీవ్రంగా గాయపడిన వారిని కర్నూలు జీజీహెచ్‌కు తరలించి వైద్యం అందిస్తున్నట్టు వివరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సీఎం తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## దిగ్భ్రాంతికి గురిచేసింది: లోకేష్

అమరావతి (చైతన్య రథం): కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకకు చెందిన పలువురు భక్తులు దుర్మరణం పాలవడం దిగ్భ్రాంతికి గురిచేసిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "మంత్రాలయం దర్శనానికి వెళ్తూ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టాం. మృతుల కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు.

## నీ ప్రతిభ తరువాతి తరాలకు ధైర్యమివ్వాలి

### చెస్ క్రీడాకారాణి వైశాలికి లోకేష్ అభినందనలు



అమరావతి (చైతన్యరథం): "నీ ప్రతిభ, బోర్డుపై నువ్వు చూపించే ఆధిక్యం.. తరువాతి తరాల గుండెల్లో ధైర్యం నింపాలి" అని చెస్ క్రీడాకారిణి వైశాలిని విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "మహిళల క్యాండిడేట్స్ విభాగంలో విజయం సాధించి,ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం పొందిన ఆర్ వైశాలికి అభినందనలు. ఫైడ్ ఉమెన్ క్యాండిడేట్స్ 2026లో జూ వెన్‌జున్‌తో తలపడనున్న నేపథ్యంలో, శుభాకాంక్షలు. బోర్డుపై నువ్వు ప్రదర్శించే ప్రతిభ, కొత్తతరం యువ భారతీయులను పెద్ద కలలు కనడానికి, ధైర్యంగా ఆలోచించడానికి ప్రేరేపిస్తుందని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు.

# జీఎస్డీపీ లక్ష్యాలపై సూక్ష్మస్థాయి ప్రణాళికలు



- ఉత్పాదకత పెంచటంపై అన్ని శాఖల దృష్టి
- సాస్కీ, పూర్వోదయ పథకాల ద్వారా అభివృద్ధి ప్రాజెక్టులు
- ఆర్థిక శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు వీలుగా మైక్రో, మాక్రోస్థాయిలో ప్రణాళికలు అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా పూర్తిస్థాయి ఉత్పాదకతను చేరుకోవాలని ఆర్థికశాఖకు సూచించారు. 15 శాతంమేర వృద్ధి రేటు లక్ష్యాన్ని చేరుకునేలా క్షేత్రస్థాయి వరకూ ఈ ప్రణాళికల్ని సమర్థంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఆర్థిక శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నీరు, విద్యుత్‌లాంటి వనరుల్ని వ్యవసాయానికి, పరిశ్రమలకు అవసరమైనంత మేరకు అందిస్తున్నామని.. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉత్పాదకత పెంపు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులున్నా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని.. అలాగే గత పాలకుల నిర్ణయాల కారణంగా తలెత్తిన రూ.4600 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ప్రజలపై ఎలాంటి భారం లేకుండా ఆదాయార్జన శాఖలు రెవెన్యూ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు పూర్తి అయితే సంపద సృష్టికి అవకాశాలు ఏర్పడతాయని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాధాన్యతా ప్రాజెక్టులకు ఎలాంటి నిధుల కొరతా లేదని కేంద్ర సహకారంతో వాటిని పూర్తిచేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

పూర్వోదయ, సాస్కిలాంటి వివిధ కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు వేగవంతం కావాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. సంక్షేమ క్యాలెండర్‌కు అనుగుణంగానే పథకాలను అమలు చేస్తామని సీఎం అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. పేదలకు అన్నంపెట్టే అన్న క్యాంటీన్లను గత పాలకులు నిర్దయగా మూసివేశారని.. ఎన్ని ఇబ్బందులున్నా అన్నార్తుల కడుపు నింపేలా రాష్ట్రవ్యాప్తంగా 269 క్యాంటీన్లలో భోజనం పెడుతున్నామన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో సామర్థ్యంతో పాటు సులభతరమైన విధానాల ద్వారా పెట్టుబడులు, ఆదాయాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ సాయిప్రసాద్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# స్వీయ జనగణనలో వివరాలు నమోదు చేసిన సీఎం

### జనగణన ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపు



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో గురువారంనుంచి ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. హౌస్ లిస్టింగ్- హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియ ఇవాళ ప్రారంభమైంది. ంవ.ఎవఅంబం.ష్ట్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ముఖ్యమంత్రి వివరాలను నమోదు చేశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియను ఏపీ జనగణన డైరెక్టర్ జె నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈనెల 30 వరకూ ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని ముఖ్యమంత్రికి తెలిపారు. మే 1 నుంచి 30 వరకూ ఎన్యూమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపడతారని తెలియచేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో పౌరులందరికీ సమానంగా సంక్షేమం అభివృద్ధి ఫలాలు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దీని కోసం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికల్ని రూపొందించటం అవసరమని, లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ఏపీలో జనగణన కార్యక్రమం జరుగుతోందని.. ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాకుండా అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. జనాభా లెక్కల కార్యక్రమం రెండుదశల్లో జరుగనుందని.. మొదటి దశలో ఇవాల్టి నుంచే ఇండ్ల గణన ప్రారంభమైందన్నారు. వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే రెండో దశలో జనాభా లెక్కల సేకరణ మొదలవుతుందన్నారు. ప్రస్తుతం ప్రారంభమైన ఇండ్ల గణన (హౌస్ లిస్టింగ్-హౌస్ సెన్సెస్) కార్యక్రమంలో ప్రజలు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సరైన వివరాలను నమోదు చేయటం ద్వారా రాష్ట్రాభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలను కోరారు.మొత్తం జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

# రెండేళ్లలో 5వేల దేవాలయాలు



- నిర్మాణ పర్యవేక్షణకు రాష్ట్రస్థాయి కమిటీ
- ప్రాంతాల అభివృద్ధికి టెంపుల్ టౌన్ డెవలప్‌మెంట్ ప్లాన్
- దేవాదాయ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): శ్రీవాణి నిధులతో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్న 5 వేల దేవాలయాలను వచ్చే రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఆలయాల నిర్మాణ పర్యవేక్షణకు రాష్ట్రస్థాయి కమిటీ వేయాలని సీఎం సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో దేవాదాయ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "శ్రీవాణి నిధులతో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు నిర్మించాలని గతంలోనే నిర్ణయించాం. ఈ ఆలయాల నిర్మాణ బాధ్యత జిల్లా యంత్రాంగానికి అప్పగించాలని ఆలోచన చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గంలోనూ 25-30 వరకూ ఆలయాలను నిర్మించే అవకాశం ఉంటుంది. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఆలయాల నిర్మాణాన్ని చేపట్టాలి. వారినుంచి ప్రతిపాదనలు తీసుకుని నిర్మాణం చేపట్టండి. ఆలయాల నిర్మాణానికి సంబంధించి మూడురకాల డిజైన్లతో పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించాలి. వీటి నిర్మాణానికి సంబంధించి త్వరితగతిన అనుమతులిచ్చేలా చర్యలు తీసుకోవాలి. ప్రతీ దేవాలయానికీ ప్రహరీ నిర్మాణం చేపట్టాలి" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

### పవిత్రతతోపాటు పారిశుద్ధ్యమూ ముఖ్యం

"రాష్ట్రంలోని 22 ప్రముఖ దేవాలయాలకు మాస్టర్ ప్లాన్లు రూపొందించాలి. ఇప్పటి వరకు సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, పెనుగంచిప్రోలు, శ్రీకాళహస్తి, కాణిపాకం దేవాలయాలకు మాస్టర్ ప్లాన్లు సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన దేవాలయాలకూ మాస్టర్ ప్లాన్‌లను త్వరితగతిన రూపొందించాలి.
ఈ మాస్టర్ ప్లాన్‌ల ద్వారా భక్తులకు మెరుగైన సదుపాయాలు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, నివాస సౌకర్యాలు, పరిశుభ్రతవంటి అంశాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలి. దేవాలయాల్లో పవిత్రతోపాటు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమివ్వాలి. దేవుణ్ణి దర్శించుకోవడానికి వచ్చే భక్తులు భక్తిభావంతో దర్శనం చేసుకునే వాతావరణం ఉండేలా చేయడంతో పాటు.. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే భక్తులు సంతృప్తితో తిరిగి వెళ్తారు. గతంతో పోల్చుకుంటే రాష్ట్రంలోని దేవాలయాలకు భక్తుల సందర్శన పెద్దఎత్తున పెరుగుతోంది. ప్రధాన దేవాలయాల్లో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. 2025 - 26 సంవత్సరంలో శ్రీశైలం, విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయాల్లో 1.2 కోట్లకుపైగా భక్తులు దర్శించుకున్నారు. శ్రీకాళహస్తిలో 83.88 లక్షలు, సింహాచలంలో 65.48 లక్షలు, అన్నవరంలో 57.87 లక్షలు, ద్వారకా తిరుమలకు 55.15 లక్షలమంది భక్తులు సందర్శించారు. దేవాలయాలకు వచ్చే భక్తులకు అన్నిరకాల సౌకర్యాలూ కల్పించాల్సిన బాధ్యత దేవాదాయ శాఖపైనే ఉంది. భక్తులకు తాగు నీటి సౌకర్యం మొదలుకుని అన్నదానం వరకూ అన్ని రకాల సేవలను అందించాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

### తిరుమల తరహాలో అన్న ప్రసాద వితరణ చేపట్టాలి

"రాష్ట్రంలోని 111 దేవాలయాల్లో అన్న ప్రసాదాన్ని అందిస్తుంటే... 65 దేవాలయాల్లో నిత్యాన్నదానం అందిస్తున్నాం. తిరుమల తరహాలోనే ఇతర దేవాలయాల్లోనూ అన్న ప్రసాదం అందించాలి. ప్రస్తుతం రాష్ట్రంలోని దేవాలయాల్లో రోజుకు సుమారు 80 వేలమంది భక్తులకు అన్న ప్రసాదం అందుతోంది. దీనికోసం ఏడాదికి రూ.157.85 కోట్లు వ్యయం అవుతోంది. ఆయా దేవాలయాల్లో పాకశాలల్లో పని చేసేవారికి శిక్షణ ఇప్పించాలి. దేవాలయాల అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్ ద్వారా జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. నిర్దిష్టమైన గడువులోకా సీజీఎఫ్ నిధులతో చేపట్టే దేవాలయాల నిర్మాణాలను పూర్తి చేయాలి. అన్ని ప్రధాన ఆలయాల్లో వాట్సాప్ ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. అన్ని రకాల సేవలను ఆన్ లైన్లో అందుబాటులో ఉంచాలి. అన్ని ఆలయాలకూ ప్రత్యేక వెబ్‌సైట్లు రూపొందించాలి. సమగ్ర వివరాలతో డ్యాష్‌బోర్డ్ కూడా అందుబాటులోకి తీసుకురావాలి. ఆగమ సలహా మండలి, ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్, స్టాండింగ్ కౌన్సిల్ నియామకాన్ని త్వరితగతిన చేపట్టండి. ఇంకా పెండింగులో ఉన్న దేవాలయాల పాలక మండళ్లను వెంటనే నియమించాలి" అని సీఎం సూచించారు.

### దేవాలయాల సమీప ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి


"ఆధ్యాత్మిక టూరిజం ప్రమోట్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. అన్ని దేవాలయాల వద్ద వసతి సౌకర్యాలు మెరుగవ్వాలి. ప్రముఖ దేవాలయాలున్న ప్రాంతాలన్నీ అభివృద్ధి జరిగేలా చూడాలి. దీనికోసం టెంపుల్ టౌన్ డెవలప్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేయాలి. భక్తుల రద్దీ నియంత్రణ విషయంలో టీటీడీ అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయండి. కేవలం భద్రత ఆధారంగా కాకుండా సంప్రదాయం ప్రకారం దేవాలయాల్లో నిబంధనలుండాలి. దేవాదాయ భూముల రక్షణకు బ్లాక్ చైన్ టెక్నాలజీని వినియోగించాలి. దేవాదాయ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. ఈవోలు బదిలీపై వెళ్లే సమయంలో కొత్తగా వచ్చే అధికారులకు ముఖ్యమైన వివరాలను అందించి వెళ్లాలి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మంత్రుల సింగపూర్ పర్యటన
# సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి (చైతన్యరథం): సింగపూర్‌లో అభివృద్ధి విధానాలను ఏవిధంగా రాష్ట్రంలో అమలు చేయవచ్చో అధ్యయనానికి మంత్రుల బృందం సమాయత్తమవుతోంది. ఈనెల 21న సింగపూర్ వెళ్లనున్న 9మంది మంత్రుల బృందంతో సీఎం చంద్రబాబు గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, జనార్ధన్‌రెడ్డి తదితరులకు దిశానిర్దేశం చేశారు. సింగపూర్‌లో పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. అక్కడి విధానాలను రాష్ట్రంలో ఎలా అమలు చేయవచ్చో పరిశీలించాలన్నారు. రాష్ట్రంలో అమలు చేయగలిగే ఉత్తమ విధానాలను అధ్యయనం చేయాలని, తెలుసుకున్న విధానాలను అందరికీ చెప్పి



ఉత్తమ విధానాల అమలుకు కృషి చేయాలని సూచించారు. ఈనెల 21నుంచి 27వరకు మంత్రుల బృందం సింగపూర్‌లో పర్యటించనుంది. పరిపాలన, లా అండ్ ఆర్డర్, రోడ్లు, పర్యాటక రంగాలపై మంత్రుల బృందం అధ్యయనం చేయనుంది.



చైతన్యరథం

# మౌలిక సదుపాయాల పనులు
# ఎస్ఎంసీలకు అప్పగించండి

- అన్ని ప్రభుత్వ పాఠశాలలను త్రీస్టార్‌కు చేర్చేలా చర్యలు
- ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాల పెంపుదలకు డోర్ టు డోర్ క్యాంపెయిన్
- ప్రభుత్వ కాలేజీల్లో అత్యుత్తమ మార్కులపై ప్రచారం కల్పించండి
- పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లకు అప్పగించి త్వరిగతిన పూర్తిచేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... "రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో త్రీ స్టార్ మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యిమందికి పైబడి విద్యార్థులున్న పాఠశాలలు 60 ఉన్నాయి. ఆ స్కూళ్లలో ఫైవ్‌స్టార్ సదుపాయాల కల్పనపై దృష్టిసారించండి. మంగళగిరి నియోజకవర్గం నిడమర్రు ప్రాథమికోన్నత పాఠశాలలో సీట్ల కోసం పోటీ ఉంది. ఇది మంచి పరిణామం. లీక్ ప్రూఫ్ బిల్డింగ్స్, తాగునీరు, టాయ్ లెట్లు, పెయింట్స్, బల్లల ఏర్పాటువంటి పనులను ఎస్ఎంసీలకు అప్పగించండి. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.143.27 కోట్లు అవసరం. ఈ పనులను మాత్రం రాష్ట్ర పాఠశాల మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా చేపట్టండి. ఈ ఏడాది మోడల్ ప్రైమరీ స్కూళ్లలో కనీస మౌలిక సదుపాయాలకు రూ.571.11 కోట్లు అవసరమవుతాయని నివేదించారు. వివిధ విభాగాల ద్వారా నిధులను సేకరించి సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయండి. ఏజన్సీ, మారుమూల ప్రాంతాల్లో సొంత భవనాలులేని పాఠశాలలను గుర్తించి వెంటనే పనులు చేపట్టాలి" అని మంత్రి లోకేష్ ఆదేశించారు.

ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లపై అధికారులు దృష్టిసారించాల్సిందిగా మంత్రి లోకేష్ అధికారులకు సూచించారు. "ఎన్‌రోల్‌మెంట్ పెంపుదలకు డోర్ టు డోర్ కాంపెయిన్ నిర్వహించండి. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను కూడా ఇందులో భాగస్వాములను చేస్తాం. ఈసారి 10శాతం అడ్మిషన్ల పెంపుదల లక్ష్యంగా పనిచేయాలి. పాఠశాలల్లో డ్రాపవుట్స్‌ను జీరోస్థాయికి చేర్చాలి. బడిఈడు గల పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో స్కూలు బయట ఉండకూడదు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంపుదలకు కృషిచేయండి. స్కూళ్లలో జెండర్ సెన్సిటివిటీకి సంబంధించి మహిళలను కించపర్చే పదాలు ఎక్కడా ఉపయోగించకుండా విద్యార్థులకు అవగాహన కల్పించాలి. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సంబంధించి శాప్ అధికారులతో సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో విస్తృత చర్యలు చేపట్టాలి. ఆసక్తిగల విద్యార్థులను గుర్తించి బ్యాడ్మింటన్, ఆర్చరీ, ఖోఖోవంటి ఆటల్లో ప్రోత్సహించాలి. కళాశాలస్థాయిలో లీగ్స్ నిర్వహించే అంశాన్ని పరిశీలించండి" అని ఆదేశించారు. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు జూనియర్ కళాశాలలకు అనుమతులకు సంబంధించి మార్గదర్శకాలపై సమీక్షించారు. ఇంటర్మీడియట్‌లో పలువురు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రైవేటుకు ధీటుగా ఉత్తమ మార్కులు సాధించడంపై మంత్రి లోకేష్ హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గుర్తించి విస్తృత ప్రచారం నిర్వహించాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. అటువంటివారిని షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో సత్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో రాష్ట్ర మానవవనరుల కార్యదర్శి కోన శశిధర్, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ రంజిత్ బాషా, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా, పాఠశాల మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# ధార్మిక కార్యక్రమాలపై
# ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం!

- మంత్రి లోకేష్‌ను కలిసిన విశ్వహిందూ పరిషత్ ముఖ్యనేతలు
- గోసంరక్షణ, గోవధ నిషేధం, దేవాలయ భూముల పరిరక్షణపై చర్చ
- గత ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసులను తొలగిస్తాం: లోకేష్ హామీ



అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్‌ను విశ్వ హిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర కార్యదర్శి తనికెళ్ళ సత్య రవికుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆర్ఎస్ఎస్ కార్యకర్త దొరస్వామి, ఆంధ్రప్రదేశ్ విశ్వ హిందూ పరిషత్ కోశాధ్యక్షులు వలిపర్తి దుర్గా ప్రసాద్‌రాజు, ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్‌లు ఉండవల్లి నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గోసంరక్షణకు గోశాలల నిర్మాణ ఆవశ్యకత, దేవాదాయ భూముల పరిరక్షణ, పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో డ్రగ్స్‌పై ఎటువంటి కఠిన చర్యలు తీసుకుంటున్నారో.. అదేవిధంగా అక్రమ గోరవాణా, గోవధపై కఠినమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. "పంచాలయ వ్యవస్థగా దేవాలయాలను తీర్చిదిద్దాలి. ధార్మిక ప్రచారం, సామాజిక సేవా కార్యక్రమాలు దేవాలయాల ద్వారా నిర్వహించాలి. ధార్మికతకు భంగం కలగని విధంగా దేవాలయ భూములపై ఆదాయం పెంచే మార్గాలు పరిశీలించాలి. దేవాలయ భూములను దీర్ఘకాలిక లీజుకిచ్చే విధానాన్ని సవరించాలి. అన్యాక్రాంతమైన దేవాలయ భూములను వెంటనే స్వాధీనం చేసుకుని పరిరక్షించాలి. గత ప్రభుత్వంలో హిందువులపై బనాయించిన అక్రమ కేసులను తొలగించాలి. రాజకీయాలకు అతీతంగా పూర్తిస్థాయి ధార్మిక పరిషత్తును హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, ధార్మిక పెద్దలతో ఏర్పాటు చేయాలి. హిందూ సమాజాన్ని జాగృతం చేసి భక్తిభావాన్ని పెంపొందించేందుకు విశ్వహిందూ పరిషత్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుంది" అని వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో హైందవ భక్తులపై పెట్టిన అక్రమ కేసులను తొలగిస్తామని, హిందూ ధర్మ పరిరక్షణకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి లోకేష్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

---

### ఉన్నత విద్యలో ముఖ ఆధారిత
## హాజరుపై పకడ్బందీ చర్యలు చేపట్టండి
### విద్యాశాఖ అధికారులతో సమీక్షలో మంత్రి లోకేష్ ఆదేశం

ఉండవల్లి (చైతన్యరథం): రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో మరింత పారదర్శకత కోసం వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేయనున్న ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ విషయంలో పకడ్బందీ చర్యలు చేపట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఉన్నత విద్య అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర ఉన్నత విద్యా సంస్థల వివరాలతో పాటు సిబ్బంది, విద్యార్థుల ముఖ ఆధారిత గుర్తింపు కోసం ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై మంత్రి ఆరా తీశారు. నాణ్యమైన విద్యా బోధనకు ముఖ ఆధారిత హాజరు ఉపయుక్తంగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నత విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

---

### 'సోదరుడి అభిమానానికి
## హృదయపూర్వక ధన్యవాదాలు'



అమరావతి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన తనను అభినందించి, శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "మీ ఆశీస్సులతో, మీ ఆకాంక్షమేరకు కూటమి స్ఫూర్తి మరింత స్నేహపూర్వకంగా.. సమన్వయంతో, రాష్ట్ర ప్రగతి - ప్రజా సంక్షేమం లక్ష్యంగా కొనసాగుతుంది. తమ్ముడిగా నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. సోదరుడిగా మీరు చూపిస్తున్న అభిమానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు.

# సమాన అవకాశాల దిశగా కీలక అడుగు



- డిలిమిటేషన్ బిల్లుకు కూటమి ప్రభుత్వం స్వాగతం
- ప్రతి రాష్ట్రానికి 50% లోక్‌సభ స్థానాల పెంపు
- మహిళల సాధికారతకు కేంద్రం కట్టుబడి ఉంది
- బిల్లులను అన్ని వర్గాల ప్రజలు స్వాగతించాలి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం(చైతన్యరథం): పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు దేశవ్యాప్తంగా సమతుల్య ప్రతినిధిత్వానికి దారి తీసే చారిత్రాత్మక అడుగుగా నిలుస్తుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ బిల్లు దక్షిణ రాష్ట్రాలకు నష్టం కలిగిస్తుందన్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికగా కాకుండా ప్రతి రాష్ట్రానికి సమానంగా సుమారు 50 శాతం లోక్‌సభ స్థానాల పెంపు జరగనుంది. దీంతో దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం జరుగు తుందన్న అనుమానాలకు తావులేదు. కొందరు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు అపోహలు మాత్రమేనని అన్నారు. ఏపీని తీసుకుం టే ప్రస్తుతం ఉన్న సుమారు 25 లోక్‌సభ స్థానాలు భవిష్యత్తులో దాదాపు రెండింతలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇది అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించే విధానమని వివరించారు. ఈ బిల్లును తీసుకువచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రశంసించారు. సమతుల్య అభివృద్ధి-సమాన అవకాశాల సాధనకు ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, జాతీయ దృక్పథం మరింత స్పష్టమవుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతూ దేశ ప్రయోజనాలతో సమ న్వయం చేసే నాయకత్వం చంద్రబాబుదేనని తెలిపారు. పార్లమెంట్‌లో డిలిమిటేషన్ బిల్లుతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా ప్రవేశపెట్టడం ద్వారా మహిళల సాధికారతకు కేంద్రం కట్టుబడి ఉందని, ఈ నిర్ణయాలు దేశ రాజకీయ వ్యవస్థలో నూతన మార్పులకు నాంది పలుకుతాయని తెలిపారు. దేశంలో సమాన ప్రతినిధిత్వం, ప్రజాస్వామ్య పటిష్ట తకు దోహదపడే ఈ బిల్లులను అన్ని వర్గాల ప్రజలు స్వాగతిం చాలని కోరారు.

# నర్సింగ్ విద్యాసంస్థల ఏర్పాటుపై కీలక నిర్ణయం

- ప్రభుత్వ ప్రకటనల్లో వచ్చిన దరఖాస్తులే పరిగణన
- స్వచ్ఛందంగా పెట్టుకున్నవి పరిశీలించబడవు
- రాష్ట్రంలో నర్సుల డిమాండ్.. సప్లై ఆధారంగా నిర్ణయం
- నర్సింగ్ విద్యాసంస్థల ఫీజు సవరణపై కమిటీ ఏర్పాటు
- వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఇబ్బడిముబ్బడిగా నర్సిం గ్ విద్యా సంస్థల ఏర్పాటు నేపథ్యంలో ప్రతి సంవత్సరం వేలాది నర్సింగ్ సీట్లు మిగిలిపోతున్నందున పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి రాష్ట్ర అవసరాల దృష్ట్యా నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం ఇచ్చే ప్రకట నల మేరకు వచ్చే ప్రతిపాదనలు మాత్రమే పరిశీలిస్తామని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. గురువారం వెలగపూడి సచివాలయంలో నర్సింగ్ విద్యకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షించి విస్తృత చర్చ అనంతరం మంత్రి ఈ మేరకు స్పష్టమైన ప్రకటన చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 691 నర్సింగ్ విద్యా సంస్థలు నడుస్తున్నాయని, వీటి ద్వారా ప్రతి ఏడాదీ దాదాపు 32,000 మంది నర్సులు పట్టభద్రులవుతున్నారని అధికారులు మంత్రికి వివరించారు. గత కొన్నేళ్లుగా సుమారు 6,000 నర్సింగ్ సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోతున్నాయని అధికారులు తెలిపారు. 2014 నుంచి నేటి వరకు 243 నర్సింగ్ కాలేజీలు, స్కూళ్లు మంజూరు చేయబడ్డాయని వారు తెలిపారు. ఇవన్నీ వివిధ సంస్థల స్వీయ ప్రతిపాదనల మేరకు (సుమోటో) వివిధ ప్రభుత్వాలు మంజూరు చేశాయి. ఇందుకు భిన్నంగా మొదటిసారిగా కూటమి ప్రభుత్వం గత ఏడాది రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నర్సింగ్ విద్యాసంస్థల ఏర్పాటుకు ఔత్సాహిక సంస్థల నుంచి దరఖాస్తు లను ఆహ్వానించింది. ఈ ప్రకటనకు స్పందించి వచ్చిన దాదాపు 345 దరఖాస్తులు హైపవర్ కమిటీ పరిశీలనలో ఉన్నాయి. ఈ కారణాల వల్ల పరిస్థితిని చక్కదిద్దేందుకు మంత్రి కీలక నూతన నిర్ణయాన్ని ప్రకటించారు. గిరిజన ప్రాంతాలకు సంబంధించి ఈ విషయంలో మినహాయింపు ఉంటుందని మంత్రి తెలిపారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన సమీక్షలో హైపవర్ కమి టీ చైర్మన్, మాజీ హైకోర్టు న్యాయమూర్తి ఉప్పాక దుర్గాప్రసాద రావు, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, డీఎంఈ రఘు నందన్, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ సుశీల, ఇతర పలువు రు ఉన్నతాధికారులు, నర్సింగ్ కాలేజీల మేనేజ్‌మెంట్ ఆసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సుమోటో ప్రతిపాదనల ను పరిశీలనకు చేపట్టరాదన్న నిర్ణయానికి సంబంధించిన లోటుపాట్లను చైర్మన్, మాజీ హైకోర్టు న్యాయమూర్తితో చర్చించారు.

**డిమాండ్‌కు అనుగుణంగా నర్సులకు శిక్షణ: మంత్రి**

2029 నాటికి రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ఆరోగ్య రంగంలో లభించే అవకాశాలపై సమీక్షలో చర్చ జరిగింది. ఈ రంగంలో లక్షకు పైగా ఉద్యోగ అవకాశాలు న్నాయని, నర్సింగ్ శిక్షణలో తగు మార్పులతో పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించవచ్చని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జెరియాట్రిక్ సేవలు (వృద్ధుల ఆరోగ్య అవసరాలు), శిశు సంరక్షణ సేవలు, మానసిక ఆరోగ్య సేవలకు డిమాండ్ బాగా పెరుగుతున్నందున నర్సింగ్ శిక్షణలో ఈ అంశాలను పొందుపర్చాలని సూచించారు. ప్రభుత్వ నర్సింగ్ విద్యా సంస్థల్లో త్వరలో ఈ అంశాలకు సంబంధించి పోస్టు గ్రాడ్యుయేట్ రెసిడెన్సీ ప్రోగ్రాంను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటా మని రిజిస్ట్రార్ సుశీల తెలిపారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు చారిత్రక ఘట్టం

- కూటమికి నారీ శక్తి రుణపడతారు
- ఎమ్మెల్సీ, చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ



అమరావతి (చైతన్యరథం): పార్లమెంటులో 'నారీ శక్తి వందన్ అధీనియం' (మహిళా రిజర్వేషన్ బిల్లు) భారత ప్రజాస్వామ్య చరిత్రలో చారిత్రక ఘట్టమని ఎమ్మెల్సీ, చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ పేర్కొన్నారు. విపక్షాలు ఎలాంటి ఇబ్బంది పెట్టిన బిల్లు ఏకగ్రీవంగా పాస్ అవుతోంది. ఇది మహిళల సాధికారతకు నిజ మైన మైలురాయి అవుతుంది. 1996 నుంచి ఈ బిల్లు గురించి చర్చలు జరుగుతున్నానే ఉన్నాయి. మహిళలకు అత్యంత ప్రాధాన్య తనిచ్చిన ఘనత ఎన్‌డీఏ కూటమికి ప్రభుత్వానికి చెందుతుంది. ముఖ్యంగా చంద్రబాబు పార్టీలకు అతీతంగా ఈ బిల్లును సమర్థిం చారు. బిల్లు పాస్ అయ్యేలా అన్ని పక్షాలకు లేఖలు రాశారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ సహా కూటమి నాయకుల సమన్వయంతో వైసీపీతో సహా అన్ని పార్టీలకు లేఖలు పంపి మద్దతు కోరారు. తెలుగుదేశం పార్టీ మహి ళలకు ఎప్పుడూ పెద్దపీట వేసిన పార్టీ. 73, 74వ రాజ్యాంగ సవర ణలు వచ్చిన వెంటనే స్థానిక సంస్థల్లో మహిళలకు 33% రిజర్వే షన్ అమలు చేసిన ఏకైక నాయకుడు చంద్రబాబు. స్వర్గీయ ఎన్టీఆర్ మహిళలకు సమాన ఆస్తి హక్కు కల్పించారు. మహిళా యూనివర్సిటీని స్థాపించారు. చంద్రబాబు డ్వాక్రా గ్రూపులు, మహిళలకు విద్య,, పసుపు కుంకుమ, ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతకు కృషి చేశారు. తెలుగుదేశం పార్టీలోనే 50% మహిళలకు పార్టీ పదవులు కేటాయించిన ఘనత కూడా నారా లోకేష్‌ది. విజయవాడలో బీసీ మహిళల రిజర్వేషన్‌లో మేయర్‌గా ఎన్నికై మొదటి లేడీ మేయర్‌గా గిన్నిస్ రికార్డు సృష్టించిన సంఘటన కూడా ఈ పార్టీ చరిత్రలో భాగం. ఈ చారిత్రక బిల్లును పాస్ చేయడంలో చంద్రబాబు, నారా లోకేష్, పవన్‌కళ్యాణ్ చూపిన నాయకత్వానికి మహిళలంతా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఈ పార్టీలో పని చేయడం మా అందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.

## దైవదర్శనానికి వెళుతుండగా విషాదం

- బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీ
- కర్నూలులో రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతి
- క్షతగాత్రులకు మంత్రి టీజీ భరత్ పరామర్శ
- మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



కర్నూలు (చైతన్యరథం): కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 8 మంది మృత్యు వాత పడ్డారు. మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద జాతీయ రహదారిపై బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీకొ న్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా మరో 12 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తర లించారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు మృతిచెందగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలిక ఉన్నారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి దర్శ నానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయం లో బొలేరోలో 23 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**మంత్రి టీజీ భరత్ పరామర్శ**

రోడ్డు ప్రమాదంపై మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులను కర్నూలు ఆసుపత్రి లో మంత్రి భరత్ పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

**మంత్రి మండిపల్లి సంతాపం**

కర్నూలు జిల్లా మంత్రాలయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కర్ణాటక వాసుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. దైవదర్శనానికి వెళ్తున్న సమ యంలో ఇటువంటి ప్రమాదం జరగడం బాధాకరమని అన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

**మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి**

దైవ దర్శనానికి వెళ్తున్న భక్తులు ప్రమాదానికి గురై మృతి చెందడం అత్యంత బాధాకరమని ఒక ప్రకటనలో మంత్రి కందుల దుర్గేష్ సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పో యిన భక్తుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షత గాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**అధికారులతో మాట్లాడిన మంత్రి సత్యకుమార్**

రోడ్డు ప్రమాదంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించా లని మంత్రి ఆదేశించారు.

**వివరాలు తెలుసుకున్న మంత్రి నిమ్మల రామానాయుడు**

కర్నూలు రోడ్డు ప్రమాదంపై మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా కలెక్టర్, ఎస్పీలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించి వారికి అండగా ఉండాలని సూచించారు. ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి వారి కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు.

# క్లిష్ట పరిస్థితుల్లో పార్టీని గట్టెక్కించిన లోకేష్

- జగన్ అడ్డంకుల్ని అధిగమించి పాదయాత్రతో ప్రభంజనం
- యువ నేత కష్టంతోనే జాతీయ పార్టీలకు ధీటుగా టీడీపీ చారిత్రాత్మక విజయం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి (చైతన్యరథం): క్లిష్ట పరిస్థితుల్లో కుదేలైన పార్టీకి జీవం పోసి నారా లోకేష్ నిజమైన నాయకుడిగా ఎదిగారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. లోకేష్‌ను టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిం చడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి గురువారం మంత్రి గొట్టిపాటి ఓ వీడియో విడుదల చేశారు. 'పార్టీ అత్యంత క్లిష్ట దశలో ఉన్న సమయంలో లోకేష్ చేపట్టిన పాదయాత్ర టీడీపీకి కొత్త ఊపిరి పోసింది. ఆ సమయంలో అధికారంలో ఉన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక అడ్డంకులు సృష్టించినప్పటికీ, రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా వెనుకడుగు వేయకుండా లోకేష్ ముందుకు సాగారు. పాదయాత్ర ద్వారా ప్రజల్లోనే కాకుండా పార్టీ శ్రేణుల్లోనూ ధైర్యం నింపారు. అనంతర ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారు. ప్రతిపక్షంలో ఉన్న కఠిన పరిస్థితుల్లో కూడా లోకేష్ నాయకత్వంలో ఒంగోలులో నిర్వహిం చిన మహానాడు పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపింది. లోకేష్ కృషి, చొరవ వల్లే గత ఎన్నికల్లో టీడీపీ జాతీయ పార్టీలకు ధీటుగా చారిత్రాత్మక విజయం సాధించింది' అని స్పష్టం చేశారు.

**కోటికి పైగా సభ్యులకు ఇన్సూరెన్స్‌తో కొండంత అండ**

జాతీయ పార్టీలకు ధీటుగా తెలుగుదేశం పార్టీని అభివృద్ధి చేసిన నాయకుడిగా లోకేష్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభివర్ణించారు. పార్టీ కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు అనేక కీలక సంస్కరణలకు లోకేష్ శ్రీకారం చుట్టారని తెలిపారు. కోటికి పైగా సభ్యత్వాలను నమోదు చేయించడమే కాకుండా టీడీపీ కుటుంబ సభ్యులు అనుకోని పరిస్థితుల్లో మృతి చెందితే తక్షణం రూ.5 లక్షలు ప్రమాద బీమా అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. టీడీపీ జాతీయ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహా ప్రతిరోజూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యకర్తలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో స్థానిక నేతలు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉండే లా వ్యవస్థను బలోపేతం చేయడం యువ నేత ముందుచూపునకు నిదర్శనమన్నారు. పార్టీ కోసం కష్టపడే వారు మండల స్థాయిలో ఉన్నా వారిని గుర్తించి రాష్ట్ర, జాతీయ స్థాయి కమిటీల్లో కీలక పదవులు కల్పించడం లోకేష్ సారథ్యంలోనే సాధ్యమవుతోందని మంత్రి రవికుమార్ స్పష్టం చేశారు.

**అభివృద్ధికి తోడుగా సంక్షేమం**

ఒకవైపు అమరావతి రాజధానితో పాటు ఉత్తరాంధ్ర వంటి వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తూనే పేదలకు పెన్షన్లు, నిరుద్యోగులకు డీఎస్సీ ద్వారా 16వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీ వంటి వాటిలో విద్యా శాఖ మంత్రి లోకేష్ కీలక భూమిక పోషించారని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. విద్యార్థులకు తల్లికి వందనంతో పాటు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలను తీసుకురావడంలో ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. విద్యా వ్యవస్థలో రాజకీయాలకు తావు ఉండకూడదని... ఎటువంటి గుర్తులూ లేకుండా పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారం పంపిణీ చేసిన ఘనత కూడా మంత్రి లోకేష్‌కే దక్కుతుందన్నారు. చిన్న చిన్న పనులకు కూడా పెద్ద ప్రాపగండాలు చేసుకునే నేటి కాలంలో లోకేష్ చేసే ఎన్నో మంచి పనులు కేవలం లబ్ధిదారులకు మాత్రమే తెలుసన్నారు. ప్రభుత్వం, పార్టీని సమన్వయం చేసుకుంటూ పాలనలో తనదైన ముద్ర వేస్తున్న యువ నేత లోకేష్‌తో పాటు నూతన కమిటీల్లో పదవులు పొందిన అందరికీ మంత్రి రవికుమార్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# ఇంటర్‌లో వసతిగృహాల విద్యార్థుల ప్రతిభ

**- 43 మందికి 950కు పైగా మార్కులు**

**- విద్యార్థులకు మంత్రి డోలా అభినందనలు**



అమరావతి (చైతన్యరథం): ఇంటర్మీడియట్ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. సీనియర్ ఇంటర్, జూనియర్ ఇంటర్‌లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో 43 మంది విద్యార్థులు 950కు పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి విద్యార్థు లను అభినందించారు. 989 మార్కులు సాధించిన చిత్తూరు జిల్లా పలమనేరు ఎస్సి హాస్టల్ సెకండ్ ఇయర్ విద్యార్థిని కే. వైష్ణవిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. విద్యార్థు లు, సిబ్బందికి అభినందనలు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ వసతిగృహాలు, అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. రూ.143 కోట్లతో గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు చేశాం. ఆర్వో ప్లాంట్ల ద్వారా విద్యార్థు లకు సురక్షితమైన నీరు అందిస్తున్నాం. విద్యార్థుల రక్షణ, భద్రత కోసం అన్ని హాస్టల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. విద్యా ర్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాం, దురదృష్టవశాత్తు అనారో గ్యానికి గురైన విద్యార్థులకు ప్రత్యేక చొరవతో వైద్యం అందిస్తు న్నాం. పేద పిల్లలు ఇంజనీర్లు, డాక్టర్లు కావాలన్న సీఎం చంద్ర బాబు సంకల్పంతో నీట్, ఐఐటీ ఎక్సలెన్సీ సెంటర్లు 3 నుంచి 10కి పెంచాం. పేద పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఎంత ఖర్చు అయినా మా ప్రభుత్వం భరిస్తుంది. పేద పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని స్పష్టం చేశారు.

# బడుగు, బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యమిచ్చేది తెలుగుదేశం పార్టీయే

- పార్టీ కమిటీల్లో బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పించడం చారిత్రాత్మక నిర్ణయం
- గత ఐదేళ్ల పాలనలో బీసీలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారు
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం, అభివృద్ధిని కూటమి ప్రభుత్వం సమతుల్యతగా కొనసాగిస్తోంది
- రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు
- ప్రజలెవరూ వారిని నమ్మే స్థితిలో లేరు
- మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు



బీసీలకు అధిక ప్రాధాన్యం

మంగళగిరి (చైతన్యరథం): బడుగు, బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యమిచ్చేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నారా లోకేష్‌ను జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన పార్టీకి, పార్టీ కుటుంబ సభ్యుల తరపున అభినందనలు తెలిపారు. లోకేష్ 2014-19 మధ్య పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి కీలకంగా పనిచేశారని రామారావు పేర్కొన్నారు. గ్రామగ్రామాన 24వేల కిలోమీటర్ల సిమెంట్ రహదారుల నిర్మాణం ద్వారా గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారాయని, అదే సమయంలో పరిపాలనలో సంస్కరణలు తీసుకువచ్చిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారన్నారు.

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, ఐటీ రంగాల్లో లోకేష్ తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారని వ్యాఖ్యానించారు.

టీడీపీ జాతీయ, రాష్ట్ర కార్యవర్గాల్లో బీసీలకు 40 శాతానికి పైగా ప్రాధాన్యం కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. పార్టీ ప్రారంభం నుంచి అన్న ఎన్టీఆర్ బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి పెద్దపీట వేశారని, అనేక మంది బీసీ నాయకులను రాజకీయంగా ఎదిగించారని గుర్తు చేశారు. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో బీసీలకు రుణ సదుపాయాలు, ఆదరణ పథకం ద్వారా వృత్తి పరికరాలు, సామాజిక భవనాల నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలు అమలయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని విమర్శించారు. కార్పొరేషన్లకు ఒక్క పైసా కూడా ఖర్చు చేసిన పాపానపోలేదన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యంగా కొనసాగిస్తోందని చెప్పారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.51,021 కోట్లు కేటాయించడమే కాకుండా ఆదరణ పథకానికి రూ.1000 కోట్లు కేటాయించారని వివరించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో ఉన్న 34 శాతం రిజర్వేషన్లను వైసీపీ అసమర్థ పాలన వల్ల 24 శాతానికి కుదించి 16,800 బీసీలను రాజ్యాధికారానికి దూరం చేశారన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టుదలతో ముందుకు సాగుతున్నారన్నారు.

ఈ మధ్య కాలంలో కొంతమంది బీసీ నాయకులం అని చెప్పుకుని ధర్నాలు చేస్తూ బీసీలను పక్కాదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రక్షణ చట్టం అమలు చేయాలని అడుగుతున్నారని, అసలు బీసీ రక్షణ చట్టం ప్రతిపాదనను తీసుకొచ్చింది టీడీపీయేనని గుర్తు చేశారు. యువ గళం పాదయాత్ర సమయంలో బీసీల విజ్ఞప్తి మేరకు లోకేష్ గత ప్రభుత్వ పాలనలో బీసీల మీద జరిగిన అఘాయిత్యాలను దృష్టిలో పెట్టుకుని బీసీ రక్షణ చట్టాన్ని రూపొందిస్తున్నట్టు తెలియజేశారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల పరిరక్షణకు ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చర్యలు తీసుకుంటోందన్నారు. బీసీల హక్కుల పరిరక్షణకు టీడీపీ ఎప్పుడూ కట్టుబడి ఉందని, బీసీ రక్షణ చట్టం రూపకల్పన దిశగా కూడా పార్టీ ముందుకు వెళ్తోం దని చెప్పారు.

2019-24 మధ్య కాలంలో బీసీలను ఇబ్బందులకు గురి చేస్తే.. ఈ ధర్నా చేస్తున్న వారందరూ అనాడు ఎందుకు స్పందిం చలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 56 కార్పొరేషన్లను నిర్వీర్యం చేస్తున్న సమయంలో ఈ ధర్నా నాయకులు అందరూ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. గత ఐదేళ్ల కాలంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన దాఖలాలే లేవన్నారు. టీడీపీ అంటే బీసీల పార్టీ.. బీసీలే తెలుగుదేశం పార్టీ అన్నారు.

బుధవారం ప్రకటించిన కార్యవర్గంలో జాతీయ స్థాయిలో 10 మందికి, 189 పదవుల్లో 78 మంది బీసీలకు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన ఘనత టీడీపీదేనని, అటువంటి పార్టీని విమర్శిం చే అర్హత ఎవరికీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల సంక్షేమం కోసం టీడీపీ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోం దన్నారు. 2024-26 మధ్య రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేనప్ప టికీ అన్నిటినీ సరిదిద్దుతూ ముందుకు సాగుతున్నారన్నారు. మత్స్యకారులకు, చేనేతలకు, నాయీ బ్రహ్మణులకు, గౌడ, శెట్టి బలిజలకు అనేక రాయితీలు కల్పించారని... ఈ మధ్యనే వడ్డెర కులస్తులకు మైనింగ్‌లో 15శాతం మైన్లను కేటాయించే విధానాన్ని కూడా కూటమి ప్రభుత్వమే తీసుకువచ్చిందన్నారు. ఈ విధంగా కూటమి ప్రభుత్వం అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని అండగా నిలుస్తుందని తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ నాయకత్వంలో పని చేస్తున్నామని గర్వంగా చెప్పుకుంటామన్నారు.

యువగళం పాదయాత్ర ద్వారా వచ్చిన ప్రతి సమస్యకూ లోకేష్ పరిష్కారం చూపిస్తూ ప్రజలకు మరింత చేరువ అవుతున్నా రని తెలిపారు. లోకేష్ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ యువత, పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని రామారావు అన్నారు. విశాఖలో డేటా సెంటర్లు, ఐటీ పరిశ్రమల విస్తరణ, అమరావతి చట్టబద్ధతకు సంబంధించిన చర్యలు రాష్ట్ర భవిష్యత్తును బలోపేతం చేస్తాయని తెలిపారు. ఈ మధ్య కాలంలో కులాల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేందుకు అనేకమంది అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని... ఎవరూ వాటిని నమ్మొద్దని హితవు పలికారు. 2014-19 మధ్య కాలంలో కూడా ఇటువంటి అసత్య ప్రచారాలతోనే వైసీపీ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా భరోసా ఇచ్చే పార్టీగా టీడీపీ కొనసాగుతుందని, భవిష్యత్తులో కూడా అదే దిశలో ముందుకు సాగుతుందని రామారావు స్పష్టం చేశారు. ప్రజలను విభజించే రాజకీయాలకు లోను కాకుండా అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# పరిశ్రమలు రాకుండా జగన్‌రెడ్డి కుట్రలు

- కుల మత ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతున్నారు
- జువ్వలదిన్నె ప్రాజెక్టుపై నీచ రాజకీయం చేస్తున్నారు
- మత్స్యకారులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు
- పోర్టు పనులు చేపట్టిన సంస్థలను బెదిరించి
- బినామీల పేరిట వాటాలు రాయించుకున్నారు
- మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్‌రెడ్డి



అమరావతి(చైతన్యరథం): పెట్టుబడులు తీసుకొచ్చి పరిశ్రమ లు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పి స్తుంటే.. కడుపు మంటతో ఓర్వలేక జగన్‌రెడ్డి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడని మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం లో తీర ప్రాంతం, మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రైవేట్ పరం చేస్తున్నామంటూ ప్రతిపక్షం చేస్తున్న విమర్శలు పూర్తిగా వాస్తవ విరుద్ధమని కొట్టిపారేశారు. సచివా లయం నాలుగో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మొత్తం 114 ఎకరాల జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ భూమిలో కేవలం 7 ఎకరాలు మాత్రమే సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కు కేటాయించినట్లు బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. 40 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 900 మీటర్ల మేర ఉన్న జెట్టీలో 150 మీటర్లు మాత్ర మే సదరు యూనిట్ కోసం వినియోగిస్తుంటే వాస్తవాలను ఏమా ర్చి.. గత ప్రభుత్వ నేతలు మత్స్యకారులను రెచ్చగొట్టేలా రాజకీ యం చేస్తున్నారన్నారు. మత్స్యకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశా లు మెరుగుపడనున్నాయని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే కూటమి ప్రభుత్వం మరింత బలపడుతోందని పరిశ్రమలపై బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు నిద్రపోయి.. జువ్వల దిన్నెకు రాష్ట్ర వాటా నిధులు కేటాయించని పార్టీ నేడు విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. కేంద్ర నిధులు రూ.128 కోట్లు పక్కదారి పట్టించి నేడు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు.. జువ్వలదిన్నెకు రాష్ట్ర వాటా చెల్లించకుండానే రెండేళ్ల క్రితమే ఫిషింగ్ హార్బర్ పూర్తయిందని పచ్చి అబద్ధాలు చెబుతున్నారు.. ప్రజలను సామాజికవర్గాల వారీగా రెచ్చగొట్టే ధోరణిలో భాగంగా మత్స్యకారులను కూడా నేడు రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో 4 శాతం విస్తీర్ణం లేని ఆంధ్రప్రదేశ్ ... నేడు దేశంలో 4 వంతు (25 శాతం) పెట్టుబడులు సాధించడం చూసి ప్రతిపక్ష పార్టీకి కళ్లు కుడుతున్నాయన్నారు.. గత ప్రభుత్వంలో ఆయా పోర్టుల అభివృద్ధి పనులు చేపట్టిన సంస్థలను బెదిరించి, భయపెట్టి తమ బినామీల పేరిట వాటాలు రాయించుకుని షేర్లు మార్పిం చుకున్న చరిత్ర వారిదని మండిపడ్డారు.

## సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేయండి

**- 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం**
**- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి**



అమరావతి (చైతన్యరథం): ఇంటర్‌లో ఫెయిల్ అయిన అంబేద్క ర్ గురుకులాలు, సాంఘిక సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలకు శిక్షణ ఇచ్చి 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. అందుకోసం ప్రతి జిల్లాకు బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి చొప్పున రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలు వరకు శిక్షణ ఇచ్చి 100% ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పేద పిల్లల భవిష్యత్తుపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. పేద విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

## రేపు నిడదవోలులో సీఎం చంద్రబాబు పర్యటన

**ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి కందుల దుర్గేష్ - విజయవంతానికి కూటమి శ్రేణులకు పిలుపు**



నిడదవోలు(చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 18వ తేదీన నిడదవోలు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావులతో కలిసి హెలిప్యాడ్, సభాస్థలి, ప్రజావేదిక ప్రాంతాలను మంత్రి దుర్గేష్ సందర్శించారు. అంతకుముందు నిడదవోలు పట్టణంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో జనసేన, బీజేపీ నాయకులతో మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి నిడదవోలుకు వస్తున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలకాలని దిశానిర్దేశం చేశారు. ఎంపీ పురందేశ్వరి పార్లమెంట్ లో కీలక సమావేశాల్లో పాల్గొనడం వల్ల 18న రాలేకపోతున్నారని, 21-23 తేదీల్లో ఒక రోజు నియోజకవర్గ పర్యటనకు వస్తారని తెలిపారు. సీఎం పర్యటనలో నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమ స్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లను న్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రధానంగా తాడేపల్లిగూడెం - నిడదవోలును కలిపే మాధవరం-కంసాలిపాలెం వంతెన నిర్మాణా నికి విజ్ఞప్తి చేయడంతో పాటు హేవలాక్ బ్రిడ్జిని 'టూ-వే బ్రిడ్జి'గా మార్చే ప్రతిపాదనను వివరిస్తామని చెప్పారు. నిడదవోలులోని 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా రూపాంతరం చెందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వీటి సాధన కోసం ఇప్పటికే పలువురు మంత్రులతో చర్చించామని, ప్రత్యక్షంగా సీఎంకు ఈ వివరాలు తెలిపి నిధులు మంజూరు చేయించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

**సీఎం పర్యటన వివరాలు**

ఏప్రిల్ 18న ఉదయం 11:15 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిడదవోలు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారని అనంతరం ప్రజావేదికలో ప్రజలతో చర్చిస్తారు. ఆ తర్వాత స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా మాలకోడు చెరువు సుందరీకరణ పనులు, ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ చేస్తారు. మాలకోడు చెరువు వద్ద స్థానికులతో కలిసి 'కేండిడ్ వాక్'లో పాల్గొంటారు. మధ్యాహ్నం భోజనం అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారి నిడదవోలుకు ముఖ్యమంత్రి వస్తుండటంతో ఘన స్వాగతం పలికి దిగ్విజయం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ కోరారు.





## ఢిల్లీలో మహిళా ప్రజాప్రతినిధుల సందడి

న్యూఢిల్లీ(చైతన్యరథం): పార్లమెంట్ సమావేశాల్లో 33 శాతం రిజర్వేషన్లతో మహిళా బిల్లును ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతున్న వేళ రాష్ట్రానికి చెందిన మహిళా ప్రజాప్రతినిధులు మద్దతు ప్రకటి స్తూ బిల్లుపై జరిగే చర్చను వీక్షించేందుకు ఢిల్లీకి వెళ్లారు. మంత్రి సవితతో పాటు మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యా రాణి సహా పలువురు మహిళా ఎమ్మెల్యేలు వెళ్లిన వారిలో ఉన్నారు. వారికి గురువారం ఉదయం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అతిథ్యమిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌రెడ్డీ..మత్స్యకారులపై మొసలికన్నీరు ఆపు

- ఐదేళ్లూ జువ్వలదిన్నె హార్బర్‌ను అడ్డుకున్నారు
- మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసి పొట్టగొట్టారు
- నిధులు, బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు
- అభివృద్ధిని చూడలేకే నేడు చిచ్చు పెట్టే ప్రయత్నం
- సాగర్ డిఫెన్స్ ప్రాజెక్టును తరిమేస్తామంటున్నారు
- ఆయనకు గొడ్డలి పార్టీ.. గొడ్డలి గుర్తుపైనే ప్రేమ
- ఫిష్ ఆంధ్రా అంటూ డబ్బును మళ్లించారు
- జువ్వలదిన్నెను మేం పూర్తి చేస్తున్నాం
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం



మంగళగిరి(చైతన్యరథం): జువ్వలదిన్నె హార్బర్ నిర్మాణంపై జగన్ దుష్ప్రచారంపై ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఘాటు గా కౌంటర్ ఇచ్చారు. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసిన వ్యక్తి మత్స్యకారుల సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదని మండిప డ్డారు. గురువారం మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నెల్లూరు పర్యటనలో జగన్‌రెడ్డి మరోసారి తన అసహనాన్ని బయటపెట్టాడు. రాష్ట్ర అభివృద్ధి జరుగుతుండటం తట్టుకోలేక వివిధ వర్గాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేశాడు. ఎక్కడైనా అవకాశం దొరికితే అల్లర్లు రేపాలనే ధోరణి ఆయన వ్యవహారంలో స్పష్టంగా కనిపిస్తోంది. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో కూడా ఆయన దుష్ప్ చారానికి దిగారు. మత్స్యకారులను రెచ్చగొట్టేందుకు అసత్యాలు ప్రచారం చేశారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఈ హార్బర్ నిర్మాణానికి నిధులు, బిల్లులు ఇవ్వకుండా అడ్డుకున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు వేగవంతమై ప్రాజెక్టు దాదాపు పూర్తి స్థాయికి చేరుకుంది. 901 మీటర్ల జెట్టీ, ఫిష్ ల్యాండింగ్ సెంటర్, కోల్డ్ స్టోరేజీలు, వలల భద్రత కోసం గదులు వంటి అన్ని సౌకర్యాలతో ఆధునిక హార్బర్‌గా దీనిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

**మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసింది జగనే**

"మత్స్యకారుల విషయంలో కూడా ఆయన పాలనలో అనేక అన్యాయాలు జరిగాయి. చెరువులపై హక్కులను దెబ్బతీసే విధం గా జారీ చేసిన జీవో నెంబర్ 217 ద్వారా వారి జీవనోపాధిని ప్రమాదంలోకి నెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ జీవోను రద్దు చేసి మత్స్యకారులకు న్యాయం చేసింది. చంద్రబాబు నాయ కత్వంలోనే మత్స్యకారులకు పెన్షన్ పథకం ప్రారంభమైంది. వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం కూడా అప్పుడే మొదలైంది. రూ.4 వేలుగా ప్రారంభమైన ఈ సహాయం నేడు రూ.20 వేల వరకు పెరిగింది. ఆయిల్ సబ్సిడీలు, ఇతర సదుపాయాలు కూడా అందిస్తున్నాం. గతంలో వేటకు వెళ్లి మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఐదేళ్ల పాటు సహాయం అందకపోయినా, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పెండింగ్ నిధులను విడుదల చేసి వారికి అండగా నిలిచిందని తెలిపారు.

**తమిళనాడు బోట్ల విడుదల అంశంలో జగన్ దుష్ప్రచారం**

"సముద్ర గస్తీ విషయంలో కూడా జగన్ పాలనలో నిర్లక్ష్యం జరిగింది. 2017లో ఇతర రాష్ట్రాల బోట్లు రాకుండా మెరైన్ బోట్లు గస్తీ కాస్తుండగా 2019 తర్వాత అవన్నీ నిలిచిపోయాయి. రిపేర్లు, మెయింటెనెన్స్‌లకు కూడా డబ్బులు ఇవ్వకపోవడం, సిబ్బందిని తొలగించడం వల్ల సముద్ర సరిహద్దులు బలహీనపడ్డాయి. ఫలితంగా తమిళనాడు బోట్లు వచ్చి మన మత్స్యసంపదను దోచుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని గుర్తించిన వెంట నే చంద్రబాబు, లోకేష్ అధికారులను అప్రమత్తం చేసి స్పీడ్ బోట్లు ఏర్పాటు చేశారు. 650 హార్స్ పవర్ ఇంజిన్లతో గస్తీ బలపరిచి అక్రమంగా వచ్చిన బోట్లను నియంత్రించే చర్యలు చేపట్టారు. తమిళనాడు బోట్లను పట్టుకున్న తర్వాత యువనేత నారా లోకేష్ చెప్పడం వలనే ఆ బోట్లను పోలీసులు విడుదల చేశారు అనడం కూడా పూర్తిగా అవాస్తవం. "ఇది మా గ్రామాల సమస్య, మేము చర్చించుకొని పరిష్కరించుకుంటామని స్థానిక గ్రామాల ప్రజలు చెబితే వారి అభిప్రాయాన్ని గౌరవిస్తూ వారి నిర్ణయాల ప్రకారమే ముందుకు వెళ్లాం. అయినా కూడా ఈ అంశాన్ని రాజకీయంగా మలచాలని జగన్ చేసిన ప్రయత్నం బాధాకరమని మండిపడ్డారు.

**దేశ రక్షణపై బాధ్యత లేదు..**

"జువ్వలదిన్నెలో కేంద్ర అనుమతితో సాగర్ డిఫెన్స్ సంస్థకు భూమి కేటాయించడం జరిగింది. ఇది దేశ రక్షణకు ఉపయోగపడే కీలక ప్రాజెక్ట్. భవిష్యత్తులో సముద్ర తీర ప్రాంత భద్రతను బలో పేతం చేయడంలో ఈ సంస్థ చేసే పరిశోధనలు ఎంతో ఉపయో గపడతాయి. ఇలాంటి ప్రాజెక్టులను వ్యతిరేకించడం ద్వారా జగన్ దృష్టిలో దేశ ప్రయోజనాలపై ఎంత నిర్లక్ష్యం ఉందో తెలుస్తోంది. "మొత్తం హార్బర్‌ను సాగర్ డిఫెన్స్‌కు ఇచ్చేస్తున్నారంటూ జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నిజానికి కేవలం 170 మీటర్ల ప్రాంతాన్ని మాత్రమే ఆ సంస్థకు కేటాయించాం. కనీస అవగాహన లేకుండా ప్రజల్లో అపోహలు సృష్టించడం దురదృష్టకరం. జగన్‌కు తల్లి అంటే ప్రేమ లేదు కాబట్టి వెళ్లగొట్టాడు.. చెల్లి అంటే ప్రేమ లేదు కాబట్టి వెళ్లగొట్టాడు. సొంత బాబాయిని వేసేశాడు. రాష్ట్ర ప్రజలు ఓటు వేయలేదని రాష్ట్రం నాశనం అయిపోవాలని జగన్ కోరుకుంటున్నాడు. చివరికి దేశం అంటే కూడా భక్తి లేని ఒక దుర్మార్గమైన ఆలోచన ఉన్న వ్యక్తి ఆయన. ఈ దేశ రక్షణ కోసం జవాన్లు పనిచేస్తున్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో పక్క దేశాలు ఏవైనా మన దేశంపై దాడులు చేయాలని ప్రయత్నం చేసినప్పుడు ఈ సాగర డిఫెన్స్ చేస్తున్న రీసెర్చ్ ద్వారా దేశాన్ని రక్షించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇటువంటి సంస్థను తరిమి కొడతాను అంటున్నాడంటే జగన్ వ్యక్తిత్వం ఏమిటో అర్థం అవు తుంది. జగన్‌కు ఉన్న ప్రేమ ఉన్నదల్లా ఒకటే గొడ్డలి పార్టీ, గొడ్డలి గుర్తు. ఏదైనా నరుక్కుంటూ పోవడమే ఆయన నైజం. అభివృద్ధిని అడ్డుకోవడం, అపోహలు సృష్టించడం, ప్రజలను రెచ్చగొట్టడం ఇవే జగన్ రాజకీయ విధానమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అభివృద్ధి, పెట్టుబడులను అడ్డుకునే చరిత్ర జగన్‌రెడ్డిది**

"2019–24 మధ్య 800 సంస్థలను ఈ రాష్ట్రం నుంచి తరిమికొట్టిన వ్యక్తి ఎవరో ప్రజలు గుర్తుంచుకోవాలి. 2014–19 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్‌కు వెళ్లి పెట్టుబడు లకు ఆహ్వానించారు. అలా అనేక సంస్థలు ముందుకువచ్చాయి. తర్వాత వచ్చిన జగన్‌రెడ్డి వాటిని భయపెట్టి వెళ్లగొట్టిన పరిస్థితి ఏర్పడింది. కియా మోటార్స్ వంటి సంస్థలను బెదిరించడంతో వారు మరో యూనిట్‌ను తమిళనాడుకు తరలించుకున్నారు. అమరరాజా బ్యాటరీస్ రాష్ట్రాన్ని విడిచి తమిళనాడు, తెలంగా ణకు వెళ్లింది. లులూ గ్రూప్ అధినేత యూసుఫ్ అలీ స్వయంగా పత్రికా ప్రకటన ఇచ్చి "ఆంధ్రప్రదేశ్‌కు రావొద్దు" అని చెప్పే స్థితి ఎందుకు వచ్చింది? ఇవన్నీ జరిగినవి వాస్తవాలు కాదా? ఎంపీ లు, నాయకులు వెళ్లి బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్ చేసిన సంఘటనలు లేవా? ఇప్పుడు అదే రాష్ట్రంపై మళ్లీ నమ్మకం తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో సుమారు 25% పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌కు రావడం, ఈ ప్రభుత్వంపై పెరుగుతున్న విశ్వాసా నికి నిదర్శనం. ఒకప్పుడు "వచ్చే సంస్థలన్నీ వెళ్లగొడతా" అన్న అనడంతో జగన్ విశ్వసనీయత ఏంటి? ప్రజలు జగన్‌పై నమ్మకం లేకే 11 సీట్లకు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు.

**రాష్ట్రాభివృద్ధిపై జగన్‌కు చిత్తశుద్ధి లేదు**

"అమరావతి విషయంలో కూడా దాడులు, అనిశ్చితి సృష్టించడం వల్లే పెట్టుబడిదారుల్లో అనుమానాలు పెరిగాయి. అందుకే అమరావతికి చట్టబద్ధత కల్పించి, రాష్ట్ర అభివృద్ధికి స్థిరత్వం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. "నేను వస్తే చట్టాన్ని మార్చేస్తా" అనే విధంగా మాట్లాడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఇక్కడ ప్రజలు కోరిందే జరుగుతుంది, వ్యక్తిగత అజెండాలు కాదు. ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, యువనేత నారా లోకేష్ స్ఫూర్తితో రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. విశాఖపట్నం లో గూగుల్ వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టేం దుకు ముందుకొస్తున్నాయి. భారీ స్థాయిలో మెటల్, ఇండస్ట్రి యల్ ప్రాజెక్టులు వేల కోట్ల పెట్టుబడులతో లక్షలాది ఉద్యోగాల ను సృష్టించబోతున్నాయి. క్వాంటం కంప్యూటింగ్ వంటి భవిష్య త్ సాంకేతికతలను ముందుగానే రాష్ట్రానికి తీసుకురావాలన్న దూరదృష్టి ఈ ప్రభుత్వానికి ఉంది. దేశవ్యాప్తంగా డేటా సెంటర్ల సామర్థ్యం 1 గిగావాట్ లోపే ఉండగా రాష్ట్రంలోనే ఇప్పటికే 3 గిగావాట్ల పనులు జరుగుతున్నారు. మరో 3 గిగావాట్లు ప్రణాళి కలో ఉన్నాయి. ఈ అభివృద్ధిని చూసి తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారని ప్రజలు గ్రహించాలి. సాగర్ డిఫెన్స్ వంటి సంస్థలు వస్తే వేలాది ఉద్యోగాలు వస్తాయి, మత్స్యకారులు కూడా ఉద్యోగ స్తులుగా మారే అవకాశాలు ఉంటాయి. కానీ అలాంటి ప్రాజెక్టు లపైనా జగన్ వ్యతిరేకత వ్యక్తం చేయడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

రాష్ట్రాభివృద్ధే మా ధ్యేయం..విధ్వంసమే జగన్ నైజం

"గత వైసీపీ ఐదేళ్లలో మీడియాపై ఒత్తిడి, ఉద్యోగులపై బెదిరింపు లు, ప్రతిపక్షాలపై అక్రమ కేసులు, నాయకులను జైలుకు పంపించడం వంటి చర్యలు జరిగాయి. చివరకు ప్రజల విశ్వా సాన్ని కూడా పొందలేకపోయారు. ప్రజాస్వామ్యంలో అది అసాధ్యం. ఈ ప్రభుత్వం మాత్రం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే సంకల్పంతో ముందుకు సాగుతోంది. అన్ని వర్గాల అభివృద్ధి, యువతకు ఉపాధి, రాష్ట్రానికి గౌరవం తీసుకు రావ డమే మా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## ఇళ్ల పట్టాల పంపిణీ వేగవంతం చేయాలి



- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశం
- 2029 నాటికి ప్రతి పేదవాడికి సొంతిల్లు

నిమ్మాడ (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఇళ్ల పట్టాల పంపిణీ వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2029 నాటికి ప్రతిపేదకు సొంతిల్లు లక్ష్యాన్ని సాధించేందుకు కట్టుబడి ఉన్నామని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు, కోటబొమ్మాళి మండలం భవానిపురం గ్రామానికి చెందిన పేద లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల జీవితా ల్లో స్థిరత్వం తీసుకురావడంలో గృహ నిర్మాణం కీలకమని పేర్కొన్నారు.

ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలి పారు. గత ప్రభుత్వంపై తీవ్రంగా స్పందించిన మంత్రి.. పేదల సొంతింటి కలను గత పాలకులు ఛిద్రం చేశారని విమర్శిం చారు. లబ్ధిదారులకు చెల్లించాల్సిన సుమారు రూ.900 కోట్ల బకాయిలను పెండింగ్‌లో ఉంచడం ద్వారా గృహ నిర్మాణ రంగా న్ని పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. ఆ బకాయిలన్నింటినీ చెల్లించే బాధ్యతను కూటమి ప్రభుత్వం స్వీకరించిందని స్పష్టం చేశారు. లబ్ధిదారుడికి పారదర్శకంగా, వేగవంతంగా ఇళ్లను అందించడంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. సమా వేశంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, నాలుగు మండలాల రెవె న్యూ అధికారులు పాల్గొన్నారు.

## పునర్విభజన బిల్లు వల్ల అన్యాయం జరగదు



- దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై స్పష్టత
- మహిళా రిజర్వేషన్ బిల్లు చారిత్రాత్మకం
- నాడు ఎన్టీఆర్ మహిళా సాధికారతకు కృషిచేశారు
- లోక్‌సభలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్వి భజన, 131వ రాజ్యాంగ సవరణ బిల్లులపై జరిగిన చర్చలో రాజమహేంద్రవరం బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లా డారు. ఈ చారిత్రక బిల్లులకు పూర్తి మద్దతు ప్రకటించిన ఆమె మహిళా రిజర్వేషన్ల అమలులో గత ప్రభుత్వాల వైఫల్యాలను ఎండ గట్టారు. ప్రసంగం ప్రారంభంలో ఆమె తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహిళా సాధికారత కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే ఆస్తిలో కుమార్తెలకు సమాన హక్కులు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేష న్లు, మహిళా విశ్వవిద్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్ల ఏర్పాటు వంటి విప్లవాత్మక నిర్ణయాలను తీసుకున్నారని సభకు వివరించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు లోక్‌స భ సీట్లను కోల్పోతాయన్న ఆందోళనలపై ఆమె స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రణాళిక ప్రకారం, లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం పెంచడం వల్ల ఏ రాష్ట్రానికి ఉన్న ప్రస్తుత సీట్లు తగ్గవని భరోసా ఇచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సీట్ల పెంపు ఉండటం వల్ల రాజకీయ సమతుల్యత దెబ్బతినదని, దక్షిణాది రాష్ట్రాల గొంతు పార్లమెంట్‌లో బలంగానే ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం గతంలో తీవ్ర జాప్యం చేసిందని విమర్శించారు. ఈ చారిత్రక ఘట్టంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని చెబుతూ ఆమె తన ప్రసంగాన్ని ముగించారు.

# క్షతగాత్రుల పాలిట వరం పీఎం రాహత్

- రూ.1.5 లక్షల ఉచిత నగదు రహిత వైద్యసేవలు
- ప్రమాదంపై సమాచారమిస్తే రూ.25 వేల ప్రోత్సాహకం
- కలెక్టర్లు జిల్లా స్థాయిలో పథకంపై సమీక్షించాలి
- రోడ్డు ప్రమాదాల నిరోధానికి సమష్టి కృషి అవసరం
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



విజయవాడ (చైతన్యరథం): రోడ్డు ప్రమాదాల నిరోధానికి ప్రభుత్వ శాఖలు, పౌరులు సమష్టిగా కృషి చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ శాఖల్లో ముఖ్యంగా రవాణా, పోలీసు శాఖలు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవసరమైన చోట్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు జరిగే రోడ్డు ప్రమాదాల వల్ల గాయపడే వారికి తక్షణం ఉన్నత వైద్యాన్ని అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందని వెల్లడించారు. విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో గురువారం 'పీఎం-రాహత్' పథకం అమలు-ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం రాహత్ పథకం క్షతగాత్రులకు రిలీఫ్‌ను ఇస్తుందన్నారు. ప్రమాదం జరిగిన గంటలోగా ఉచితంగా రూ.1.5 లక్షల వైద్యాన్ని అందిం చేందుకు ఉద్దేశించిన పీఎం రాహత్ పథకాన్ని ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా అందరికీ వర్తింపచేస్తామని వెల్లడించారు. అర్హత కలిగిన వారిలో ఒకవేళ ఎవరికైనా వైద్యాన్ని అందించేందుకు రూ.1.5 లక్షలు సరిపోకుండా ఉంటే.. మిగిలిన మొత్తాన్ని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు కింద భరిస్తామని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో తాజాగా నమోదైన కేసుతో కలిపి ఇప్పటివరకు పీఎం-రాహత్ కింద 56 కేసులు నమోదైనట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల సమాచారం ఇచ్చిన వారికి ఇంతకుముందు రూ.5 వేలు ఇస్తుండగా ఈ మొత్తాన్ని కేంద్రం రూ.25 వేలకు పెంచింద న్నారు. వీరికి పోలీసుల వైపు నుంచి ఎటువంటి సమస్యలు ఉండవని తెలిపారు.

**'గోల్డెన్ అవర్'లో వైద్యసేవలకు అధిక ప్రాధాన్యం**


రాష్ట్రంలో ప్రస్తుతానికి 656 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పీఎం రాహత్ కింద సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అత్యవసర వైద్యం (108) కింద 2024లో 71,108 రోడ్డు ప్రమాద కేసులు నమోదైతే 23,810 మంది(33%)ని గోల్డెన్ అవర్లోనే ఆసుపత్రుల్లో వైద్యం అందిందని తెలిపారు. 2025లో 75,329 కేసులకు గాను 44,305 (59%), కేసుల్లో గోల్డెన్ అవర్ కింద వైద్యం అందిందన్నారు. 2026లో ఇప్పటివరకు 19,278 కేసులకుగాను 18,558 మందిని గోల్డెన్ అవర్ (96%)లో ఆసుపత్రుల్లో చేర్పించి వైద్యం అందించామని వివరిం చారు. గుండెపోటుకు గురైన వారికి 'స్టెమీ' కింద 2023 నుంచి 2025 మధ్య 4,849 మందికి రూ.42 వేల ఖరీదైన ఇంజెక్షన్‌ను ఉచితంగా అందించామని వెల్లడించారు. బాధితుల్లో 231 మంది మరణించగా మిగిలిన వారనంతా టెనెక్ట్ ప్లేస్ ఇంజక్షన్ వల్ల మృత్యువు నుంచి బయటపడ్డారని వివరించారు.

**108 సేవలను 112తో అనుసంధానం చేస్తాం**

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ మాట్లాడు తూ 108 అత్యవసర వైద్యసేవలను 112 (నేషనల్ హెల్ప్ లైన్ నెంబరు)తో ఈ నెలాఖరులోగా అనుసంధానం చేస్తామని వెల్ల డించారు. అలాగే ఈ నెల 20 నుంచి ప్రారంభించి వచ్చే నెల 15వ తేదీ వరకు పీఎం-రాహత్ పథకం అమలు, అవగా హనపై ఆసుపత్రులు, ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు జరుపు తామని వివరించారు. అలాగే ఎన్టీఆర్ వైద్యా సేవా ట్రస్టు పరిధిలో కనీసం 1500 ఆసుపత్రుల్లో పీఎం-రాహత్ కింద వైద్య సేవలు అందుబాటులోనికి తెస్తామన్నారు. రోడ్డు ప్రమాదా ల నిరోధంపై అన్ని జిల్లాల్లో ప్రత్యేక సమావేశాలు (రోడ్డు సేఫ్టీ) నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, రవాణా శాఖ జాయింటు కమిషనర్ వెంకటేశ్వరరావు, డీసీపీ పూర్ణచంద్రరావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ కార్యదర్శి డాక్టర్ బోస్, ఆంధ్రప్రదేశ్ స్పెషాల్టీ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విజయ కుమార్, కాకినాడ, గుంటూరు బోధనాసుపత్రుల సూపెరింటె డెంట్లు డాక్టర్ లావణ్య కుమారి, ఎస్.ఎస్.వి.రమణ, ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యు.వెంకటరమణ పాల్గొన్నారు.

## జనగణనలో కందుల దుర్గేష్ తొలి అడుగు

- వివరాలు నమోదు చేసుకున్న మంత్రి
- ప్రజాస్వామ్యంలో జనాభా లెక్కలే కీలకం
- దేశ ప్రగతికి 'జనగణన' దిక్సూచి అని వ్యాఖ్య
- ప్రజలూ భాగస్వాములు కావాలని పిలుపు



రాజమండ్రి (చైతన్యరథం): దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన జనగణన-2027 ప్రక్రియలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా పాల్గొని తొలి అడుగు వేశారు. గురువారం రాజమహేంద్రవరంలోని తన నివాసంలో మండల అధికారుల సమక్షంలో తన కుటుంబ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేశారు. వివరాల నమోదు పూర్తయిన అనంతరం వాటిని క్షుణ్ణంగా సరిచూసుకుని ప్రక్రియ విజయవంతంగా ముగియడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లా డుతూ ప్రజాస్వామ్య పరిపాలనలో జనగణన అనేది అత్యంత ప్రధానమైన అంశమని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం మారుతున్న జనాభా ప్రాతిపదికన ప్రజలకు అవసరమైన సౌకర్యా లు, వసతులు కల్పించడమే ప్రజా ప్రభుత్వాల లక్ష్యమని తెలిపారు. దేశంలో స్త్రీలు, పురుషులు, పిల్లలు, ఇతరుల సంఖ్య కచ్చితంగా తెలిసినప్పుడే ప్రభుత్వం సరైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించడానికి వీలవుతుందని వివరించారు. ఏప్రిల్ 16 నుంచి 30వ తేదీ వరకు ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' అవకాశం ఉందని, దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మే 1వ తేదీ నుంచి ఎన్యూమరేటర్లు నేరుగా ఇంటికొచ్చి వివరా లు సేకరిస్తారని, ఆ సమయంలో అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. "నేను జనగణనలో పాల్గొని నా వివరా లను నమోదు చేసుకున్నాను.. మీరు కూడా ఉత్సాహంగా పాల్గొనండి" అని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ తమ కుటుంబ వివరా లను నమోదు చేయించడం ద్వారా దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని, తద్వారా రాబోయే తరాలకు మెరుగైన ప్రణాళికలు అందేలా చూడాలని కోరారు.

### రైతులను నిండా ముంచిన

# రాయలసీమ ద్రోహి జగన్

- రాయలసీమ లిఫ్ట్ ఆగింది వైసీపీ హయాంలో కాదా
- ఎన్జీటీ స్టే ఇస్తే వాదనలు కూడా వినిపించలేని అసమర్థులు మీరు
- 102 సీమ ప్రాజెక్టుల పనులు రద్దు చేసింది జగనే
- దమ్ముంటే రాయలసీమ లిఫ్ట్‌పై చర్చకు రావాలి
- వైసీపీ నేతలకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ సవాల్



మంగళగిరి (చైతన్యరథ:): 'రాయలసీమ లిఫ్ట్ పనులను కూటమి ప్రభుత్వం ఆపేసింది. రాయలసీమ తీవ్రంగా నష్టపోతుం ది. లిఫ్ట్ పనులు వెంటనే చేపట్టాలి అని వైసీపీ గ్రామ సింహాలు రోజూ గర్జించడం చూస్తే నవ్వొస్తోంది' అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ అన్నారు. గురువారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ లిఫ్ట్‌పై వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారంపై మండిపడ్డారు. గత మూడు నెలలుగా సీమ గర్జన, రౌండ్‌టేబుల్ సమావేశాలు, ప్రెస్‌మీట్ల పేరుతో రాయలసీమ లిఫ్ట్‌పై హడావుడి చేస్తున్న వైసీపీ మాజీ ప్రజాప్రతినిధులు దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు.

'ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి అదే అబద్ధాన్ని నమ్మించి అధికారంలోకి వచ్చేందుకు వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారు. అబద్ధాల పునాదిపై పుట్టిన పార్టీ వైసీపీ. రాయలసీమ లిఫ్ట్‌కు 2020 మే 5న టెండర్లు పిలిచి రూ.1,000 కోట్లు పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ దోచిపెట్టారు. రాయలసీమ లిఫ్ట్‌పై 2021 మేలో ఎన్జీటీ స్టే ఇచ్చింది. మరి వైసీపీ గ్రామ సింహాలు ఎందుకు రోజూ కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. దూదూ బసవన్న అంటే తలలు ఊపే బ్యాచ్ అంతా వైసీపీలో ఉంది. నాలుగేళ్లల్లో ఒక్కసారైనా ఎన్జీటీలో కౌంటర్ దాఖలు చేసి మీ వాదనలు వినిపించారా? వివేకా హత్య కేసులో నిందితులను కాపాడేందుకు రోజుకు రూ.కోటి ఖర్చు చేసి లాయర్లను పెట్టుకున్నారు. రోజుకు కోటి ఇచ్చి హంతకులను కాపాడుకున్నారు. మరి రాయలసీమ లిఫ్ట్‌పై ఎందుకు సరైన వాదనలు వినిపించలేకపోయారు. మీ అక్రమ ఆస్తుల కోసం, మీ బాబాయ్ హత్య కేసులో నిందితులను కాపాడటం కోసం సుప్రీంకోర్టుకు వెళ్లారు. అంగళ్లు కేసులో వెయ్యి మంది టీడీపీ నేతలపై కేసులు పెట్టి రూ.కోట్లు ఖర్చు చేసి లాయర్లను పెట్టుకున్నారే... మరి ఎందుకు రాయలసీమ లిఫ్ట్‌పై వాదన వినిపించలేకపోయారో సమాధానం చెప్పాలి. హైదరాబాద్‌లో కేసీఆర్ ఇంటికి వెళ్లి బిర్యానీ తిన్నారు. రోజా ఇంటికొచ్చి చేపల పులుసు బాగుందని కేసీఆర్ చెప్పారు. గురుశిష్యుల బంధం అంతలా ఉంటే కేసీఆర్‌ను రాయలసీమ లిఫ్ట్‌పై ఎందుకు ఒప్పించలేకపోయారు. ప్రాజెక్టుల ముసుగులో కమీషన్ల కోసం లిఫ్ట్ పేరుతో దోచుకున్నారు. రాయలసీమకు ఏం మంచి చేశారో చెప్పుకోలేని స్థితిలో వైసీపీ నాయకులు ఉన్నారు.' అన్నారు.

**ప్రాజెక్టుల పేరుతో దోపిడీ**

'2019-24 మధ్య రూ.12 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కూడా రాయలసీమకు వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేయలేదు. ఆవులపల్లి, నేతిగుంటపల్లి, ముదివేడు ప్రాజెక్టులకు రూ.2,140 కోట్లతో టెండర్లు పిలిచి పనులు చేశారు. ఎన్జీటీ స్టే ఇచ్చి రూ.100 కోట్ల జరిమానా విధించింది. కేవలం రాయలసీమ ప్రాజెక్టుల పేరుతో దోచుకునేందుకే జగన్ జీవోలు ఇచ్చాడు. హంద్రీనీవా పనులను రద్దుచేసిన చరిత్ర జగన్‌ది. అబద్ధాలు ప్రచారం చేయడం వైసీపీ మానుకోవాలి. మీ ఇసుక మాఫియా వల్ల అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 39 మంది ప్రాణాలు కోల్పోయారు. ఊర్లకు ఊర్లు కొట్టుకుపోయాయి. వేల పశువులు మరణించాయి. ఒక్కరికి కూడా సాయం లేదు. ఒక్క ఇల్లు కూడా కట్టించి ఇచ్చింది లేదు. అన్నమయ్య ప్రాజెక్టుపై ఏ విధమైన నిర్ణయం తీసుకోలేని వ్యక్తి జగన్. పనిలేని మాజీ ప్రజాప్రతినిధులు రోడ్డెక్కి మాట్లాడుతున్నారు. మిమ్మల్ని ప్రజల ముందుకు ఎందుకు దోషులుగా నిలబెట్టవని రాయలసీమ వైసీపీ నేతలు జగన్ కాలర్ పట్టుకొని నిలదీయండి.' అన్నారు.

రాయలసీమ ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా?

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా. తాడేపల్లిలోనే కూర్చుకుందాం. టీడీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అంతా వస్తాం. సాక్షి కార్యాలయం అయినా ఓకే, తాడేపల్లి ప్యాలెస్ అయినా ఓకే. లెక్కలతో వస్తాం మీరు సిద్ధమా లేదో రాయలసీమ వైసీపీ నాయకులు చెప్పాలి.

**జగన్ రెడ్డిని కాలర్ పట్టుకుని నిలదీయండి**

'కర్నూలులో హైకోర్టు పెడతామన్న జగన్... ఈ రోజు మాపిగన్ అంటున్నారు. మా కర్నూలుకి హైకోర్టు అని మాట ఇచ్చి ఇప్పుడు మార్చావని జగన్ రెడ్డి కాలర్ పట్టుకుని రాయలసీమ వైసీపీ నాయకులు ప్రశ్నించాలి. జీవో నెం.365 తెచ్చి రాయలసీమకు చెందిన 102 ప్రాజెక్టుల పనులు ఎందుకు రద్దు చేశావని నిలదీయండి. దీనిపై మాట్లాడే దమ్ము వైసీపీ నాయకులకు ఉందా. డ్రిప్ ఇరిగేషన్ రద్దు చేసి రాయలసీమ రైతులను ముంచేశాడు జగన్.'

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే రాయలసీమ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. 2014-19లో రూ.12,441 కోట్లు, 20 నెలల్లో రూ.8వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిది. హంద్రీనీవా ద్వారా 60 టీఎంసీల నీరు తరలించి చరిత్ర సృష్టించాం. కియా తెచ్చినా హంద్రీనీవా నీళ్లు ఇచ్చినా చంద్రబాబుకే సాధ్యం. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామికవాడలను రూ.5వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. రూ.70వేల కోట్లు పెట్టుబడులు వచ్చాయి అని సూర్యప్రకాష్ చెప్పారు.

## పంట నష్టంపై ప్రశ్నిస్తే

# గొడ్డలితో హత్యాయత్నం చేశారు

- వైసీపీ నేతలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- రెవెన్యూ అధికారుల అండతో వారసత్వ భూమి ఆక్రమణ... న్యాయం చేయాలని వినతి
- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భూమిపై కబ్జాదారుల కన్ను... ఫోర్జరీ పత్రాలతో భూ దోపిడీ
- బీటెక్ నిరుద్యోగికి వంచన.. ఉద్యోగం ఆశ చూపి రూ.10 లక్షలు వసూలు
- అర్జీలు స్వీకరించిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి
- సమస్యల పరిష్కారానికి కృషి



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వారి నుంచి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

పల్నాడు జిల్లా మాచర్ల మండలం నాగులవరం గ్రామానికి చెందిన గన్నెబోయిన అంజమ్మ అర్జీ... మా గ్రామంలో మాకున్న అర ఎకరం పొలంలో వరి పంట వేసుకున్నాం. 24-10-2021న జక్కుల వెంకట్రామయ్యకు చెందిన గేదె మా పొలంలోని పంటను పాడు చేస్తుండగా దానిని గ్రామంలోకి తీసుకొని వచ్చి ప్రశ్నించాము. అదే సమయంలో వైసీపీకి చెందిన గన్నెబోయిన ఏడుకొండలు, అతని తండ్రి వెంకటేశ్వర్లు గొడ్డళ్లతో వచ్చి నన్ను బూతులు తిడుతూ చంపాలని చూశారు. ఏడుకొండలు తన చేతిలో ఉన్న గొడ్డలితో నా తలపై నరికాడు. మళ్లీ ఆ తండ్రీకొడుకులిద్దరూ చంపడానికి గొడ్డళ్లతో వెంటపడగా నా భర్త వచ్చి బైక్‌పై తప్పించి నాగార్జున సాగర్ (విజయపురి సౌత్) పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. మేము రక్తమోడుతున్న గాయంతో స్టేషన్‌కు వెళ్లినా తాము టీడీపీ వారమని తెలిసి పోలీసులు రిపోర్టు తీసుకోలేదు. ఆ తర్వాత మాచర్ల ఆసుపత్రికి వెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తనను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందాను. గుంటూరు ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. పైగా నాగార్జున సాగర్ పోలీసులు మా ఇంటికి వచ్చి నిందితులపై కేసు పెట్టాలని ఒత్తిడి చేస్తే నాపైనే తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతామని బెదిరించారు. సదరు వ్యక్తిపై తక్షణం చర్యలు తీసుకోవాలి.

కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన చిట్టిబాబు అర్జీ... నాకు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వేంపాడులో వంశపారంపర్యంగా సంక్రమించిన భూమి వుంది. ఖాతా నెం. 620, సర్వే నెం.29-8లో 35 సెంట్లు, సర్వే నెం.29-9లో 32 సెంట్లు భూమి గతంలో ఆన్‌లైన్ రికార్డుల్లో నా పేర ఉండేది. మాకు సంతానం లేకపోవడాన్ని ఆసరాగా తీసుకుని నా వదిన అయిన గొల్లపల్లి నాగమణి, అప్పటి నక్కపల్లి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై, లంచాలతో నా పేరును రికార్డుల నుంచి తొలగింపజేసింది. నా భూమితో పాటు నా సోదరుడు చెల్లయ్య భూమిని కూడా కలిపి మొత్తం 1 ఎకరా 34 సెంట్లను తన పేరున (ఖాతా నెం. 2038) అక్రమంగా నమోదు చేయించుకుంది. ఆ తర్వాత ఆమె తన కుమార్తెలైన కాసింశెట్టి సరోజిని, గొల్లపల్లి రేవతి పేర్ల మీద నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సెటిల్మెంట్ రిజిస్ట్రేషన్ చేసేసింది. ఈ విషయమై మేము ప్రశ్నిస్తే ఆమె, ఆమె కుమార్తెలు మమ్మల్ని చంపేస్తామని బెదిరించారు. గత ప్రభుత్వ హయాంలో వారికున్న రాజకీయ, ఆర్థిక బలంతో పోలీసులు కూడా మా ఫిర్యాదును పట్టించుకోలేదు.

కృష్ణా జిల్లాకు చెందిన తోటకూర కళ్యాణ చక్రవర్తి విన్నపం... నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ భవిష్యత్తులో ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం పరిధిలోని కాపులుప్పాడు గ్రామంలో భూమి కొనుగోలు చేశాను. సర్వే నెం.390/1 (ప్రస్తుత సబ్ డివిజన్ 397/9)లో 2.5 ఎకరాల భూమిని, దాని యజమాని అయిన మాజీ సైనిక ఉద్యోగి రావాల మల్లేశ్వరరావు నుంచి భీమునిపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా కొనుగోలు చేశాను. దీనికి సంబంధించి నెం. 42/2015తో రిజిస్ట్రేషన్ కూడా పూర్తయింది. ఈ కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తిగా ఉన్న సారేపల్లి నీలేశ్వర రావు, యజమాని మల్లేశ్వరరావు కలిసి నాకు సంబంధించిన అసలు దస్తావేజులను అక్రమంగా దొంగిలించారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విశాఖపట్నం పోలీస్ కమిషనర్ గారి ఆదేశాల మేరకు భీమునిపట్నం పోలీసులు విచారణ జరిపారు. ఆ విచారణలో నీలేశ్వరరావు నా దస్తావేజులను అక్రమంగా తీసుకెళ్లినట్టు నేరాన్ని అంగీకరించాడు. అయితే వారిప్పుడు మరింత బరితెగించి, నకిలీ అగ్రిమెంట్లు, పత్రాలు సృష్టించి నా భూమిని కూచిపూడి సీతారామాంజనేయులు, కొత్త వెంకట మురళీధర్ రెడ్డి, ఉడుముల అశోక్ రెడ్డి అనే వ్యక్తులకు విక్రయించి, అన్యాక్రాంతం చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. తద్వారా ఆస్తిని కబ్జా చేయాలని పథకం వేశారు.

గుంటూరు జిల్లా తోకవారిపాలేనికి చెందిన ఆలా వెంకటేశ్వర్లు అర్జీ... మా అబ్బాయి వెంకట సాయి బీటెక్ చదివాడు. వాడికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని లక్ష్మీప్రసన్న అనే మహిళ నమ్మబలికింది. దీంతో మేము పలు దఫాలుగా మొత్తం రూ. 10లక్షలు ఆమెకు అందజేశాము. డబ్బులు తీసుకుని సుమారు మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఆమె ఉద్యోగం ఇప్పించలేదు. మేమిచ్చిన డబ్బు తిరిగి ఇవ్వట్లేదు. అడిగితే సరైన సమాధానం చెప్పకుండా మమ్మల్ని తిప్పుకుంటున్నారు. ఈ విషయమై మేము గతంలో నల్లపాడు పోలీస్ స్టేషన్‌తో పాటు గుంటూరు జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశాము. కానీ ఇప్పటివరకు మాకు ఎటువంటి న్యాయం జరగలేదు.

బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన కోటేశ్వరరావు వినతి... కృష్ణా జిల్లా నాగాయలంక మండలం పర్రచివర గ్రామంలో నాకు 1.2 ఎకరాల భూమి వుంది. దానికి సంబంధించి నా వద్ద అన్ని రకాల పక్కా ఆధారాలు, పత్రాలు ఉన్నాయి. ఈ భూమిని గోదాబత్తిని బసవపున్నయ్య, హనుమంతరావు అనే వ్యక్తులు, అప్పటి రెవెన్యూ , పోలీసు అధికారుల అండదండలతో ఆక్రమించారు. నా భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. గతంలో నాపై రెండుసార్లు హత్యాయత్నం చేశారు. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే వారు తనకు సహాయం చేయకపోగా ఎదురుగా తనకే పనిష్మెంట్ ఇస్తూ మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు, పోలీసులకు భూమి పత్రాలను ఎన్నిసార్లు చూపించినా, "మీరు మాకు ఎలాంటి పత్రాలు ఇవ్వలేదు, కాబట్టి మేము ఏమీ చేయలేం" అంటూ అబద్ధపు మాటలతో పంపిస్తున్నారు. ఆర్డీవో కూడా స్పందించట్లేదు.

పల్నాడు జిల్లా అమరావతి మండలం లేమల్లే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అర్జీ... ఉంగుటూరు గ్రామంలో పట్టా నెం.765, సర్వే నెం.287లో నాకు 2.45 ఎకరాలు వుంది. నా వద్ద ఉన్న ఒరిజినల్ పట్టా, మాకు జారీ చేసిన పాస్ పుస్తకాల్లో 2. 45 ఎకరాలు అని స్పష్టంగా నమోదై ఉంది. కానీ ఆన్‌లైన్ అడంగల్, 1బి రికార్డుల్లో కేవలం 2.36 ఎకరాలు మాత్రమే చూపిస్తోంది. అంటే సుమారు 9 సెంట్లు భూమి రికార్డులలో తక్కువగా నమోదై ఉంది. ఈ పొరపాటును సరిచేయవలసిందిగా చాలా ఏళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటివరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

గుంటూరు జిల్లా మేడికొండూరుకు చెందిన వెంకట్రావ్ విన్నపం... మా గ్రామంలోని సర్వే నెం.30(బి)లో నాకు 94 సెంట్ల భూమి వుంది. దానికి సరిహద్దులు నిర్ణయించి సర్వే చేయాలని గతంలోనే ఆన్‌లైన్ ద్వారా రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకున్నాను. నా పొలానికి పొరుగున ఉన్న రైతు కుర్రి వెంకటరెడ్డికి కొలతల నిమిత్తం సర్వేయర్ రెండుసార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ, ఆయన సర్వే సమయంలో హాజరుకావట్లేదు. దీంతో కొలతలు వేయడం సాధ్యపడక సర్వే ప్రక్రియ నిలిచిపోయింది. రికార్డుల ప్రకారం నాకు 94 సెంట్లు ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో కొంత తేడా ఉన్నట్టు కనిపిస్తోంది. సబ్-డివిజన్ వివరాలు కూడా స్పష్టంగా లేవు.

అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం గొరిబండ్ల గ్రామానికి కృష్ణనాయక్ అర్జీ... మా గ్రామంలో సర్వే నెం.506-5లో 0.48 సెంట్ల భూమి వుంది. ఇది నాకు తాతల నాటి నుంచీ వారసత్వంగా సంక్రమించింది. అనేక ఏళ్లుగా ఈ భూమిని సాగు చేసుకుంటూ పూర్తి అనుభవంలో ఉన్నాం. పూర్తి ఆధారాలు, 'ఫీల్డ్ మెజర్మెంట్ బుక్'లో కూడా రికార్డులు స్పష్టంగా ఉన్నాయి. అన్ని రికార్డులూ సక్రమంగా వున్నా సాగులో ఉన్న మాకు ఇప్పటివరకు పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు కాలేదు. దీంతో ప్రభుత్వ పథకాలు పొందడానికి, ఇతర పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన నరసమ్మ విన్నపం... మెతుకూరు గ్రామంలోని సర్వే నెం.903లో మా కుటుంబానికి చెందిన 3.23 ఎకరాల భూమి ఉంది. గత రికార్డులు, అడంగల్ ప్రకారం ఈ భూమి నరసింహయ్య పేరిట అక్రమంగా నమోదై ఉంది. 2025 సంవత్సరపు అడంగల్ రికార్డుల్లో కొందరు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించకుండా అక్రమదారులతో చేతులు కలిపి మా భూమిని వేరే వ్యక్తుల పేరిట నమోదు చేశారు. పాత రికార్డులను, అడంగల్ లెక్కలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా, ఎవరికీ చెప్పకుండా ఏకపక్షంగా పేర్లు మార్చారు. "ఎవరి పొలంలో వాళ్ల పేరు రాస్తాం, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి" అనే రీతిలో బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు.

గుంటూరుకు చెందిన సుజాత అర్జీ... నగరంలోని శివారెడ్డిపాలెంలో నాకు మొత్తం 5,639 చదరపు గజాల స్థలం వుంది. దానికి సంబంధించి నా పేరున రిజిస్టర్డ్ దస్తావేజులు ఉన్నాయి. ఈ స్థలాన్ని కొంతకాలంగా కొందరు వ్యక్తులు ఆక్రమించి అందులో దౌర్జన్యంగా రేకుల షెడ్లు నిర్మించారు. సదరు ఆక్రమణదారుల వద్ద ఆ భూమికి సంబంధించి ఎటువంటి దస్తావేజులు, ఆధారాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో మాకు న్యాయం జరగదనే భయంతో ఫిర్యాదు చేయలేదు. నా వద్ద పక్కాగా రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయి. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

పై వాటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా... మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

## కాకినాడ సెజ్‌లో మెటలర్జికల్ కోకో ప్లాంట్

**ఎంవోయూ కుదుర్చుకున్న ప్రతినిధులు - 2000 మందికి ఉపాధి అవకాశాలు**




కాకినాడ(చైతన్యరథం): కాకినాడ సెజ్‌లో రూ.700 కోట్లతో మరో కొత్త పరిశ్రమ ఏర్పాటుకానుంది. ఇప్పటికే తొండంగి మండలంలో అరబిందో ఫార్మాకు సంబంధించి లైఫియస్, క్యూలే, పోర్టు పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా 1,000 మందికి, పరోక్షంగా 1,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ మేరకు చెన్నైకి చెందిన గ్రీన్ కోక్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కాకినాడ సెజ్ లిమిటెడ్‌తో ఎంవోయూ (అవగాహన ఒప్పందం) కుదుర్చుకుంది. సెజ్ (కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి)లో 80 ఎకరాల విస్తీర్ణంలో (ఏవీ నగరం సమీపం లో) ఈ ప్లాంట్‌ను నిర్మించనున్నారు. ఉక్కు ఉత్పత్తిలో మెటలర్జికల్ కోక్‌ను కీలకంగా వినియోగిస్తారు. గ్రీన్ కోక్ ఎనర్జీ ఎండీ నటరాజ న్, సెజ్ ఎండీ, సీతవో ఓజిలి రాతెడ్డి ఎంవోయూపై బుధవారం సంతకాలు చేశారు. ఈ పరిశ్రమ వల్ల కాకినాడ జిల్లా తొండంగి, ఉప్పాడ మండలాల్లో పారిశ్రామిక రంగం విస్తరించనుంది.

## ఏపీలో మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

**- మరికొందరికి పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో పలువురు మున్సిపల్ కమిషనర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీలు, నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది.విజయవాడ జోనల్ కమిషనర్ రమ్య కీర్తన నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. వినుకొండ మేనేజర్ అర్జునరావు దర్శి మున్సిపల్ కమిషనర్‌గా నియామకం అయ్యారు. పులివెందుల ఇన్‌ఛార్జ్ కమిషనర్ మునికుమార్ రెగ్యులర్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. విజయవాడ నుంచి సుభాష్ చంద్రబోస్ ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఉయ్యూరు కమిషనర్ జె.రామారావును తెనాలి అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. విశాఖ జీవీఎంసీ దక్షిణ జోన్‌కు పీవీవీడీ ప్రసాద్‌రావు జోనల్ కమిషనర్‌గా నియామకం అయ్యారు. మల్లయ్య నాయుడు గుంటూరు కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. గుంటూరు అదనపు కమిషనర్ ఒబులేసు కర్నూలు కమిషనర్‌గా నియామకం అయ్యారు. కర్నూలు కమిషనర్ విశ్వనాథ్ తదుపరి పోస్టింగ్ కోసం సీడీఎంఏ, రాయపూడిలో రిపోర్ట్ చేయాలని ఆదే శించారు. తిరుపతి రెవెన్యూ అధికారులు లోకేశ్వర వర్మ, చిట్టిబా బు యూఏడీఏల్లో కీలక పోస్టింగ్స్ ఇచ్చారు. గుంటూరు, కర్నూలు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ప్రమోషన్లు, కొత్త బాధ్యతలు ఇచ్చారు. పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్ నియామకం అయ్యా రు. పుట్టపర్తి కమిషనర్ కాంతికుమార్ హిందూపురం అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అదోని రెవెన్యూ ఆఫీసర్ బేబీ ఆత్మకూరు (క) కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న పలువురు అధికారులకు కూడా కీలక నియామకాలు కల్పించారు. ఈ మొత్తం బదిలీలు, నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

# సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసిన స్పీకర్ అయ్యన్న



నర్సీపట్నం (చైతన్యరథం): భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జనగణన-2027 ప్రక్రియలో భాగంగా ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని తన నివాసంలో సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. దేశవ్యాప్తంగా ఇవాళ్టి నుంచి (ఏప్రిల్ 16) ప్రారంభమైన ఇళ్ల జాబితా, ఇళ్ల గణన తొలి విడత కార్యక్రమంలో భాగంగా ఆయన అధికారిక వెబ్సైట్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ గణనలో పాల్గొని దేశాభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రజలే తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం కల్పించిన ఈ 'స్వీయ గణన' (సెల్ఫ్ ఎన్యూమరేషన్) అద్భుతమైన అవకాశమన్నారు. దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా కచ్చితమైన వివరాలు నమోదవుతాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు అందుబాటులో ఉండే ఈ డిజిటల్ విధానాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నమోదు పూర్తి చేసిన తర్వాత వచ్చే ఐడీని భద్రపరుచుకోవాలని సూచించారు.

# మంత్రి అచ్చెన్నాయుడుని ఘనంగా సన్మానించిన పార్టీ శ్రేణులు



నిమ్మాడ (చైతన్యరథం): తెలుగు దేశం పార్టీ నూతన కార్యవర్గ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని పొలిట్ బ్యూరో సభ్యునిగా కొనసాగిస్తూ సముచిత గౌరవం కల్పించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా గురువారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అభిమాన నాయకునికి అభినందనల వెల్లువ విరిసింది. అలాగే, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్గా యువ నాయకుడు నారా లోకేష్ని నియమించడం పార్టీ శ్రేణులు, ముఖ్యంగా యువతలో నూతనోత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముందంజలో నిలిపేందుకు చేపడుతున్న సంస్కరణలు, కృషి ప్రశంసనీయమన్నారు. యువత, పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో సమర్థవంతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

# పశుసంవర్ధక రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకలాంటిది

**●పాడి పరిశ్రమలను పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి : బగ్గురమణమూర్తి**



నరసన్నపేట (చైతన్యరథం): పాడి పరిశ్రమ అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి అన్నారు. పోలాకి మండలం, బొద్దాం పంచాయతీలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మరియు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతుల జీవనోపాధికి పశువుల ఆరోగ్యం ఎంతో కీలకమని, గతంలో నిర్లక్ష్యానికి గురైన పాడి రంగాన్ని మళ్లీ బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ వైద్య శిబిరం ద్వారా రైతులు తమ పశు వులకు అవసరమైన వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఇటీవల రాయితీపై పశుగ్రాస విత్తనాలు కూడా పాడి రైతులకు అందించామని, అలాగే పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కూడా వేయడం జరిగిందని గుర్తు చేశారు.

# సెల్ఫ్ ఎన్యుమరేషన్ చాలా సులభం : ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



విశాఖపట్నం తూర్పు (చైతన్యరథం): భారతదేశ జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు ప్రభుత్వం సూచించిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన) కార్యక్రమంలో పాల్గొనబోతున్న ప్రజలు స్వయంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చాలా సులభంగా చేసుకోవచ్చునని విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వ్యాఖ్యానించారు. గురువారం తన కార్యాలయంలో స్వయంగా తన మొబైల్ ఫోన్లో https://se.census.gov.in వెబ్సైట్ ద్వారా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకుని తన పేరుతో సహా సంబంధిత అంశాలను పొందుపరిచి అందరికీ స్ఫూర్తినిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సెన్సస్ 2027లో భాగంగా ప్రభుత్వం సూచించిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ (స్వీయ గణన) కార్యక్రమం ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు జరుగుతుందని, మొట్ట మొదటిసారిగా సెన్సెస్ 2027 కార్యక్రమంలో డిజిటల్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, సెల్ఫ్ ఎన్యుమరేషన్ అతి సులభంగా https://se.census.gov.in వెబ్సైట్లో పౌరులందరూ నమోదు చేసుకోవచ్చున్నారు. ఈరోజు తను సెల్ఫ్ ఎన్యుమరేషన్ అతి సులభంగా చేసుకున్నానని తన ఫోటోను ప్రదర్శిస్తూ అందరికీ స్ఫూర్తిని కలిగించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం (చైతన్యరథం): ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఎంవీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ సాయాన్ని అందించారు. ఆనందపురం ఎర్రీ పాలెనికి చెందిన దన్నాన శ్రీనుకు రూ.3 లక్షలు, పద్మనాభం మండలం గంధవరం గ్రామానికి చెందిన పిల్లా వెంకటరమణకు రూ.1 లక్ష, కొమ్మాదికి చెందిన బందారు సుబ్బలక్ష్మికి రూ.70 వేలు చెక్కులను అందజేశారు. పేదలను ఆర్థికంగా ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఆకర్షణీయ వడ్డీ రేట్లు అందిస్తున్న డీసీసీబీ

**●వ్యక్తి పొదుపు అలవాటు- భవిష్యత్తుకు ఆర్థిక భద్రత**

**●డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున**



విజయనగరం (చైతన్యరథం): ప్రజలకు అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను డీసీసీబీ అందిస్తోందని విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున తెలిపారు. విజయనగరం పట్టణానికి చెందిన ఎం.లక్ష్మీనారాయణ, చైర్మన్ నాగార్జున సమక్షంలో గురువారం విజయనగరం డీసీసీబీ బ్రాంచ్లో ఫిక్స్ డిపాజిట్ రూపంలో రూ.5,10,000/- జమ చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ... డీసీసీబీ ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తూ ఆర్థికంగా బలంగా ఎదుగుతోందన్నారు. ఖాతాదారులకు భద్రతతో కూడిన సేవలు, ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు అందిస్తున్నామని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబం పొదుపు అలవాటు పెంపొందించుకొని భవిష్యత్తు కోసం ఆర్థిక భద్రతను సాధించాలని సూచించారు. డిపాజిట్లు పెరగడం ద్వారా బ్యాంకు మరింత బలోపేతం అవుతుందని, తద్వారా ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. లక్ష్మి నారాయణ మాట్లాడుతూ, డీసీసీబీపై నమ్మకంతోనే ఈ ఫిక్స్ డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పొదుపు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్, ఏవీ రాజు, సుజాత, తేజ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం నా ప్రాణం ఇస్తా !

**●వెయ్యి కోట్లతో పార్వతీపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు**

**●రాబోయే పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి**

**●పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయ్ చంద్ర**



పార్వతీపురం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కోసం నా ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సీతానగరం మండలంలోని 35 గ్రామపంచాయతీల నాయకులతో స్థానిక మండల కేంద్రంలో ప్రవేటు భవనంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తెలుగు గౌరవం కోసం, తెలుగు వారి ఆత్మ అభిమానం కోసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్వతీపురం నియోజకవర్గం చాలావరకు వేనుకబడి ఉండేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి పనికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. నా మీద నమ్మకం ఉంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో ప్రజలు ఆదరించి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించారని అన్నారు. ముఖ్యమంత్రి, ప్రజలు ఇచ్చిన ఆ గౌరవాన్ని నిలబెడతానని, అవసరమైతే పార్టీ కోసం నా ప్రాణమైన ఇస్తానని తెలిపారు. పార్టీలో ప్రతి ఒక్క సభ్యుడు పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్త మరొక ఘట్టం ముందుకెళ్లే వరకు కలిసికట్టుగా పనిచేయాలని, పార్టీ కోసమే మనమంతా కష్టపడాలని ఆయన అన్నారు. సీతానగరం మండలంలో 35 గ్రామ పంచాయతీల్లో మన పార్టీ జెండా స్థానిక ఎలక్షన్లో ఎగరేయాలని, అందుకు మనమంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యువనేత నారా లోకేష్ బాబుకు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించిన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మరింత నిబద్ధతతో పనిచేస్తా : మొహమ్మద్ నజీర్

విశాఖపట్నం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షునిగా అవకాశం కల్పించడంతో మొహమ్మద్ నజీర్... పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... భవిష్యత్తులో పార్టీ పరంగా మరింత బాధ్యత, నిబద్ధతతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని, గౌరవాన్ని నిలబెట్టుకుంటానన్నారు. లోకేష్ నాయకత్వంలో రాబోయే రోజుల్లో టీడీపీ క్షేత్రస్థాయిలో మరింత బలపడుతుందన్నారు. 2029లో మరోసారి గెలుపే లక్ష్యంగా నారా లోకేష్ నాయకత్వంలో పనిచేస్తానని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన తెలుగుదేశంపార్టీ నాయకత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటానని నజీర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు నజీర్ కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షునిగా నజీర్ నియమించడంపై పలువురు మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శు భాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ కళాశాల విద్యార్థిని సత్కరించిన ఎమ్మెల్యే సొంగా

● ఇంటర్మీడియట్‌లో 979 మార్కులు సాధించిన మారుమూడి చరిష్మా



చింతలపూడి (చైతన్యరథం): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ విభాగంలో చరిత్రలోనే మొట్టమొదటిసారిగా 979 మార్కులతో చింతలపూడి మండలం కంచనగూడెం గ్రామానికి చెందిన మారుమూడి చరిష్మా జిల్లాలో రెండవ స్థానంలో నిలవడం గర్వంగా ఉందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ వ్యాఖ్యానించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని మారుమూడి చరిష్మాను అభినందించిన ఎమ్మెల్యే శాలువతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ... విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి రాష్ట్ర విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని, అద్భుతమైన పురోగతి కనిపించిందన్నారు. విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు ఇంటర్మీడియట్ ఫలితాలపై ప్రభావం చూపించాయన్నారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాలో రెండవ స్థానంలో అగ్రగామిగా నిలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుతో నూతన చరిత్రకు శ్రీకారం

●ముక్తకంఠంతో నినదించిన కూటమి నాయకులు

●ఏలూరులో ఉత్సాహంగా నారీ శక్తివందన్ ర్యాలీ



ఏలూరు (చైతన్యరథం): దశాబ్దాల కల అయినా చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రతి ఒక్కరూ సంపూర్ణంగా మద్దతు ప్రకటించాలని కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు కోరారు. మహిళలకు గౌరవప్రదంగా 33శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పం మరికొన్ని గంటల్లో నెరవేరనుందని, ఆ క్షణాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని వారు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై పార్లమెంట్లో ఈనెల 16, 17, 18 తేదీల్లో ప్రత్యేక చర్చ జరుగుతున్న నేపథ్యంలో మహిళా బిల్లుకు మద్దతు తెలుపుతూ కూటమి ఆధ్వర్యంలో ఏలూరులో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక విజయ్ విహార్ సెంటర్ నుండి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిధ రాజ్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, బిజెపి జిల్లా అధ్యక్షులు సిహెచ్ విక్రమ్ కిషోర్, ఆర్టీసీ విజయవాడ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిషిధ రాజ్ మాట్లాడుతూ... మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. కొంతమంది మహిళలను అణగదొక్కాలన్న సంకుచిత మనస్తత్వంతో బిల్లును అడ్డుకోవాలని చూస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఎవరు ఏ విధంగా అడ్డుకున్నా ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొంది తీరుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ... ప్రస్తుతం దేశంలో ప్రతి రంగంలోనూ మహిళలు ముందంజలో ఉన్నారని చెప్పారు. రాజ్యాంగ పదవుల్లో కూడా వారికి సముచిత స్థానం కల్పించాలన్న లక్ష్యంతో కూటమి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కృత నిశ్చయంతో ఉందని ఆయన పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మాట్లాడుతూ... మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన క్షణాలు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని చెప్పారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే సమాజంలో సుఖశాంతులు అభివృద్ధి చెందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## పెద్దపులిని పట్టుకునేందుకు చర్యలు

పోలవరం (చైతన్యరథం) : పోలవరం మండలంలో తిరుగుతున్న పెద్దపులిని పట్టుకునేందుకు అటవీశాఖ ఉన్నతాధికారులు అన్నీ చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం పాపికొండల అభయారణ్యం పరిధిలో తిరుగుతున్న పెద్దపులి విక్షణంలోనైనా మైదాన ప్రాంతంలోకి వచ్చే అవకాశం ఉందని.. పట్టుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు పోలవరం అటవీశాఖ అధికారి ఎస్కే వలీ చెప్పారు. రెండు రోజులుగా మెత్తప్పకోట అభయారణ్యంలో సంచరిస్తున్నట్లు గురువారం శాటిలైట్ ఇమేజ్ ద్వారా గుర్తించామన్నారు. దాని కదలికలు ఎటువైపు వెళ్తున్నాయో అంతుబట్టడం లేదన్నారు. అందుకే శ్రీశైలం పులుల సంరక్షణ కేంద్రం నుంచి వెటర్నరీ వైద్యులతో పాటు ట్రాంకలైజర్ గన్నుల్ను, రెస్క్యూ బృందాలు వచ్చినట్లు పేర్కొన్నారు. వారం రోజులుగా మండల పరిధిలో తిరుగుతూ కొండలు దిగి మైదానప్రాంతాలవైపు రావడంతో అటవీశాఖ అధికారులకు కంటిమీదు కునుకులేకుండా పోయింది. పులికి అమర్చిన రేడియో కాలర్ ద్వారా కదలికలు గుర్తించేందుకు రెండు బృందాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

## అరాచక శక్తులకు అధికారం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా లేరు

● రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం అందించే కూటమికి ప్రజల ఆశీర్వాదం మరోసారి ఉంటుంది : ఎమ్మెల్యే చింతమనేని




దెందులూరు (చైతన్యరథం): "ఈ తరం అంతా మన కూటమిదే అధికారం, రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కూటమికే ప్రజల ఆశీర్వాదం. మరోసారి వైసీపీ వంటి అక్రమార్కులకు అరాచక శక్తులకు అధికారం ఇచ్చేందుకు విజ్ఞత కలిగిన ఏ ప్రజలు కూడా సిద్ధంగా లేరు. గ్రామాల్లో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిని భవిష్యత్తు అవసరాలను సైతం దృష్టిలో ఉంచుకుని మనం పనిచేయాలి" అని కూటమి నాయకులకు, ప్రభుత్వ అధికారులకు, సిబ్బందికి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. గురువారం దెందులూరులోని ఎంపీడీవో కార్యాలయంలో చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన దెందులూరు, పెదవేగి మండలాల అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దెందులూరు మరియు పెదవేగి మండలాల్లోని పలు గ్రామాల్లో త్రాగునీటి సరఫరాలో సమస్యలు, వాటిని మెరుగుపరిచేందుకు జల్జీవన్ మిషన్ పథకం ద్వారా చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల అంశాలపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఏ ఏ గ్రామాల్లో ఓవర్హెడ్ రిజర్వాయర్ సిస్టం వసరాలు ఉన్నాయో వాటి అంచనాలను సిద్ధం చేయాలని, జనాభా ప్రాతిపదికన ఈ ఓహెచ్ఆర్ఎస్లను ఎంపిక చేయాలని, గ్రామాల్లో మూడు దశాబ్దాలపైగా కాలం చెల్లిన పైప్ లైన్ నిర్మాణాల విషయంలో అనేకచోట్ల తీవ్రంగా మరమ్మత్తులు ఏర్పడుతున్నాయని, అటువంటి అంశాల్లో వాటిని మార్చేందుకు కూడా అంచనాలు సిద్ధం చేసి నివేదిక సమర్పించాలన్నారు. గ్రామ పంచాయతీల నుంచి ఆయా గ్రామాల పరిధిలో చేపట్టవలసిన జలజీవన్ మిషన్ పథకం ద్వారా చేపట్టవలసిన పనుల నివేదికలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు అందజేసి వాటిని మంజూరు అయ్యేలా చూడాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మండలాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

## విశాఖపట్నంలో కొత్తగా ఫ్లై ఓవర్... భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ట్రాఫిక్ ఫ్రీ జర్నీ



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీపై ఏపీ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయానికి వెళ్లేవారికి కీలకమైన ఆనందపురం జంక్షన్ దగ్గర ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి.ఈ క్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని గ్రహించి ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టే దిశగా ఆలోచన చేశారు. ఆనందపురం జంక్షన్ మీదుగా.. విశాఖపట్నం నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలు.. అటు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే వాహనాలు సాఫీగా వెళ్లేలా కొత్త ప్రతిపాదనను తీసుకొచ్చారు. ఆనందపురం జంక్షన్ దగ్గర భోగాపురం వైపు వెళ్లేలా కొత్తగా ఓ ఫ్లైఓవర్‌ను నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం వచ్చిన సమయంలో కొత్త ఫ్లై ఓవర్ గురించి ప్రస్తావించారు. ఈ ప్రతిపాదనలకు సీఎం ఓకే చెప్పడంతో అధికారులు ఈ ఫ్లై ఓవర్‌కు సంబంధించి అలైన్‌మెంట్ ఖరారు చేశారు. 45 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేసి.. ఆమోదం రాగానే పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇటీవల ఆనందపురం జంక్షన్, కూరగాయల మార్కెట్, పూల మార్కెట్‌లను ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు.. ప్రస్తుతం ఆనందపురం జంక్షన్ దగ్గర ఉన్న మార్కెట్‌ను మరోచోటికి తరలించాలని ఆలోచన చేస్తున్నారు. ఈ మార్కెట్‌ను తరలిస్తే.. రాబోయే రోజుల్లో ఆనందపురం జంక్షన్ దగ్గర భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటుందని భావిస్తున్నారు. ఈ అంశంపై కూడా ఫోకస్ పెట్టిన అధికారులు.. శాశ్వత పరిష్కారానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఇటు అనకాపల్లి వెళ్లే వాహనాలు, అటు భోగాపురం వైపు వెళ్లే వాహనాలకు ఆనందపురం జంక్షన్ దగ్గర ట్రాఫిక్ ఫ్రీ జర్నీ కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానంగా నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బీ శాఖలు ఈ రోడ్ల పనులు జరుగుతున్నాయి. విశాఖపట్నం ఎంపీ భరత్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్‌లు ఈ ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. తిమ్మాపురం నుంచి మారికవలస రోడ్డు రహదారి పనులు ముగింపు దశకు వచ్చాయని ఎంపీ భరత్ తెలిపారు. అదవిరం నుంచి శొంఠ్యాం ఆరు లేన్ల రోడ్డుకు అనుమతులు వచ్చాయని.. ఆ పనులు ఊపందుకున్నాయన్నారు. నేరెళవలస–కొత్తవలస, బోయపాలెం–కాపులుప్పాడ రహదారులు ఏప్రిల్ చివరినాటికి పూర్తవుతాయన్నారు. పెందుర్తి ప్రాంతంలోని రోడ్డు పనులు మే–జూన్ నాటికి పూర్తి చేసే అవకాశం ఉందని భరత్ తెలిపారు. భీమిలి టు దొరతోట రోడ్డును 100 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ రోడ్డును నేషనల్ హైవేతో అనుసంధానానికి ఇప్పటికే అనుమతులు లభించాయన్నారు. జూన్ నాటికి విమానాశ్రయానికి అనుసంధానంగా ఉన్న ఐదు కీలకమైన రోడ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా, పనులను వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## కొనసాగనున్న ఎండ తీవ్రత... 30 మండలాల్లో వడగాల్పులు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో క్రమేపి పెరుగుతున్న ఎండ తీవ్రత, వడగాలులు, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. గురువారం గరిష్ఠంగా నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది అని తెలిపారు. 215 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు ఆయన వెల్లడించారు. ఇకపోతే శుక్రవారం కూడా ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు.

**నేడు 30 మండలాల్లో తీవ్ర వడగాల్పులు**

మరోవైపు శుక్రవారం (17-04-26) మన్యం, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు,రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠంగా 43-44.5డిగ్రీ మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేందుకు అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. నేడు 30 మండలాల్లో తీవ్రవడగాలులు, 55 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని అన్నారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

# గన్నవరం పాలిటెక్నిక్‌లో 100% ప్లేస్‌మెంట్లు

**●132 మంది విద్యార్థులకు జాబ్ ఆఫర్ లెటర్లు పంపిణీ చేసిన విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ**



గన్నవరం (చైతన్యరథం): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవం, జాబ్ అచీవర్స్ డే కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాలలో నాలుగు విభాగాలకు చెందిన మొత్తం 132 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు వివిధ ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడంతో 100 శాతం ప్లేస్‌మెంట్లు నమోదయ్యాయి. గతంలో కొన్ని బ్రాంచ్‌లకు పరిమితమైన అవకాశాలు ఉండగా, ఈసారి అన్ని విభాగాల్లోనూ పూర్తి స్థాయి ప్లేస్‌మెంట్లు సాధించడం విశేషంగా నిలిచింది. ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్వయంగా జాబ్ ఆఫర్ లెటర్లు అందజేసి అభినందించారు. కృషి, పట్టుదలతో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ... గన్నవరానికి సి-డాక్ సంస్థను తీసుకురావడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే, మేధా టవర్‌లో క్వాంటం వ్యాలీ రెండో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వచ్చే నెల నుంచి హెచ్‌సిఎల్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కళాశాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని, రూ.30 లక్షల నిధుల కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరినట్లు తెలిపారు. కంప్యూటర్ల కోసం ఓఎన్‌జీసీతో చర్చలు జరుగుతున్నాయని, కాలేజీ మౌలిక వసతులను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. పాలిటెక్నిక్, ఐటీఐ చదువులు పూర్తి చేసిన వారికి తక్కువ వయసులోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల

**● తమిరిశ గ్రామంలో ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే...**

**● అర్జీలు అందించిన ప్రజలు... పి.జే.ఆర్.ఎస్‌లో నమోదు**



నందివాడ (చైతన్యరథం): ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకే చిత్తశుద్ధితో పనిచేస్తున్నానన్నారు. నందివాడ మండలం తమిరిశ గ్రామంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే రాము ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే రాము ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి... సమస్యలు తెలుసుకున్నారు. అర్జీలు అందించేందుకు తమిరిశ పరిసర గ్రామాల ప్రజలు పోటెత్తారు. ప్రజల నుండి సమస్యల అర్జీలను అందుకున్న ఎమ్మెల్యే... సంబంధిత అధికారులతో మాట్లాడి పలు సమస్యలను తక్షణమే పరిష్కరించారు. ప్రభుత్వ పాలసీ, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి కొంత ఆలస్యం అవుతుందని కచ్చితంగా వాటిని కూడా పరిష్కరిస్తానని అర్జీలు అందించిన వారికి ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు ఉద్దేశించి ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.... నమ్మి అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో శక్తివంతం లేకుండా పనిచేస్తున్నానన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో తమిరిశ గ్రామంలో కోటి 90 లక్షలకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. నేడు అర్జీలు అందించిన ప్రజల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి : ఎమ్మెల్యే భాష్యం



పెదకూరపాడు (చైతన్యరథం): 63వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ 100రోజులు 100 గ్రామాలు కార్యక్రమాన్ని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం బెల్లంకొండ మండలం సెంటర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమయం పట్టే సమస్యలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న లింక్ రోడ్లను నిర్మించడంతో పాటు డొంక రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో వీధి లైట్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పనిచేయాలన్నారు. గ్రామ నాయకులతో సమావేశమై కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. గ్రామంలోని కార్యకర్తల ఇళ్లలో జరిగిన కార్యక్రమాల నేపథ్యం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాలతో మాట్లాడారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య తలెత్తినా వారికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, మండల, గ్రామ అధికారులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హీరో బాలయ్యకు స్వాగతం పలికిన ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ



గుంటూరు (చైతన్యరథం): నగరంలోని లక్ష్మీపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన వేగా జ్యువెల్లర్స్ షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా గుంటూరు విచ్చేసిన పద్మవిభూషణ్, నటసింహ నందమూరి బాలకృష్ణకి గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్లో హెలిపాడ్ వద్ద పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఏపీ టీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ. అనంతరం నందమూరి బాలకృష్ణ, వేగా జ్యువెల్లర్స్ అధినేతలతో కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మన్నవ మోహనకృష్ణ... ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నందమూరి బాలకృష్ణ వేగా జ్యువెల్లర్స్ షోరూమ్‌ని ప్రారంభించారు.

# విద్యుత్ రంగంలో మెరుగైన సేవలు

**: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం వినుకొండ పట్టణంలోని పలు వార్డుల్లో లో-వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించారు. ముఖ్యంగా 29వ వార్డు (హనుమాన్ నగర్)లో నెలకొన్న విద్యుత్ అంతరాయాలను తొలగించేందుకు రెండు నూతన ట్రాన్స్‌ఫార్మర్లను, అలాగే 17వ వార్డు (పెద్దనాల్లా బజార్)లో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధిలో భాగంగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాధన వినియోగంలో పారదర్శకత



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశం గురువారం పీఏసీ కమిటీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు ఆధ్వర్యంలో అమరావతి వెలగపూడిలోని అసెంబ్లీ భవనాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు మరియు పొలిట్‌బ్యూరో సభ్యులు, పీఏసీ కమిటీ సభ్యులు శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2014-15 రవాణా, రోడ్లు, భవనాల శాఖకు సంబంధించిన ఆడిట్ అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా టెండర్ డిస్కౌంట్ మాఫీ కారణంగా జరిగిన అదనపు వ్యయం, అలాగే ఆంధ్రప్రదేశ్ రోడ్లు రవాణా ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై అధికారులు సమర్పించిన నివేదికలను కమిటీ పరిశీలించింది. ఈ సమావేశంలో సంబంధిత శాఖ అధికారులతో కలిసి పలు కీలక అంశాలపై చర్చించి, ప్రజాధన వినియోగంలో పారదర్శకత మరియు బాధ్యతాయుత విధానాలు పాటించాల్సిన అవసరాన్ని శ్రీరాం రాజగోపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీ కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బారుకు వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

**●అధికారులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ఆదేశాలు**




విజయవాడ (చైతన్యరథం): ప్రజాదర్బారుకు వచ్చే సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అధికారులను ఆదేశించారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పరిష్కారం అయ్యేంత వరకు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో గురువారం ప్రజాదర్బారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వ ప్రజాస్వామ్య పాలనకు 'ప్రజాదర్బారు' కార్యక్రమ నిర్వహణ నిదర్శనమన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ, రైస్ కార్డులు, ఉపాధి, పెన్షన్లు, దివ్యంగుల సర్టిఫికెట్లు మంజూరు, తాగునీటి పైప్ లైన్స్ నిర్మాణం, భూ సంబంధిత సమస్యలు, రహదారుల అభివృద్ధి కోసం, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణకు, వివిధ రెవెన్యూ సేవలు, పోలీసు సేవలకు సంబంధించి అర్జీలు వచ్చాయి. ప్రజాదర్బార్ వేదికలో అన్నిశాఖల అధికారులు ప్రభుత్వ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం (పి.జి.ఆర్.ఎస్) ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి జవాబుదారీతనంతో పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ అక్కల రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

జోన్-4

(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)

చైతన్యరథం



# నీచ రాజకీయాలకు నిలువుటద్దం జగన్

## ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర... జువ్వలదిన్నె సాధనకు చంద్రబాబు, వెంకయ్యనాయుడు కారణమని స్పష్టీకరణ

నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య,ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్ డాక్టర్ జడ్ శివప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర రావు యాదవ్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, చెంచలబాబులతో కలిసి శాసనమండలి సభ్యుడు నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు బీద రవిచంద్ర విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీద మాట్లాడుతూ నెల రోజులుగా ఫిషింగ్ హార్బర్, కారైకల్ బోట్ల మాయం అంశాలపై వైస్సార్సీపీ నీచ రాజకీయాలు చేస్తున్నప్పటికీ మత్స్యకార గ్రామాల సాంప్రదాయాలు, కట్టుబాట్లపై ఉన్న గౌరవంతో తెలుగుదేశం పార్టీ నేతలు స్పందించలేదన్నారు. సాగర్ డిఫెన్స్ అకాడమీకి నారా లోకేష్ శంకుస్థాపన చేసి వెళ్ళాక అనేక అపోహలు, అనుమానాలు కల్పించి గందరగోళం సృష్టించేందుకు వైస్సార్సీపీ అనేక ప్రయత్నాలు చేస్తోందన్నారు. నిన్న వైయస్ జగన్ జువ్వలదిన్నె హార్బర్ ప్రాంతానికి వచ్చి బోట్ల చోరీకి సంబంధించి బీద సోదరుల కాల్ డేటా అంటూ ఓ కాగితం చూపారని, ఆ కాల్ డేటాలో అసలు ఏముందని జగన్‌ను ప్రశ్నిస్తున్నానన్నారు. జనవరికి, సంక్రాంతికి శుభాకాంక్షలు చెప్పేందుకు చేసిన కాల్స్ తప్ప కొత్తగా ఏమున్నాయి ఆ కాల్ డేటాలో అని ప్రశ్నించారు. ఆ గ్రామాన ఫిబ్రవరి 28న, కొంతమంది కావలి వైస్సార్సీపీ నేతలు ఇతర రాష్ట్రాలను కేంద్రంగా చేసుకుని నడుపుతున్న క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ రాకెట్ పై జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు అరెస్టులు చేశారన్నారు.

గ్రామంలో తలెత్తిన సమస్యలతో ఎంపీకి, స్థానిక ఎమ్మెల్యేకు, ఫోన్‌లు చేసి సమస్య పరిష్కరించాలని మత్స్యకారులు కోరారని, అంతకుమించి ఏ సంభాషణ ఉందని నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రి కాల్ డేటా కాగితం చూపించి నోటికొచ్చినట్టు మాట్లాడి వెళ్లారని ధ్వజమెత్తారు. మంత్రి లోకేష్, బీద సోదరులు కలిసి ఈ బోట్ల చోరీకి కుట్ర పన్నారని నిరాధార ఆరోపణలు చేశారన్నారు. బోట్ల చోరీపై తక్షణమే విచారణ జరిపించాలని, ఇది తన పరువు ప్రతిష్టలకు సంబంధించిన విషయమని బీద మస్తాన్ రావు స్పష్టంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇదివరకే కోరారని వెల్లడించారు. మీ కుటుంబానికి ఊడిగం చేసి, తన అన్న ముఖ్యమంత్రి కావడానికి జీవితకాలం కష్టపడిన వైఎస్ వివేకానంద రెడ్డిని చంపినప్పుడు వచ్చిన తొలికాల్ మీ సతీమణికి కాదా జగన్ అని ప్రశ్నించారు. వైఎస్ వివేకానంద రెడ్డి చనిపోయినప్పుడు, వేకువజామున మొదటగా తెలిసింది మీకు, అజయ్ కల్లం రెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కేనన్నారు. మా ఫోన్ కాల్స్ మీకు వచ్చిన కాల్స్ లాంటివి కాదులే జగన్ అని ఎద్దేవా చేశారు. హార్బర్‌లో రెండు సంవత్సరాలుగా పనిజరగడం లేదని జగన్ చెప్పడం వింతగా ఉందన్నారు. మీ ఎంపీ, నెల్లూరు జిల్లా వైస్సార్సీపీ ఇన్చార్జ్ మేడా రఘునాథ్ రెడ్డి చేత పనులు ఎందుకు చేయించలేకపోయారని నిలదీశారు. చేయని పనులకు 2024 మార్చి నాటి వరకు మొత్తం దోచేశారని ఆరోపించారు. మీరంతా హార్బర్‌లో ఊడ్చుకుపోతే పనులు మాత్రం మేము చేస్తున్నామని వెల్లడించారు. రోడ్లు లేవు, బ్రిడ్జిలు లేవు, మీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి పనులు చేయకపోతే అందుకు కారణం మేమా జగన్ అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల అప్పులు, నువ్వు ఇచ్చిన హార్బర్లలో విజిలెన్స్ విచారణకు సిద్ధమా జగన్? మీ ఎంపీ ఫిషింగ్ హార్బర్లను ఎలా నిర్మించారన్న విషయం పై విజిలెన్స్ ఎంక్వయిరీకి సిద్ధమా?1250 బోట్లు హార్బర్‌కి తెచ్చేవాడివా జగన్ ! తెప్ప, వల, బోట్, మోపెడ్, సైకిల్, ఐస్ బాక్సులలో ఏ ఒక్కటైనా మత్స్యకారులకు ఇచ్చావా? నీకు చంద్రబాబు, లోకేష్‌లకు వార్నింగ్ ఇచ్చే అర్హత ఉందా? మత్స్యకారులకు ఏదైనా చేశామని చెప్పుకునే హక్కు, ధైర్యం మాకుంది... మత్స్యకారులకు మేలు చేసి చూపించిన ఘనత నారా చంద్రబాబు నాయుడుకు ఉంది. మత్సకారులకు ద్రోహం చేసిన కుటుంబం వైఎస్ కుటుంబం. నీ తండ్రి వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో జువ్వలదిన్నెకు ఫిషింగ్ హార్బర్ శాంక్షన్ ఇవ్వలేదు. 2008లో సోనియాగాంధీ పోర్టును ప్రారంభిస్తే, తక్షణమే ప్రారంభం కావాల్సిన ఫిషింగ్ హార్బర్ ఎందుకు ప్రారంభం కాలేదు? అడ్డుకున్నది నాటి ముఖ్యమంత్రి, మీ తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాదా జగన్ అని నిలదీశారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ను ఇచ్చింది చంద్రబాబు, సహకరించింది ముప్పవరపు వెంకయ్య నాయుడు, టీడీపీ తెచ్చిన హార్బర్లకు టెండర్లు పిలుచుకుని కాంట్రాక్టులు చేసుకున్న పార్టీ మీది. మత్స్యకారులకు వైఎస్ కుటుంబం చేసిన ద్రోహం గడపగడపకూ తిరిగి చెప్పగలం జాగ్రత్త జగన్ అని హెచ్చరించారు.



# కష్టానికి గుర్తింపు టీడీపీలోనే సాధ్యం

## డాక్టర్ నూకసానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందనలు

ఒంగోలు (చైతన్యరథం): కష్టపడే నాయకత్వాన్ని గుర్తించి ఉన్నత స్థాయికి చేర్చే రాజకీయ సంస్కృతి తెలుగుదేశం పార్టీకే ప్రత్యేకమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులుగా డాక్టర్ నూకసాని బాలాజీ నియామకంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. నూకసాని బాలాజీమంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పార్టీ అధిష్టానం అప్పగించే ప్రతి బాధ్యతను డాక్టర్ బాలాజీ నిబద్ధతతో నిర్వర్తించి, పూర్తి స్థాయిలో న్యాయం చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగడం సాధారణ విషయం కాదని, అది కేవలం కృషి, పట్టుదల, అంకితభావంతోనే సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ కష్టపడే నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తూ, పోలిట్‌బ్యూరో నుంచి గ్రామస్థాయి కమిటీల వరకు అవకాశాలు కల్పిస్తోందని వివరించారు.పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసే వారికి టీడీపీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

# స్వీయ గణనలో ఎమ్మెల్యే దామచర్ల వివరాలు నమోదు

ఒంగోలు (చైతన్యరథం): నగరంలోని తన నివాసంలో శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్ మున్సిపల్ కమీషనర్ రాంభూల్ రెడ్డి ఆధ్వర్యంలో స్వీయ గణన కింద తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ, భారత ప్రభుత్వశీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, జనగణన-2027 ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొదటిసారిగా 'స్వీయ గణన' కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు తామే స్వయంగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకునేందుకు వీలుగా ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30 వరకు 15 రోజుల పాటు షెడ్యూల్ జారీ అయ్యింది. అందులో భాగంగా తాను స్వయంగా కమీషనర్ రాంభూల్ రెడ్డి ఆధ్వర్యంలో స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నామని ఎమ్మెల్యే దామచర్ల వెల్లడించారు. వచ్చేనెల 1వ తేదీ నుండి నెల రోజుల పాటు ఎన్యుమరేటర్స్ వచ్చి ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు నమోదు జరగుతుందని ప్రజలు అందుబాటులో వున్న సమయాన్ని ఎన్యుమరేటర్స్ కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా ఈ జనగణనకు సహకరించి తమ వివరాలను తెలియచేయాలని అన్నారు.



# పని చేసేవారికే పట్టంగట్టే పార్టీ టీడీపీ

నెల్లూరు (చైతన్యరథం): రూరల్ నియోజకవర్గ పరిధిలోని 41వ డివిజన్, మనుమసిద్ధి నగర్‌లో 37, 38, 41 డివిజన్లలో 1 కోటి 95 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మారిటోరియం ఛైరన్ దామచర్ల సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు. నగర మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, సయ్యద్ తహసిన్ మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ పాల్గొన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ దామచర్ల కుటుంబం మొదటి నుంచి టీడీపీలో ఉందని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజల కోసం పోరాటం చేశారని వివరించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కొన్ని పనులు పూర్తయ్యాయని, మరికొన్ని పనులు జరుగుతున్నాయని, మరికొన్ని ప్రారంభదశలో ఉన్నాయని వివరించారు. టీడీపీలో అతిసామాన్యులకి సైతం ఉన్నత పార్టీ పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. ఇష్టంగా కష్టం చేస్తే ఖచ్చితంగా ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఎమ్మెల్యేల




ప్రమేయం లేకుండానే... నేరుగా చంద్రబాబు, లోకేశ్ పదవులు ఇస్తారు. నేతలు ఎప్పుడూ జనంలో ఉండాలి, జనం కోసం పనిచేయాలని క్లస్టర్ ఇన్ ఛార్జీలకి సైతం రాష్ట్ర కమిటీల్లో స్థానం దక్కడం టీడీపీలోనే సాధ్యమన్నారు. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు, కో క్లస్టర్ ఇంచార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బస్సు ప్రమాద బాధిత కుటుంబానికి బాసటగా నిలుస్తాం : ఎమ్మెల్యే కాకర్ల సురేష్ భరోసా

కలిగిరి (చైతన్యరథం): మార్కాపురంలో జరిగిన దురదృష్టకర బస్సు దగ్ధంప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కలిగిరి (చైతన్యరథం): కలిగిరి మండలం నాగసముద్రం పంచాయతీ పరిధిలోని బొమ్మరాజు చెరువు ఎస్సీ కాలనీకి చెందిన ఆత్మకూరు చిన్నయ్య కుటుంబాన్ని ఆదుకోవడానికి ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ ముందుకు వచ్చి, వారి కుటుంబానికి ఇంటి పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్నయ్య మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వం ప్రజాప్రతినిధులు బాధితులకు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, అధికారులు గ్రామస్తులు పాల్గొని, చిన్నయ్య కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు. వారు కుటుంబానికి ధైర్యం చెప్పి, భవిష్యత్తులో అన్ని విధాలుగా సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

జోన్-5
(నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం, కడప)
చైతన్యరథం

# ప్రజా సంక్షేమం కోసం ఆధ్యాత్మిక సంకల్పం

## సీఎం చంద్రబాబు కోసం కొనసాగుతున్న కాలవ క్రతువు



రాయదుర్గం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్ర చిరస్మరణీయంగా సాగాలని కోరుకుంటూ రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు నిర్వహిస్తున్న దశదిన హోమాలు ఆధ్యాత్మిక పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. ముఖ్యమంత్రిపై ఉన్న అచంచలమైన అభిమానంతో ఆయన నిర్వహిస్తున్న 10 రోజుల హోమ క్రతువు గురువారానికి ఆరవ రోజుకు చేరుకోంది. గురువారం ఆయన సకుటుంబ సమేతంగా చిన్నమస్తా దేవి హోమం నిర్వహించారు. ప్రతిరోజూ శాస్త్రోక్తంగా జరుగుతున్న పూజా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత క్రమశిక్షణతో ఈ క్రతువును నిర్వహిస్తున్నారు. చంద్రబాబు నాయుడు కేవలం ఒక వ్యక్తి కాదు, ఆయన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఒక శక్తి. అటువంటి నాయకుడు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుందన్నది కాలవ శ్రీనివాసులు నమ్మకం. ఇప్పటివరకు ప్రజలు అందించిన సహకారానికి కృతజ్ఞతగా, భవిష్యత్తు బాగుండాలని దేవుడిని వేడుకుంటున్న కాలవ శ్రీనివాసులు సంకల్పాన్ని అంతా అభినందిస్తున్నారు. సంక్షోభ సమయాల్లోనూ, అభివృద్ధి పనుల్లోనూ దైవ బలం తోడైతే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని పెద్దలు చెబుతుంటారు. కాలవ శ్రీనివాసులు నిర్వహిస్తున్న ఈ హోమాలు చంద్రబాబు నాయుడుకు ఒక ఆధ్యాత్మిక రక్షణ కవచంలా నిలుస్తాయని అభిమానులు నమ్ముతున్నారు. అంకితభావం కలిగిన నాయకుడు కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ 10 రోజుల శాంతి హోమాలు విజయవంతంగా పూర్తి చేయడానికి ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు.

# మంత్రి లోకేశ్ నాయకత్వం.. టీడీపీకి మరింత బలం!



అనంతపురం (చైతన్యరథం): జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు గారు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. 20వ తేదీన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు ప్రతి గ్రామంలో నిర్వహించాలని నిర్ణయించారు. యువగళం రథసారథి నారా లోకేష్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. పలు అంశాలపై జిల్లా కమిటీ నాయకులకుజిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు దిశా నిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షునిగా అవకాశం కల్పించడంతో మొహమ్మద్ నజీర్ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబానాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు లకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తులో పార్టీ పరంగా మరింత బాధ్యత, నిబద్ధతతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని, గౌరవాన్ని నిలబెట్టుకుంటానన్నారు. లోకేష్ నాయకత్వంలో రానున్న రోజుల్లో టీడీపీ క్షేత్రస్థాయిలో మరింత బలపడుతుందన్నారు. 2029లో మరోసారి గెలుపే లక్ష్యంగా నారా లోకేష్ నాయకత్వంలో పనిచేస్తానని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన తెలుగుదేశం పార్టీ నాయకత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటానని నజీర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీ,ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు నజీర్ కృతజ్ఞతలు తెలిపారు. నజీర్‌కు కీలక పదవి దక్కడంపై పలువురు నాయకులు, కార్యకర్తలు, ముస్లిం పెద్దలు అభినందనలు తెలిపారు.

# మంత్రి టీజీ భరత్‌కు ఘన స్వాగతం

## పాల్గొన్న రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



రాయదుర్గం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ రాయదుర్గం పట్టణ పర్యటనలో భాగంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం మంత్రి వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయాన్ని, స్థానిక జంబుకేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. అక్కడ వేద పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, వారు నిరంతరం ప్రజా సేవలో కొనసాగాలని కోరుకుంటూ, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గత ఆరు రోజులుగా తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు

పర్యటనలో భాగంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుతో పాటు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కూడా పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు కాదలూరు మోహన్ రెడ్డి, కాలవ సన్నన్న, కురుబ హనుమంతు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, కార్మిక కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట శివుడు యాదవ్, బిజెపి వసుంధర దేవి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కరేగౌడ్ర మంజునాథ్, కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, జిల్లా అధికార ప్రతినిధి పసుపు లేటి నాగరాజు, మాజీ కౌన్సిలర్లు టంకశాల హనుమంతు, బండి భారతి, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు జయంతి సురేష్, బిసా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# జన గణనకు అంతా సహకరించాలి

## కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపు

కదిరి (చైతన్యరథం): భారతదేశ జనాభా గణన 2027 కార్యక్రమంలో భాగంగా ఈ రోజు నుంచి స్వీయ గణన ప్రారంభమైన నేపథ్యంలో కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆయన స్వగృహంలో స్వీయ గణన పోర్టల్ ద్వారా కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ డిజిటల్ విధానం ద్వారా వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వీయ గణన సౌకర్యాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సులభంగా, త్వరగా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని స్వీయ గణనలో చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, కదిరి ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేశ్ నాయకత్వానికి సర్వత్రా మద్దతు

జమ్మలమడుగు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన మంత్రి యువగళం రథసారథి నారా లోకేష్‌కు హృదయపూర్వక శుభాభినందనలు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ, కార్యకర్తలతో సన్నిహితంగా, కష్టాల్లో అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న మీ నాయకత్వానికి ఇది తగిన గుర్తింపు అని కొనియాడారు. యువగళం పాదయాత్ర ద్వారా తెలుగుదేశం పార్టీని విజయం తీరాలకు చేర్చిన మీ నాయకత్వంలో పార్టీ మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు.




# ఒంటిమిట్ట రాములోరి ఆదాయం రూ. 29 లక్షలు

ఒంటిమిట్ట ( చైతన్యరథం): ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామివారి ఆలయంలో హుండీ లెక్కింపు చేపట్టారు. రూ.29,00,205 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారి నవీన్ కుమార్ తెలిపారు. ఆలయంలోని రంగ, ముఖ మండపం, భక్త సంజీవరాయ స్వామి.ఆలయంలో హుండీలను తెరిచి లెక్కించారు. తితిదే పరిపాలన, విజిలెన్స్ అధికారులపర్యవేక్షణలో శ్రీవారి సేవకులు లెక్కింపు చేపట్టారు. మార్చి 26 నుంచి ఈ నెల 5వరకు శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. రాములోరిదర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆరాధ్య దైవంజగదభిరాముడిని దర్శించిన అనంతరం భక్తులు హుండీల్లో కానుకలను వేశారు. నెలరోజుల వ్యవధిలో ఆలయానికి రూ.29 లక్షలు ఆదాయం రావడం గత పదేళ్ల కాలంలో ఇదే తొలిసారి అని ఆలయ అధికారులు తెలిపారు.



### జూన్ 13 నుంచి డెలావేర్‌లో...

# 'మాటా' క్రికెట్ టోర్నీ

**డెలావేర్:** మన అమెరికా తెలుగు సంఘం (MATA) ఆధ్వర్యంలో జూన్ నెలలో భారీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. క్రీడాభిమానులను, తెలుగు కమ్యూనిటీని ఉత్సాహపరిచే లక్ష్యంతో డెలావేర్‌లోని లమ్స్ పాండ్ స్టేట్ పార్క్ వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి.

**తేదీలు:** జూన్ 13, 14

**సమయం:** ఉదయం 8 గంటలకు ప్రారంభం.

**వేదిక:** ఏరియా 1 గ్రౌండ్, లమ్స్ పాండ్ స్టేట్ పార్క్ (1068 Howell School Rd, Bear, DE).

**రిజిస్ట్రేషన్ ఫీజు:** ఒక టీమ్‌కు 350 డాలర్లు.




టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన జట్లకు భారీ నగదు బహుమతులు అందించనున్నారు.

విజేత: $1500 నగదు, ట్రోఫీ.

రన్నరప్: $750 నగదు, ట్రోఫీ.

ఈ టోర్నమెంట్‌లో విజేతలకు జూన్ 19, 20 తేదీల్లో పెన్సిల్వేనియాలోని గ్రేటర్ ఫిలడెల్ఫియా ఎక్స్‌పో సెంటర్లో జరిగే 'మాటా 2వ కన్వెన్షన్'లో బహుమతులు అందజేస్తారు. ఈ ప్రతిష్టాత్మక మహాసభల్లో వేలాది మంది ప్రతినిధుల సమక్షంలో క్రీడాకారులను గౌరవిస్తారు.

**నిర్వాహక బృందం, రిజిస్ట్రేషన్:** ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేందుకు 'మాటా' అధ్యక్షుడు రమణ కిరణ్ దుడ్డగి, కన్వీనర్ శ్రీధర్ గూడాల నేతృత్వంలోని కార్యవర్గ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన వారు పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ ద్వారా లేదా tinyurl.com/MATADECricket లింక్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు శేషు (267-275-3281) లేదా జై (712-265-1151)లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

### జూన్ 20న ప్రత్యేక

# యూత్ ఫోరం

**పెన్సిల్వేనియా:** మన అమెరికా తెలుగు సంఘం (MATA) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 2వ కన్వెన్షన్ వేడుకలు పెన్సిల్వేనియాలోని ఓక్స్ నగరంలో జూన్ 19, 20 తేదీల్లో జరగనున్నాయి. గ్రేటర్ ఫిలడెల్ఫియా ఎక్స్‌పో సెంటర్ వేదికగా జరిగే మహాసభల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.




కన్వెన్షన్ రెండో రోజైన జూన్ 20 (శనివారం) మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు (EST) ప్రత్యేకంగా 'యూత్ ఫోరమ్' నిర్వహించనున్నారు. "కల్చర్, టాలెంట్, ఫన్" (సంస్కృతి, ప్రతిభ, వినోదం) అనే నినాదంతో యువతను ఉత్సాహపరిచేందుకు ఈ వేదికను సిద్ధం చేశారు. ఈ ఫోరమ్‌లో పాల్గొనే యువత కోసం పలు ఆసక్తికరమైన అంశాలను కమిటీ ఏర్పాటు చేసింది.

సినీ తారలతో ముఖాముఖి: ప్రముఖ సినీ నటులను కలిసే (Meet & Greet) అద్భుత అవకాశం.

సరదా క్రీడలు: కహూత్ (Kahoot), మూవీ ట్రివియా వంటి క్విజ్ పోటీలు, ఫన్ గేమ్స్. పోటీల్లో గెలుపొందిన వారికి ఎక్సైటింగ్ ప్రైజెస్ అందజేత.

**నిర్వాహక కమిటీ ...**

ఈ యూత్ ఫోరమ్ కార్యక్రమానికి చైర్‌గా సాయి చేతన్ దండమూడి, కో-చైర్లుగా శరణ్య దుడ్డగి, అన్విత గూడూరు వ్యవహరిస్తున్నారు. కళ్యాణి బెల్లంకొండ, బాలాజీ జిల్లా సలహాదారులుగా పర్యవేక్షిస్తున్నారు. ఆసక్తి గల వారు పోస్టర్‌లో అందించిన లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

**కమిటీ సభ్యులు**

'మాటా' అధ్యక్షులు రమణ కిరణ్ దుడ్డగి, కన్వీనర్ శ్రీధర్ గూడాల, కో-కన్వీనర్ టోనీ జన్న నేతృత్వంలో కార్యవర్గ కమిటీ సభ్యులు ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. వ్యవస్థాపకులు, సలహా కమిటీ సభ్యులైన శ్రీనివాస్ గణగోని, ప్రదీప్ సామల, జితేందర్ రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ కన్వెన్షన్ జరగనుంది. మరిన్ని వివరాల కోసం మాటా హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## 22న టెన్నిస్ టోర్నమెంట్

**కొలంబస్:** కొలంబస్ తెలంగాణ అసోసియేషన్ 2026 సంవత్సరానికి 'టెన్నిస్ టోర్నమెంట్' నిర్వహించనున్నట్టు స్పోర్ట్స్ టీమ్ వెల్లడించింది. టోర్నీ ఈ నెల 22న ప్రారంభమవుతుంది. ఆసక్తి గలవారు ఈ నెల 20వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. DIV-1: సింగిల్స్, డబుల్స్, DIV-2: సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజు: అసోసియేషన్ సభ్యులకు $15, సభ్యులు కాని వారికి $25. విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు అందజేస్తారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా వెంటనే రిజిస్టర్ చేసుకోవాలని కోరుతున్నారు. మరిన్ని వివరాలకు మారుతి (626-233-7776), సత్య చౌహాన్ (330-475-6497), మధు రెడ్డి (614-707-8262)లను సంప్రదించవచ్చు.







# నష్‌విల్లేలో క్రీడోత్సాహం

### టెన్నెస్సీ తెలుగు సమితి ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీ

### చాంపియన్‌గా నిలిచిన 'హిట్‌మెన్' జట్టు

**నష్‌విల్లే:** నష్‌విల్లేలోని తెలుగు కమ్యూనిటీని ఒకే తాటిపైకి తెస్తూ టెన్నెస్సీ తెలుగు సమితి (TTS) నిర్వహించిన పురుషుల వాలీబాల్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా ముగిసింది. క్రీడాకారుల నైపుణ్యం, అంకితభావం, క్రీడాస్ఫూర్తితో క్రీడా వేడుక ఆద్యంతం అలరించింది. మొత్తం 12 జట్లు పాల్గొని టైటిల్ కోసం తలపడ్డాయి. జట్లను రెండు గ్రూపులుగా విభజించారు.

గ్రూప్-ఎ: స్మాష్ చాంప్స్, G.O.A.T, టైగర్స్, హోలీ వాలీ, ఫ్రాంక్లిన్ ఫ్లయర్స్, ఫైర్‌బాల్.

గ్రూప్-బి: హిట్‌మెన్, స్పైకింగ్స్, డెత్ వాలీ, అమిగోస్, వీజీ బ్లాకర్స్, కరాసునో.

**హోరాహోరీ పోరు...**

నరాలు తెగే ఉత్కంఠగా జరిగిన సెమీ ఫైనల్స్‌లో G.O.A.T జట్టుపై 'హిట్‌మెన్' విజయం సాధించగా, 'స్పైకింగ్స్' జట్టుపై 'స్మాష్ చాంప్స్' గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నాయి. గ్రాండ్ ఫినాలేలో 'హిట్‌మెన్', 'స్మాష్ చాంప్స్' జట్ల మధ్య హోరాహోరీ పోరు సాగింది. చివరికి అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన 'హిట్‌మెన్' జట్టు చాంపియన్‌గా నిలవగా, 'స్మాష్ చాంప్స్' రన్నరప్‌గా నిలిచింది.

**నిర్వాహకులకు కృతజ్ఞతలు**


ఈ టోర్నమెంట్‌ను గ్రాండ్ సక్సెస్ చేసిన నిర్వాహకులు, వాలంటీర్లు, అంపైర్లు, రెఫరీలకు హారిక కనగాల, ఇతర సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారుల ఉత్సాహం




ఈ పోటీలను చిరస్మరణీయం చేసిందని, భవిష్యత్తులో మరిన్ని పెద్ద టోర్నమెంట్లను నిర్వహిస్తామని నిర్వాహక బృందం పేర్కొంది. నష్‌విల్లే తెలుగు కమ్యూనిటీ మద్దతుతోనే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతమవుతున్నాయని వారు ఆనందం వ్యక్తం చేశారు.



# పశ్చిమాసియా, ఉక్రెయిన్లో సుస్థిర, సుదీర్ఘ శాంతికి కృషి



## ప్రధాని మోదీ, ఆస్ట్రియన్ ఛాన్సలర్ సాకర్ వెల్లడి

పశ్చిమాసియా, ఉక్రెయిన్లో సుస్థిర, సుదీర్ఘ శాంతికి ప్రధాన మంత్రి మోదీ పిలుపునిచ్చారు. ఆస్ట్రియన్ ఛాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్తో కలిసి ప్రెస్మీట్లో పాల్గొన్న మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధ క్షేత్రాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. "కొన్ని దేశాల యుద్ధం కారణంగా ప్రపంచం మొత్తం ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆ ప్రభావం మనందరి జీవనాలపై పడుతోంది. ఈ సైనిక ఘర్షణలకు ఇంకా పరిష్కారం లభించలేదు. అది ఉక్రెయిన్ అయినా, పశ్చిమాసియా అయినా శాశ్వత శాంతి, సుస్థిరత కావాలని కోరుకుంటున్నాం. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడానికి సంస్కరణలు చేపట్టాలి. ఇందుకోసం ఉగ్రవాదాన్ని పారదోలడం ఎంతైనా అవసరం" అని మోదీ పేర్కొన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత ఆస్ట్రియా ఛాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్ రాకతో భారత్లో లో వాణిజ్య, పెట్టుబడుల రంగంలో నూతనోత్సాహం మొదలైందని మోదీ తెలిపారు. భారత్- ఈయూ మధ్య కొత్త ఒప్పందాలతో సువర్ణాధ్యాయం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఆస్ట్రియా ఛాన్సెలర్ పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసేందుకు నాలుగురోజుల పాటు భారత్లో పర్యటిస్తున్నారు.



# ఆ క్రెడిట్ మాకొద్దు.. మీరే తీసుకోండి!

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని మోదీ పిలుపు

మహిళా రిజర్వేషన్లను తీసుకురావడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదని పేర్కొన్నారు చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు ఉద్దేశించిన 3 కీలక బిల్లులను కేంద్రం లోక్సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. వీటిపై చర్చలో భాగంగా ప్రధాని మోదీ సభలో ప్రసంగించారు. మహిళా రిజర్వేషనను వ్యతిరేకించే వారు మూల్యం చెల్లించుకోక తప్పదంటూ విపక్షాలను హెచ్చరించారు.

"దేశ పార్లమెంట్ చరిత్రలో ఈ రోజును మర్చిపోలేం. మహిళా రిజర్వేషన్ గొప్ప బిల్లు. ఈ చారిత్రక సమయంలో పాలు పంచుకోవడం నా అదృష్టం. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాదనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు.

"మహిళా రిజర్వేషన్ల కోసం 30 ఏళ్ల పాటు ప్రయత్నాలు జరిగినా గతంలో ఇది సాకారం కాలేదు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2020 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లే. ఈ బిల్లును తేవడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరు, బిల్లును వ్యతిరేకించే పార్టీలకు, నేతలకు మహిళలు బుద్ధి చెబుతారు. సమయం చూసి దెబ్బకొడుతారు. మహిళా బిల్లులకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ ఉంటుంది" అని విపక్షాలకు ప్రధాని చురకలంటించారు. "ఈ బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికి అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం" అని మోదీ స్పష్టం చేశారు. "ఈ బిల్లుతో దేశంలోని మహిళలకు వారి హక్కులను కల్పిస్తున్నాం. ఈ బిల్లుపై క్రెడిట్ నాకు అవసరం లేదు. మీరే (విపక్షాలను ఉద్దేశిస్తూ) తీసుకోండి.. మహిళా బిల్లుపై అన్ని పార్టీల నేతల ఫొటోలూ వేసుకోండి. ఈ బిల్లును అడ్డుకోకుండా సహకరించి మీ గొప్పతనం చాటుకోండి, మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిద్దాం" అని మోదీ విపక్షాలను కోరారు.

# మహిళా బిల్లుపై ప్రజల్లో ఆందోళన రేపొద్దు



## విపక్షాలకు కేంద్రమంత్రి అమిత్ షా కౌంటర్

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్సభ ముందుకు తీసుకొచ్చింది. ఈ సందర్భంగా విపక్షాలు తమ అభ్యంతరాలను లేవనెత్తగా.. వాటిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. 2024లో మహిళా రిజర్వేన్లను ఎందుకు అమలు చేయలేదని లోక్సభలో బిల్లులు ప్రవేశపెట్టడానికి ముందు జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. 2023లోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వం హైజాక్ చేస్తోందన్నారు. దీనిపై అమిత్ స్పందిస్తూ.. బిల్లు ప్రవేశపెట్టకుండానే ఎలా ప్రశ్నిస్తారని అసహనం వ్యక్తంచేశారు. బిల్లు సభలో ప్రవేశపెట్టిన తర్వాత సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. "ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయని, జనగణన ఎందుకు చేపట్టలేదని అఖిలేశ్ ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రక్రియ ఇప్పటికే మొదలైందన్న విషయం గుర్తించాలి. ప్రస్తుతం ఇళ్ల గణన జరుగుతోంది. ఇళ్లకు ఎలాంటి జాతి ఉండదు. సమాజ్వాదీ పార్టీ ఇళ్లకు కూడా జాతిని ఆపాదిస్తోంది. వ్యక్తుల జనగణన జరిగిన సమయంలోనే జాతి ప్రస్తావన ఉంటుంది" అని కేంద్ర మంత్రి కౌంటర్ ఇచ్చారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును సమాజ్వాదీ, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకించాయి. దక్షిణాది ప్రాంతాలకు ప్రాతినిధ్యం లేకుండా ఈ బిల్లు చేస్తుందన్నారు. ఈ సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, అవి శాండ్విచ్ బిల్లులని డీఎంకే ఆరోపించింది.

## మహిళా బిల్లుతో ఎవరికీ ఎలాంటి నష్టం జరగదు : కేంద్రమంత్రి మేఘ్వాల్



మహిళా రిజర్వేషన్ల అమలుతో ఏ రాష్ట్రానికి గానీ, పురుషులకు గానీ ఎలాంటి నష్టం జరగదని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్ వాల్ స్పష్టం చేశారు. పార్లమెంటులో మూడు బిల్లులపై కేంద్రమంత్రి మేఘ్ వాల్ ప్రసంగించారు. ఈ బిల్లులతో లోక్సభలో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని అన్నారు. "పార్లమెంట్ చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు, మహిళా రిజర్వేషన్లను అమలుచేయాల్సిన సమయం వచ్చింది. కొన్ని బిల్లులను భావితరాలు మరువలేవు. ఆర్టికల్ 368 ద్వారా ప్రజాహిత నిర్ణయాలను తీసుకునేందుకు పార్లమెంట్కు రాజ్యాంగం శక్తినిచ్చింది. ఈ క్రమంలోనే మూడు కీలక బిల్లులను లోక్సభలో ప్రవేశపెట్టాం. లోక్సభ స్థానాలను 50శాతానికి పెంచేందుకు వీటిని తీసుకొచ్చాం. ఈ బిల్లులతో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుంది. లోక్సభ స్థానాలు 815కు పెరగడంతో మహిళలకు 272 సీట్లు లభిస్తాయి. అనంతరం ఈ బిల్లులను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడారు. "మహిళల రిజర్వేషన్లకు సంబంధించి మూడేళ్ల క్రితం ఇవే చర్చలు జరిగాయి. వాటినే కేంద్రం మళ్లీ చెబుతోంది. 2023 కంటే ముందు ఐదుసార్లు మహిళలకు సంబంధించిన చట్టాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ మహిళల రిజర్వేషన్లకు అనుకూలంగా ఉంది. మహిళా రిజర్వేషన్లను లోక్సభ స్థానాల పెంపునకు ముడిపెట్టవద్దు. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేస్తామని గతంలో హోం మంత్రి చెప్పారు. మహిళా రిజర్వేషన్లను మరింత ఆలస్యం చేయాలని కేంద్రం చూస్తోంది" అని కాంగ్రెస్ ఎంపీ విమర్శించారు.

## ఢిల్లీ విమాశ్రయంలో ప్రమాదం : ప్రయాణికులు సురక్షితం

దేశ రాజధాని ఢిల్లీ ఎయిర్పోర్టులో స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. రన్వేపై ఆగి ఉన్న ఆకాశ ఎయిర్ విమానాన్ని స్పైస్ జెట్ విమానం పక్కనుంచి ఢీకొట్టింది. అయితే, ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు.ఢిల్లీ నుంచి హైదరాబాద్ బయల్దేరేందుకు ఆకాశ ఎయిర్ విమానం రన్వేపై ఉంది. అదే సమయంలో పార్కింగ్ వైపు ప్రయాణిస్తున్న స్పైస్ జెట్ విమానం.. ఆకాశ విమానాన్ని పక్కనుంచి తాకుతూ వెళ్లింది. ఈ ప్రమాదంలో స్పైస్ జెట్ (రాజూఅఎవశ్రీవ్) కుడివైపు రెక్క భాగం ధ్వంసమవ్వగా.. ఆకాశ ఎయిర్ విమానం ఎడమవైపు భాగం స్వల్పంగా దెబ్బతింది.ప్రమాదంపై ఆకాశ ఎయిర్ అధికార ప్రతినిధి స్పందించారు. "ఈ ఘటనతో ప్రయాణికులు, సిబ్బందిని వెంటనే విమానం నుంచి కిందకు దింపాం. వారి భద్రత మా ప్రథమ ప్రాధాన్యం. ప్రయాణికులను హైదరాబాద్ పంపించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం" అని వెల్లడించారు.



# యుద్ధం నీడలో ప్యాలెస్ ఆన్వీల్స్ నత్తనడక

భారత్కు వచ్చే విదేశీ సందర్శకులకు 'ప్యాలెస్ అన్ వీల్స్' ఓ పెద్ద ఆకర్షణ. రాజస్థాన్ ఎడారిలో ఓ ప్రశాంతమైన ప్రయాణాన్ని ఆస్వాదించేందుకు ఎక్కువ మంది ఈ ట్రైన్ జర్నీని ఎంపిక చేసుకుంటారు. లగ్జరీ కోచ్లు అత్యాధునిక సదుపాయాలతో ఉండే ఈ రైలు ప్రయాణానికి ఆసక్తి చూపిస్తారు. అయితే పశ్చిమాసియా యుద్ధం ఎఫెక్ట్ ఇప్పుడు ఈ ట్రైన్పై కూడా పడింది. అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా సందర్శకుల ప్రయాణాలు తగ్గాయి. ఈ విలాసవంతమైన ట్రైన్లో కనీసం క్యాబిన్లు కూడా నిండట్లేదని అధికారులు వాపోతున్నారు. విదేశాల నుంచి మన దేశానికి సందర్శనకు వచ్చే ప్రయాణికులు తగ్గడంతో ఈ పరిస్థితులు ఏర్పడ్డాయి. 1982 నుంచి విదేశీ సందర్శకుల తాకిడి ఎక్కువ అవడంతో ఈ లగ్జరీ ట్రైన్ ప్రయాణాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం ప్యాలెస్ ఆన్ వీల్స్ బుకింగ్స్ తగ్గడంతో రాజస్థాన్పర్యాటక విభాగంలో ఆందోళన నెలకొంది. ఈ సీజన్లో అతి తక్కువగా 30 మంది ప్రయాణికులతో ప్యాలెస్ ఆన్ వీల్స్ జైసల్మేర్కు ప్రయాణాన్ని పూర్తి చేసింది. తక్కువ బుకింగుల కారణంగా తర్వాత రెండు ట్రిప్పులను క్యాన్సిల్ చేసినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. సాధారణంగా ఒక ట్రిప్కి 14 క్యాబిన్లు బుకింగ్ కావాలి. కానీ పది క్యాబిన్లు కూడా నిండకపోవడంతో క్యాన్సిల్ చేయక తప్పలేదని తెలుస్తోంది. ప్యాలెస్ ఆన్ వీల్స్, 43 ఏళ్ల సర్వీసులో ట్రిప్పులను రద్దు చేయడం ఇది రెండో సారి మాత్రమే. గతంలో ఇజ్రాయెల్, హమాస్, రష్యా- ఉక్రెయిన్ దాడుల కారణంగా పది ట్రిప్పులు క్యాన్సిల్ అయ్యాయి. కొవిడ్- 19 సమయం నుంచే సందర్శకుల తాకిడి తగ్గుతూ వస్తోంది. టిక్కెట్ ధరలు రూ. 6లక్షల నుంచి రూ.21 లక్షల వరకు ఉంటాయి. అత్యంత రద్దీ సమయాల్లో వీటి ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. "సాధారణంగా ప్యాలెస్ ఆన్ వీల్స్ 70-80శాతం సామర్థ్యంతో నడిచేది. ఈ సీజన్లో చివరి ట్రిప్ కేవలం 26శాతంతో నడిచింది" అని ట్రైన్ ఆపరేటర్లు తెలిపారు.

# మా తొలి మిస్సైల్ దాడికే మీ నౌకలు మునిగిపోతాయ్..

### అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్



చమురు రవాణాకు ఎంతో కీలకమైన హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ సైనిక సలహాదారుడు మోహ్‌సేన్ రెజాయి అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తే.. తమ తొలి క్షిపణి దాడికే అమెరికా నౌకలు మునిగిపోతాయని వార్నింగ్ ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హర్మూజ్‌కు రక్షక భటుడిగా మారాలనుకుంటున్నారని, ఇది నిజంగా మీరు చేయాల్సిన పనేనా..? అమెరికా వంటి శక్తిమంతమైన సైన్యం చేయాల్సిన పనేనా..? అని రెజాయ్ ప్రశ్నించారు. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం చూపాలని చూస్తే తమ తొలి క్షిపణి దాడికే అమెరికా నౌకలు మునిగిపోతాయని హెచ్చరించారు. తమ క్షిపణులు కచ్చితమైన దాడులు చేసి అమెరికా నౌకలను ధ్వంసం చేయగలవని పేర్కొన్నారు. మా దాడుల్లో జలసంధి ప్రాంతంలో ఉన్న అమెరికా బలగాల ప్రాణాలు కూడా పోవచ్చని రెజాయ్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై భూతల దాడులకు అమెరికా సిద్ధమైందంటూ ఇటీవల పెద్దఎత్తున వచ్చిన వార్తలపై కూడా ఆయన మాట్లాడారు. భూతల దాడులకు వచ్చిన యూఎస్ సైనికులను బందీలుగా చేసుకుంటామని హెచ్చరించారు. వారిని విడిపించుకోవాలంటే.. ఒక్కో బందీకి ఒక బిలియన్ డాలర్ ఇవ్వాల్సి వస్తుందన్నారు. అమెరికా– ఇరాన్ మధ్య ప్రస్తుతం అమల్లో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాను వ్యక్తిగతంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు.

# అమెరికా మరో షాక్

### ఇరాన్ చమురుపై మళ్లీ ఆంక్షలు.. మరింత కఠినతరం



పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయింది. ఈ క్రమంలో ఇరాన్ చమురుపై మరిన్ని ఆంక్షలు విధిస్తూ.. అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. టెహ్రాన్‌పై ఆర్థిక ఒత్తిడిని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ బుధవారం (అమెరికా కాలమాన ప్రకారం) ఆంక్షలను ప్రకటించారు. ఇరాన్, రష్యా చమురు కొనుగోళ్లకు సంబంధించి ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా సడలించిన సంగతి తెలిసిందే. ఈ సడలింపును పొడిగించేది లేదని తాజాగా బెసెంట్ స్పష్టంచేశారు. ఈ క్రమంలోనే ఇరాన్ చమురు ఎగుమతులతో సంబంధాలున్న అనేకమంది వ్యక్తులు, చమురు సంస్థలు, నౌకలపై ఆంక్షలు విధిస్తున్నట్టు ట్రెజరీ శాఖకు చెందిన విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం ప్రకటించింది. ఆంక్షలకు గురైన సంస్థలు.. ఇరాన్ మాజీ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ రాజకీయ సలహాదారుడి కుమారుడు మహమ్మద్ హుస్సేన్ మానీ నేతృత్వంలోనివని తెలిపింది. ఫిబ్రవరిలో అమెరికా– ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో అలీ ఖమేనీ సలహాదారుడు ప్రాణాలు కోల్పోయారు. హర్మూజ్ జలసంధిలో ఇరాన్ నౌకల రాకపోకలను అమెరికా దిగ్బంధిస్తోన్న సంగతి తెలిసిందే. ఇది ఇరాన్‌పై ఆర్థికంగా తీవ్ర ఒత్తిడి కలిగించనున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ దేశ చమురుపై మరిన్ని ఆంక్షలు విధించడం గమనార్హం. ఇక, ఇరాన్ ఆర్థిక లావాదేవీలకు చైనా బ్యాంకులు సహకరించినట్టు తెలిస్తే.. వాటిపై ఆంక్షలు విధించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని బెసెంట్ హెచ్చరించారు.

**పెట్రో కెమికల్ ఎగుమతులు నిలిపివేసిన ఇరాన్**

తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అన్ని పెట్రో కెమికల్ ఎగుమతులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఇరాన్‌కు చెందిన జాతీయ పెట్రోకెమికల్ కంపెనీ పేర్కొంది. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు, శత్రు దాడులవల్ల కలిగిన నష్టాల నేపథ్యంలో దేశీయ పరిశ్రమలకు, వినియోగదారులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఎగుమతి అయి.. ఇంకా విదేశాలకు చేరని సరకును కూడా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా కంపెనీలకు సూచించింది.

# “సంక్షోభం కొనసాగితే విమానాలు రద్దే”



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం కారణంగా అనేక దేశాలు ఇంధన కొరత ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అంతర్జాతీయ ఇంధన సంస్థ కీలక వ్యాఖ్యలు చేసింది. ఐరోపావద్ద జెట్ ఫ్యుయల్ మరో ఆరు వారాలకు సరిపడా మాత్రమే ఉందని తెలిపింది. చమురు సంక్షోభం ఇలాగే కొనసాగితే.. విమాన సర్వీసులు రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని హెచ్చరించింది. హర్మూజ్ జలసంధి మార్గంలో ఇంధనం, గ్యాస్‌తోపాటు కీలక సరఫరా వ్యవస్థలకు ఆటంకం ఏర్పడటం వల్ల ఎన్నడూ చూడని ఇంధన సంక్షోభం ఏర్పడిందని ఐఈఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాతిహ్ బిరోల్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపాయన్నారు. ఈ సంక్షోభం ఎంతకాలం కొనసాగితే, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణానికి అంత ఎక్కువ నష్టం వాటిల్లుతుందన్నారు. దీని ప్రభావం వల్ల పెట్రోల్, గ్యాస్, విద్యుత్ ధరలు పెరుగుతాయన్నారు.

# యాంటీషిప్ స్వదేశీ మిస్సైల్‌ను పరీక్షించిన పాక్ నేవీ



స్వదేశీయంగా అభివృద్ధి చేసిన యాంటీషిప్ మిస్సైల్‌ను పాకిస్థాన్ నేవీ విజయవంతంగా పరీక్షించింది. చాలా దూరంలో ఉన్న టార్గెట్లను మిస్సైల్ చేరుకోగలదని పాక్ మిలిటరీ పేర్కొంది. నౌకలనుంచి లాంచ్ చేసే ఆ యాంటీషిప్ మిస్సైల్‌ను నేవీ విజయవంతంగా పరీక్షించినట్టు ఐఎస్పీఆర్ ప్రకటించింది. నేవీ చీఫ్ అడ్మిరల్ నవీద్ అష్రఫ్‌తోపాటు ఇతర శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు .. మిస్సైల్ ఫైరింగ్ ఈవెంట్‌ను వీక్షించారు. అత్యాధునిక గైడెన్స్ సిస్టమ్‌తో పాటు అడ్వాన్స్‌డ్ మాన్యువరబులిటీ ఉన్నట్లు పేర్కొన్నారు. శత్రువుల క్షిపణులనుంచి తప్పించుకునే సామర్థ్యం ఉన్నట్లు ప్రకటనలో తెలిపారు. పరిస్థితులకు తగినట్టు డైనమిక్‌గా మారుతుందని, చాలా కచ్చితత్వంతో ఆ క్షిపణి ప్రాణాంతకంగా మారుతుందని మిలిటరీ పేర్కొన్నది. ప్రాంతీయ సముద్ర భద్రత, స్థిరత్వం నేపథ్యంలో మిస్సైల్ ఫైరింగ్ ఈవెంట్ నిర్వహించినట్టు చెప్పారు. అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్, సీడీఎఫ్ అసిమ్ మునీర్ తాజా పరీక్షపట్ల హర్షం వ్యక్తం చేశారు.

# లష్కరే కోఫౌండర్ ఆమిర్‌పై కాల్పులు

**- లాహోర్‌లో ఘటన**



పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా వ్యవస్థాపక సభ్యుడు ఆమిర్ హమ్‌జాపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపిన ఘటన లాహోర్‌లో చోటుచేసుకుంది. ప్రస్తుతం ఆస్పత్రిలో చేరిన అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఉగ్రవాది హఫీజ్ సయీద్‌తో కలిసి 1985లో లష్కరే తోయిబాను హమ్‌జా స్థాపించారు. ఇండియాలో జరిగిన అనేక ఉగ్రవాద కార్యకలాపాలకు అతనికి లింకులున్నాయి. హఫీజ్ సయీద్ తర్వాత హమ్‌జా లష్కరే గ్రూపులో రెండో కీలక వ్యక్తిగా ఎదిగారు. హమ్‌జాను ఉగ్రవాదిగా అమెరికా ముద్రవేసింది. లాహోర్‌లో ఉన్న ఓ న్యూస్ ఛానల్ ఆఫీసు ఆవరణలో అతనిపై కాల్పులు జరిపారు. 1959లో ఆమిర్ హమ్‌జా జన్మించారు. అతను మాజీ ఆఫ్ఘన్ ముజాయిదిన్. లష్కరే ఐడియాలజీలో కీలక వ్యక్తి. అతని వయసు 66 ఏళ్లు. చాలా ధాటిగా అతను మాట్లాడగలడు, రాయగలడు. టెర్రర్ గ్రూపునకు చెందిన ఓ పబ్లికేషన్‌ను అతను ఎడిట్ చేస్తాడు. అనేక పుస్తకాలు రాశాడతను. ఖాఫిలా దావత్, షాహదత్ బుక్స్ అతనే రాశాడు. 2018నుంచి లష్కరేతో హమ్‌జా దూరంగా ఉంటున్నాడు. లష్కరే ఫండింగ్‌పై ప్రభుత్వం నిఘా పెట్టడంతో అతను తన కార్యకలాపాలను తగ్గించుకున్నాడు. ఆ తర్వాత అతను జైషే మన్‌కాఫా సంస్థను స్థాపించాడు. దాని ద్వారా లష్కరే కోసం ఫండ్స్ సేకరించాడు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాల కోసం ఆ డబ్బును వాడేవాడు.

# టెహ్రాన్‌లో అసిమ్ మునీర్

**- అణ్వస్త్ర అంశాలపై ఇంకా ప్రతిష్టంభన**



పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ ప్రస్తుతం ఇరాన్‌లో పర్యటిస్తున్నారు. టెహ్రాన్‌లో ఆయన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగాచితో భేటీ అయ్యారు. అయితే అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తలను తగ్గించే నేపథ్యంలో అసిమ్ మునీర్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే యుద్ధం విషయంలో ఇరాన్, అమెరికా మధ్య కొన్ని అంశాల్లో అగ్రిమెంట్ కుదిరింది. రెండు వారాల సీజ్‌ఫైర్ నేపథ్యంలో ఇంకా కొన్ని తేలని అంశాలున్నాయి. ఇరాన్ చేపట్టే అణ్వస్త్ర కార్యక్రమాల గురించి రెండు దేశాల మధ్య ఒడంబడిక కుదరలేదని ఓ సీనియర్ ఇరానీ అధికారి తెలిపారు. అసిమ్ మునీర్ రాకవల్ల అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభన కొంత తగ్గినట్టు ఓ అధికారి చెప్పారు. కొన్ని అంశాల్లో అంగీకారం కుదిరిందని, అయితే టెహ్రాన్, వాషింగ్టన్ మధ్య చర్చలవల్ల సీజ్‌ఫైర్‌ను మరింత పొడిగిస్తారన్న భావన వస్తోందని ఆ అధికారి తెలిపారు. కేవలం అణ్వస్త్ర రంగం అంశంలో మాత్రం అమెరికా, ఇరాన్ మధ్య బేధాభిప్రాయాలు వస్తున్నట్టు వెల్లడించారు. శుద్ధీకరించిన యురేనియంతోపాటు న్యూక్లియర్ ఆంక్షల అంశంలో ఇంకా అంగీకారం కుదరలేదని తెలుస్తున్నట్టు ఆ అధికారి చెప్పారు. అమెరికా, ఇరాన్ మధ్య జరిగే రెండో దఫా చర్చలపై ఇంకా తేదీలను నిర్ణయించలేదని పాకిస్థాన్ విదేశాంగ ప్రతినిధి తెలిపారు. ప్రస్తుతం ఆ దేశాలు న్యూక్లియర్ అంశాలపై చర్చిస్తున్నాయన్నారు.

# క్యాండిడేట్స్ చెస్ విజేత వైశాలి



- ఈ టైటిల్ నెగ్గిన తొలి భారత మహిళగా చరిత్ర
- వెన్‌జున్‌తో ప్రపంచ టైటిల్ పోరుకు అర్హత
- ప్రజ్ఞానంద, దివ్యకు ఏడో స్థానం
- ఓపెన్ విభాగం విజేత సిందరోవ్

పఫోస్ (సైప్రస్): భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేష్ బాబు చరిత్ర సృష్టించింది. ఈ 24 ఏళ్ల చెన్నై స్టార్ ప్రతిష్ఠాత్మక ఫిడే క్యాండిడేట్స్ చెస్ మహిళల టైటిల్‌ను కైవసం చేసుకుంది. తద్వారా క్యాండిడేట్స్ టోర్నీ గెలిచిన తొలి భారత మహిళగా అరుదైన ఘతన సాధించింది. ఈ విజయంతో చదరంగ యువరాణిగా నిలిచిన వైశాలి.. చాలెంజర్ హోదాలో ప్రపంచ టైటిల్ కోసం డిఫెండింగ్ చాంపియన్, చైనా గ్రాండ్‌మాస్టర్ వెన్‌జున్‌తో తలపడేందుకు అర్హత సాధించింది. ఈ ఏడాది ఆఖర్లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ వేదిక, తేదీలను ఫిడే ఖరారు చేయాల్సి ఉంది. ఇక..క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో ఉజ్బెకిస్థాన్ గ్రాండ్‌మాస్టర్ జవోఖిర్ సిందరోవ్ మంగళవారంనాటి 13వ రౌండ్ నాటికే విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. దరిమిలా..ప్రస్తుత వరల్డ్ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ తో టైటిల్ కోసం సిందరోవ్ పోటీపడతాడు.

ఒత్తిడిని అధిగమించి బుధవారం తప్పక గెలవాల్సిన క్యాండిడేట్స్ టోర్నీ ఆఖరిదైన 14వ రౌండ్‌లో తెల్లపావులతో ఆడిన వైశాలి 48 ఎత్తుల్లో కాటరినా లగ్నో (రష్యా)ను చిత్తు చేసింది. దాంతో మొత్తం 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన వైశాలి క్యాండిడేట్స్ టైటిల్ సొంతం చేసుకుంది. అంతకుముందు రోజు 13వ రౌండ్ ముగిసే సరికి బిబిసార అసుబయేవా (కజకిస్థాన్), వైశాలి చెరో 7.5 పాయింట్లతో టైటిల్ రేసులో నిలిచారు. కానీ చివరి రోజు ఆఖరి గేమ్‌లో బిబి సారను భారత గ్రాండ్‌మాస్టర్ దివ్యా దేశ్‌ముఖ్ నిలువరించింది. ఫలితంగా బిబిసార 8 పాయింట్లతో నిలిచింది. ఈనేపథ్యంలో లగ్నోతో ఆఖరి రౌండ్‌లో వైశాలి నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే తీవ్ర ఒత్తిడి అధిగమించి, లగ్నోను ఓడించడంతో క్యాండిడేట్స్ కిరీటం వైశాలికి దక్కింది. ఓవరాల్‌గా 14 రౌండ్ల లో ఐదు గేమ్‌లను గెలిచిన వైశాలి, ఏడింటిని డ్రా చేసుకుంది. రెండు గేమ్‌లలో ఓటమి పాలైంది. ఈ టైటిల్‌తోపాటు వైశాలి రూ. 31 లక్షలు ప్రైజ్‌మనీగా అందుకుంది. బిబిసార రన్నర్‌పగా నిలిచింది. దివ్య 5.5 పాయింట్లతో ఏడో స్థానంతో టోర్నీని ముగించింది. ఓపెన్ విభాగంలో సిందరోవ్‌కు టైటిల్ గత రౌండ్‌లోనే ఖరారుకాగా..బుధవారం జరిగిన 14వ రౌండ్‌లో వీ యీ (చైనా)తో గేమ్‌ను అతడు డ్రా చేసుకున్నాడు. మొత్తం 10 పాయింట్లతో సిందరోవ్ అగ్రస్థానంలో నిలిచాడు. డచ్ గ్రాండ్‌మాస్టర్ అనీష్ గిరి (8.5) రన్నర్‌పతో సరిపెట్టుకు న్నాడు. వైశాలి సోదరుడు ప్రజ్ఞానంద 6.5 పాయింట్లతో ఏడోస్థానానికి పరిమితమయ్యాడు. నకమురా (అమెరికా)తో ఆఖరి రౌండ్‌ను ప్రజ్ఞానంద డ్రాగా ముగించాడు.

**చాలెంజర్ అంటే..**

ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో ఇద్దరే పోటీపడతారు. ఒకరు డిఫెండింగ్ చాంపియన్.. మరొకరు చాలెంజర్. క్యాండిడేట్స్ టోర్నీ నెగ్గిన వారే చాలెంజర్. క్వాలిఫికేషన్ ప్రక్రి య ద్వారా 8 మంది ఆటగాళ్లను క్యాండిడేట్స్ టోర్నీకి ఎంపిక చేస్తారు. రెండేళ్ల క్రితం క్యాండిడేట్స్ టోర్నీ ఓపెన్ విభాగంలో విజేతగా నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్.. చాలెంజర్‌గా పోటీపడి ప్రపంచ చాంపియన్‌గానూ అవతరించిన సంగతి తెలిసిందే. ఆనంద్, గుకేశ్ తర్వాత క్యాండిడేట్స్ టోర్నీ నెగ్గిన మూడో భారత ప్లేయర్‌గా వైశాలి.

## బంగ్లా క్రికెట్ అభిమానులకు షాక్

*- రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ బౌలర్*



*బంగ్లాదేశ్ పేసర్ రూబెల్ హొస్సేన్ అభిమానులకు బిగ్ షాక్ ఇచ్చాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ విషయాన్ని ఫేస్‌బుక్ పోస్ట్ ద్వారా వెల్లడించాడు. 36 ఏళ్ల రూబెల్ 2009లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. ఆడిన తొలి వన్డేలోనే నాలుగు వికెట్లు తీసిన తొలి బంగ్లాదేశ్ బౌలర్‌గా రూబెల్ చరిత్ర సృష్టించాడు. తన 16 ఏళ్ల కెరీర్‌లో 159 మ్యాచ్‌లు ఆడి 193 వికెట్లు తీశాడు. అలానే 27 టెస్ట్‌ల్లో 36 వికెట్లు, 104 వన్డేల్లో 129 వికెట్లు, 28 టీ20ల్లో 28 వికెట్లు పడగొట్టాడు. బంగ్లాదేశ్ తరఫున రూబెల్ 2021 ఏప్రిల్‌లో తన చివరి మ్యాచ్ (టీ20) ఆడాడు. ఆ తర్వాత ఐదేళ్ల పాటు అవకాశాల కోసం ఎదురుచూసిన సెలక్టర్ల దృష్టిని ఆకర్షించలేకపోయాడు. చివరికి అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు తాజాగా ప్రకటించాడు. ఇకపై దేశవాళీ క్రికెట్‌లో కొనసాగుతూ యువ ఆటగాళ్లకు మార్గదర్శకుడిగా ఉంటానని రూబెల్ స్పష్టం చేశాడు. రిటైర్మెంట్ సందేశంలో అభిమానులు, కుటుంబం, మీడియాకు కృతజ్ఞతలు తెలిపాడు. పరిమిత ఓవర్ల స్పెషలిస్ట్‌గా పేరుగాంచిన రూబెల్ రివర్స్ స్వింగింగ్ యార్కర్లు వేయడంలో దిట్ట. 2015 వన్డే ప్రపంచ కప్?లో పటిష్ఠమైన ఇంగ్లండ్‌ను మట్టి కరిపించడంలో రూబెల్ కీలకపాత్ర పోషించాడు. ఆ మ్యాచ్‌లో అతను వేసిన 4/53 స్పెల్ బంగ్లాదేశ్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. వన్డే క్రికెట్‌లో బంగ్లాదేశ్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఐదో వ్యక్తిగా రూబెల్ నిలిచాడు. 2013లో న్యూజిలాండ్‌పై అతను సాధించిన ఆరు వికెట్లలో ఒక హ్యాట్రిక్ కూడా ఉంది. అంతేకాక రూబెల్, టీమిండియా క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ మధ్య అనేక సందర్భాల్లో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి.*

# మ్యాచ్ జరుగుతుండగా దోశ, ఇడ్లీ పాట

***- బీసీసీఐకి చెన్నై సూపర్‌కింగ్స్ ఫిర్యాదు***



సాధారణంగా క్రికెట్‌లో కొన్ని జట్ల మధ్య మ్యాచ్ అంటే అభిమానులు ఎంతో ఆసక్తిగా చూస్తుంటారు. అలాంటి మ్యాచులకూ మైదానాలు ఫుల్ అవుతుంటాయి. అదేవిధంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ అంటే.. స్టేడియం కిక్కిరిసి పోతుంది. ఈ రెండు జట్ల మధ్య క్రీడా వైరమే అందుకు కారణమని క్రీడా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఈ క్రమంలోనే ఓ అనూహ్య పరిణా మం చోటుచేసుకుంది. దోశ, ఇడ్లీ అనే పాటపై బీసీసీఐకి సీఎస్కే ఫిర్యాదు చేసింది. ఐపీఎల్ 2026లో భాగంగా ఏప్రిల్ 5న చిన్న స్వామి స్టేడియం వేదికగా బెంగళూరు, చెన్నై జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో 43 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్ ఓడింది. అయితే ఈ మ్యాచ్ ఫలితం పక్కన పెడితే సీఎస్కే ఇన్నింగ్స్ ప్రారంభానికి ముందు 'దోశ, ఇడ్లీ, సాంబార్, చట్నీ' అంటూ ఓ డీజే ప్లే చేశారు. ఈ పాటపై చెన్నై జట్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'దోశ, ఇడ్లీ, సాంబార్, చట్నీ' అనే పదాలను వాడుతూ తమిళనాడు గుర్తింపును ఎగతాళి చేశారని బీసీసీఐకి సీఎస్కే ఫిర్యాదు చేసింది. స్టేడియంలో తమ ఆటగాళ్లను, తమిళ సంస్కృతి ని కించపరిచేలా ప్రవర్తించారంటూ ఫిర్యాదులో పేర్కొంది. చెన్నై సూపర్ కింగ్స్ సీఈవో కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ సాధార ణంగా డీజేలు హోమ్ టీమ్‌కు మద్దతుగా ఉంటారు. ఆ విషయాన్ని మేము తప్పుగా భావించడం లేదు. కానీ చిన్నస్వామి స్టేడియంలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇడ్లీ, దోశ అనే పాటను ప్లే చేస్తూ మా ఆటగాళ్లను డీజే కించపరిచాడు. దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఈ విషయం పై మేము బీసీసీఐకి లేఖ రాశామని తెలిపాడు. 2025 నుంచే 'దోశ, ఇడ్లీ' పాట వివాదం నడుస్తోంది. గత సీజన్‌లో ఆర్సీబీ ప్లేయర్ జితేశ్ శర్మ ఈ పాట పాడటంపై సోషల్ మీడియాలో రచ్చ జరిగింది. అప్పట్లో చెపాక్ స్టేడియంలో జితేశ్ ఔటైనప్పుడు అదే పాటను ప్లే చేసి సీఎస్కే డీజే సభ్యులు బదులి చ్చారు. కానీ వారి మేనేజ్‌మెంట్ జోక్యం చేసుకుని ప్రత్యర్థి ఆటగాళ్లను టార్గెట్‌గా చేసుకుని కించపరచొద్దని ఆదేశాలు ఇచ్చింది. తాజాగా ఈ పాట వివాదం మళ్లీ వెలుగులోకి వచ్చింది. ఐపీఎల్ లో చాలా కాలం చెన్నై సూపర్ కింగ్స్ తమ ప్రాంతీయ ప్రత్యర్థులపై పై చేయి సాధిస్తూ వచ్చింది. కానీ ఇటీవలి కాలంలో పరిస్థితి తారుమా రైంది. 2024 నుంచి ఇటీవలి మ్యాచ్‌తో కలిపి సీఎస్కేపై ఆర్సీబీ వరుసగా నాలుగు మ్యాచ్‌లను గెలిచింది.

# 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'లో ఆర్సీబీ ప్రత్యేకం

***- ఆ నలుగురు విదేశీ ఆటగాళ్లే***





ఐపీఎల్2026లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై 5 వికెట్ల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించింది. దీంతో ఈ డిఫెండింగ్ ఛాంపియన్ ఇప్పటి వరకు ఆడిన ఐదు మ్యాచుల్లో నాలుగింట్లో విజయం సాధించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అదర గొడుతూ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది.

ఎల్ఎస్‌జీ మ్యాచ్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన చేసిన జోష్ హేజిల్‌వుడ్‌ను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. ఈ క్రమంలో ఓ ఆసక్తికర అంశం బయటపడింది. ఈ సీజన్‌లో ఆర్సీబీ తరపున నాలుగు మ్యాచుల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లను గెలుచుకున్న ప్లేయర్లంతా విదేశీ క్రికెటర్లే కావడం గమనార్హం. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై జాకబ్ డఫీ (న్యూజిలాండ్), చెన్నై సూపర్ కింగ్స్‌పై టిమ్ డేవిడ్ (ఆస్ట్రేలియా), ముంబై ఇండియన్స్‌పై ఫిల్ సాల్ట్ (ఇంగ్లాండ్, లఖ్‌నవూపై జోష్ హేజిల్‌వుడ్ (ఆస్ట్రేలియా)లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందుకున్నారు. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే.. 2025 నుంచి బెంగళూరు తరపున 10 మంది వేరువేరు ఆటగాళ్లు ఈ అవార్డులను అందుకొన్నారు. ఐపీఎల్‌లో మరే జట్టులోనూ ఇలాంటిది చోటుచేసుకోలేదు. ఇక లఖ్‌నవూ మ్యాచ్‌లో జోష్ హేజిల్‌వుడ్ చక్కడ బౌలింగ్ వేశాడు. నాలుగు ఓవర్ల కోటాలో 20 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ తీశాడు. ప్లేయర్ ఆఫ్ ది అవార్డు అందుకున్న సందర్భంగా జోష్ మాట్లాడుతూ.. వరుసగా తాము నాలుగు మ్యాచులు గెలిచామని, వారి షెడ్యూల్ కూడా బాగుందని తెలిపాడు. అలానే ముమ్ముందూ ఇదే వ్యూహం కొనసాగిస్తామని అనుకుంటున్నామని జోష్ తెలిపాడు.

# ఆకట్టుకున్న 'ఎట్టా.. ఎట్టా'

అఖిల్ లేటెస్ట్ యాక్షన్ ఎంటర్టైనర్ 'లెనిన్'నుంచి సెకండ్ సింగిల్ 'ఎట్టా ఎట్టా' వీడియో సాంగ్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. భాస్కరభట్ల సాహిత్యం అందించగా.. థమన్, ఎస్ శ్రీకృష్ణ కలిసి పాడారు. థమన్ సంగీతం అందించాడు. కిషోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకుడు. అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, వంశీ ఐరటనేని నిర్మిస్తున్నారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో ఒక వైవిధ్యమైన మాస్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి.






# 'స్వయంభూ' నుంచి సాంగ్ ప్రోమో



నిఖిల్ సిద్ధార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'నుంచి తాజాగా సాంగ్ ప్రోమో విడుదలైంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకులనుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు సాంగ్ ప్రోమోతో మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. 'రా రా ధీవర' పాటకి సంబంధించిన విడుదల చేసిన ప్రోమో –సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. దీనికి సంబంధించిన ఫుల్ సాంగ్‌ను విడుదల చేస్తున్నారు. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీస్థాయిలో సందడి చేయనుంది.

# తస్సాదియా.. అదరగొట్టింది

సమంత రుతు ప్రభు లీడ్ రోల్‌లో రూపుదిద్దుకుంటున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం'. సమంత తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'పై సినిమా నిర్మిస్తుండగా.. తాజాగా ఈ చిత్రం నుండి ఫస్ట్ సింగిల్ 'తస్సాదియ్య' వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ ఈ చిత్రానికి అద్భుతమైన బాణీలు అందించగా.. 'తస్సాదియ్య' పాట ఒక ఫ్యామిలీ పార్టీ సాంగ్‌లా ఉండి, వినేవారిలో జోష్ నింపుతోంది. ఈ పాటను ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాద, పుణ్య కలిసి పాడారు. సమంత తనదైన స్టెప్పులతో ఈ వీడియో సాంగ్‌లో సందడి చేశారు. 'ఓ బేబీ' వంటి హిట్ తర్వాత సమంత, దర్శకురాలు బీవీ నందినీ రెడ్డి కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. ఈ సినిమాలో సమంత ఒక సాధారణ ఇల్లాలిగా కనిపిస్తూనే, తన కుటుంబాన్ని కాపాడుకునే పవర్‌ఫుల్ మహిళగా కనిపించబోతున్నారు. సమంత భర్త రాజ్ నిడిమోరు సినిమాకు కథను అందిస్తున్నాడు.

# పవర్‌పేట.. ప్రాజెక్టు కదిలింది

'పవర్ పేట' సినిమాపై గురువారం అధికారిక ప్రకటన వెలువడింది. సందీప్ కిషన్ యాక్టింగ్ కెరీర్‌కు 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కొత్త సినిమా పోస్టర్‌ను టీమ్ విడుదల చేసింది. చెస్ బోర్డుపై రక్తపు మరకలు, ఎర్ర గులాబీతో డిజైన్ చేసిన పోస్టర్ సినిమాపై ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ప్రేమ, గౌరవం, రాజకీయం ప్రధానాంశాలుగా సినిమా తెరకెక్కనున్నట్లు అర్థమవుతోంది. కృష్ణచైతన్య దర్శకత్వం వహించే చిత్రానికి మణిశర్మ మ్యూజిక్ డైరెక్టర్. 70ఎంఎం ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. హీరోయిన్, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. 'రౌడీ ఫెలో'తో దర్శకుడిగా మారిన కృష్ణచైతన్య.. 'ఛల్ మోహన్ రంగ', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' తెరకెక్కించారు. ఎప్పటినుంచో 'పవర్‌పేట'పై చర్చ నడుస్తోంది. చైతన్య ముందుగా ఈ సినిమాని నితిన్‌తో తెరకెక్కిస్తున్నట్టు గతంలో వార్తలొచ్చాయి. కానీ, అది కార్య రూపం దాల్చలేదు. ఈ క్రమంలో విశ్వక్సేన్ పేరు తెరపైకి వచ్చింది. దానిపైనా స్పష్టత రాకపోవడంతో.. సందీప్ కిషన్‌తో చేయనున్నారంటూ ఇటీవల ప్రచారం జరిగింది. ఎట్టకేలకు ఇప్పుడు అనౌన్స్మెంట్ వచ్చింది. సందీప్ విషయానికొస్తే.. 'ప్రస్థానం'తో ఆయన సినీ ప్రయాణం మొదలైంది. దేవ కట్టా తెరకెక్కించిన మూవీలో ఆయన నెగెటివ్ షేడ్స్ ఉన్న ఓ కీలక పాత్రలో నటించారు. 2010 ఏప్రిల్ 16న ఈ సినిమా విడుదలైంది. హీరోగా 'వెంకటాద్రి ఎక్స్ప్రెస్', 'రారా కృష్ణయ్య', 'నగరం', 'మజాకా' తదితర చిత్రాలతో అలరించారు. ప్రస్తుతం 'సిగ్మా'లో నటిస్తున్నారు. కోలీవుడ్ ప్రముఖ నటుడు విజయ్ తనయుడు జాసన్ సంజయ్ ఈ చిత్రంతో డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు.








# తమన్నా పిటిషన్ కొట్టివేత

'పవర్ సోప్స్' కంపెనీపై నటి తమన్నా దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. తన ఆరోపణలకు సంబంధించి నటి తగిన సాక్ష్యాలు చూపలేకపోవడంతో పిటిషన్‌ను న్యాయ స్థానం తోసిపుచ్చింది. బ్రాండ్ ప్రమోషన్‌కు సంబంధించి తమన్నా,పవర్‌సోప్స్ కంపెనీ మధ్య 2008లో ఒప్పందం కుదిరింది. 2009 అక్టోబరు వరకూ తమన్నా ఫొటోలతో పవర్‌సోప్స్ ప్రచారం చేసుకోవడం అగ్రిమెంట్. అయితే ఒప్పందం గడువు ముగిసినప్పటికీ 2010–2011 మధ్య సదరు సంస్థ తన ఇమేజ్‌లను అనధికారికంగా వినియోగించుకుందని తమన్నా ఆరోపించారు. ఇందుకుగానూ సంస్థ నుంచి రూ.కోటి నష్టపరిహారం డిమాండ్‌చేస్తూ..ఆ కంపెనీ తన ఫొటోలు వాడకుండా చేయాలంటూ తమన్నా ఇటీవల కోర్టును ఆశ్రయించారు. ఏకసభ్య ధర్మాసనం తీర్పును సవాలు చేస్తూ మరో పిటిషన్ వేశారు. సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ పిటిషన్‌ను ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది.

# శరవేగంగా వృషకర్మ

అక్కినేని నాగ చైతన్య, మీనాక్షి చౌదరి జోడీగా నటిస్తున్న భారీ చిత్రం "వృష కర్మ". విరూపాక్షతో సత్తా చాటిన దర్శకుడు కార్తీక్ వర్మ దండు సినిమాని అంతకుమించిన అడ్వెంచర్ థ్రిల్లర్ మిస్టరీగా తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ సినిమా షూట్‌పై లేటెస్ట్ అప్డేట్ ఒకటి బయటకి వచ్చింది. యువ హీరో నాగ చైతన్య లేటెస్ట్ ఇంటరాక్షన్‌లో ఈ సినిమా షూటింగ్ 85 శాతం పూర్తయ్యినట్టు కన్ఫర్మ్ చేసాడు. మిగతాది కూడా త్వరలోనే కంప్లీట్ కానుంది. సో ఈ సినిమా విడుదలకి పెద్దగా సమయం తీసుకోకపోవచ్చని చెప్పాలి. ఇక ఈ సినిమాకి అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తుండగా విరూపాక్ష నిర్మాణ సంస్థ అధినేత బివిఎస్ఎన్ ప్రసాద్ భారీ బడ్జెట్‌తో అత్యున్నత ప్రమాణ విలువలు సెట్ చేసి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తున్నారట.

